## పెద్దకథ



# రెక్కలగూడు

బమ్మిడి జగదీశ్వరరావు

ఇల్లు నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దం భరించలేనట్టూ వుంది అయినా భరిస్తున్నట్టుగానే ఆ ఇంట్లోని గడియారం ముల్లు నిశ్శబ్దాన్ని చీల్చే ప్రయత్నం చేయడం లేదు. కదలకుండా రెండుముల్లులూ పన్నెండు దగ్గరే వుండిపోయాయి. చాలా రోజులుగా అవి అలానే వున్నాయనడానికి సాక్ష్యంగా గడియారం మీద దుమ్ముతో పాటు బూజు చేరింది.

సూరీడు ఆకాశంలోకొచ్చి నాలుగ్గంటలయినా గడిచే వుంటాయి. కాని ఆ ఇంటికున్న రెండు తలుపులూ తెరుచుకోలేదు. అందుకే ఇల్లు చీకటిగా వుంది. కిటికీ సందుల్లోంచి కిరణాలు చొరబడి చీకట్ని కొద్ది కొద్దిగా మింగుతున్నాయి.

ఆ ఇంటిలో పడమటి దిశన వున్న గదిలో పాత పరుపు మీద భాగ్యం మూలుగుతోంది. కన్నీటిని తోడితోడి కనురెప్పలు అలసిపోయి నట్టు మూసుకొనివున్నా, ఆమె మెలకువగానే వుంది. రొమ్ముని చప్పరించుకుంటూ ఎప్పుడు నిద్రలోకి జారిపోయిందో గాని ఏడాదిపాప ఆమె పక్కలోనే వుంది.

సరీగప్పుడే తలుపు చప్పుడవుతూ తెరచుకుంది... ఎవరూ? భాగ్యం అనబోయింది. కాని నోరు పెగల్లేదు.

"అమ్మా... భాగ్యం.. భాగ్యం.." పిలుపుతో పాటు వెలుగు చొరబడింది. భాగ్యం ఆ గొంతుని గుర్తుపట్టింది.

భాగ్యం పక్కమీంచి లేవాలనుకొని ప్రయత్నించింది. శరీరం సహకరించలేదు. పైగా వళ్ళంతా పచ్చిపుండయిపోయి గాయాలు సలుపుతున్నాయి. మనసయితే మరీ నొప్పిగా వుంది. ఏదో తలపుకొచ్చి మూసివున్న కనుబొమ్మల్లోంచి కన్నీళ్ళు జారిపోతున్నాయి. కనులు తెరచి చూసింది. మసకగా ఆకారం తన దగ్గరికే వస్తోంది.

భాగ్యం కళ్ళు తుడుచుకుంది. రొమ్ముని నోట్లో నిడుకున్న పిల్లని కొద్దిగ ఎడంగా జరిపింది. ఒక చేత్తో జాకట్టు పట్టుకొని మరో చేత్తో

రొమ్ముని జాకట్లోకి దోపుకొని గుండీలు పెట్టుకొని పైట సర్దుకుంది.

"ఏమిటమ్మా.. చీకట్లో తొంగున్నావ్? లే.. పొద్దు ఎంతెక్కిందో చూడు" అంటూనే కిటికీ తలుపులు తెరచివచ్చి, భాగ్యం పడుకున్న పక్కమీదనే కూర్చుంది పార్వతమ్మ.

భాగ్యం లేచి కూర్చోబోయింది. వశం కావడంలేదు. అయినా ప్రయత్నం చేసింది. రెండు చేతుల్తో మంచాన్ని పట్టుకొని కూర్చోబోతే పార్వతమ్మ మరికొంత ఆసరా ఇచ్చింది.

"ఈ లోకంలో మగోలంత మృగాల్లేరు. అసలీ బూమ్మీద పుట్టి, పెళ్ళాం మీద చెయ్యి చేసుకొని పెనిమిట్లున్నారా? ఆడజలమ్మంత పాడు జలమ్మలేదు...." పార్వతమ్మ తన జీవితాన్ని తడుముకుంటూనే భాగ్యం వంటిమీద దెబ్బల్ని తడిమింది.

భాగ్యానికా మాటలు ఊరట నివ్వలేదు. సత్తువ లేని శరీరం ప్రాణముండీ చలనం లేక నిర్జీవంగా తోస్తోంది.

"నువ్వొక్క గడియ కూకోయమ్మ, వేణ్ణీలు తెచ్చి కాపడం పెడతాను.. ఒక రవ్వ టీ కూడా చేస్తాను, తాగుదువు..." అంటూనే పార్వతమ్మ కూర్చున్న చోటు నుంచి లేచింది. ఆ గదికి వెనుక పక్క కుడిచేతి వేపు వున్న చిన్న వంటగదిలోకి వెళ్ళింది. గ్యాస్టవ్వు ముట్టించింది. ఒక వైపు వేణ్ణీలు పెట్టి, మరో పక్క టీ పెట్టింది. అవి అయ్యేంతలోపే పాలడబ్బా తీసి గుండ కలిపింది. చల్చార్చాక పిల్లదానికోసమని సీసాలో పోసింది.

భాగ్యం ఎన్నో ఏళ్ళుగా ఆ ఇంట్లోనే కాపురముంటున్నా, ఏదో కొత్తగా వున్నట్టు బిక్కుబిక్కుగా గోడలవంకా గదిపై భాగానికేసి చూస్తోంది.

"ఇదమ్మా టీ తాగు ముందల...." అంటూ పార్వతమ్మ టీ తెచ్చి భాగ్యానికి ఇచ్చింది. వేణ్ణీళ్ళూ గుడ్డా తీసుకొచ్చి కాపడం పెట్టడానికి సిద్ధంగా కూర్చుంది.

భాగ్యం టీ తాగుతూ పార్వతమ్మ వంక చూసింది. తల అక్కడక్కడా నెరసి రాబోయే వృద్ధాప్యాన్ని తెలియజేస్తోంది. అయినా పార్వతమ్మ సత్తువగలదిగా వున్నట్టు ఆమె శరీరంకాక ఆ కళ్ళు చెపుతున్నాయి.

"నువ్వో.." టీ తాగవా అన్నట్టు అడిగింది భాగ్యం.

"నేను తాగాను" అని చెప్పి, మరి వద్దన్నట్టుగా అడ్డంగా తలూపింది పార్వతమ్మ.

భాగ్యం టీని మింగుతున్నా, ఏదో నిశ్శబ్దాన్ని కూడా కక్కలేక మింగుతున్నట్టు గానే వుంది. పెదవులు భరించలేక మనసుకు తలుపులై తెరచుకున్నాయి.

"ఎవరు శ్రీను చెప్పేడా?" టీ తాగడం పూర్తి చేస్తూ అడిగింది భాగ్యం.

అవునన్నట్టు తలూపింది పార్వతమ్మ. ఎందుకో పార్వతమ్మ ముఖం అంతలోనే వాడిపోయింది. భాగ్యం అది గమనించింది. అంచనా కూడా వెయ్యగలుగుతోంది. అయినా అడగకూడదనుకుంటూనే భాగ్యం మళ్ళీ అడిగింది.

"శ్రీను రాత్రి ఇంట్లో పడుకోలేదా..?"

లేదన్నట్టు అడ్డంగా తలవూపి "ఇక్కడా పడుకోలేదా?" తలదించుకొనే అడిగింది పార్వతమ్మ.

"ఆయన వున్నారు గదా?!" భాగ్యం ఈ దపా తలదించుకుంది.

కొద్దిసేపు ఇద్దరి మధ్యా మాటలు లేవు. వేణ్ణీళ్ళు చల్లబడుతున్నాయి. పిల్లది నిద్దట్లో తులుక్కుపడి అటూ ఇటూ దొర్లి ఏడుపందుకోబోయింది. భాగ్యం పిల్లని నిద్రపుచ్చుడానికి జోకొట్టింది.

పార్వతమ్మ ఆ చిన్న పిల్ల ముఖంలోకి చూసింది. తన పురిటి రోజులూ...ఆ పురిటి వాసనలో తడిచిన పిల్లాడూ....ఇప్పుడెదిగి తనని మించిన కొడుకు శ్రీనూ గుర్తుకొచ్చాడు.

మంచం మీద చిన్న పిల్ల ముఖం అచ్చం శ్రీను ముఖంలానే వుంది. అచ్చుగుద్దినట్టు అలాగే వుంది. శ్రీను కూడా చిన్నప్పుడు అలాగే వుండేవాడు. అదే కోల ముఖం...సూది ముక్కు.... లావుపాటి కింది పెదవి.... అందులో సగమేవున్న పై పెదవి...

పిల్లది ఆవులింత తీసింది.

నోరుసాగినప్పుడూ.....నవ్వినప్పుడూ బుగ్గల్లో చిల్లి!

ముమ్మూర్తులా శ్రీనే శ్రీను!

"కొడుకుకి పెళ్ళి చెయ్యకుండానే మనుమల్ని ఎత్తుకుంటోంది పార్వతమ్మ.."

"ప్రయోజకుడయిన కొడుకు, తల్లికి-తనపెళ్ళికాకుండానే మనుమల ముచ్చట తీర్చుకున్నాడు..."

"మరి కోడలి అచ్చటో...?"

"సారే చీరలేదుగాని, సంబరమంతా వుంది...."

అన్నవన్నీ గుసగుసలూ కావు. గుట్టు చప్పుడుకాని వార్తలూ కావు. ఇరుగూ పొరుగూ ఇకటమాడుతూ అన్నమాటలు. విని వదిలెయ్యడానికి వీలులేని, వీలుకాని మాటలు! ఎక్కడెక్కడో పడుతున్న తూట్లు!

పార్వతమ్మకు అలవాటైపోయిన అసహనమంతా ఏమీ ఎరుగని పిల్లని చూస్తే, చూసిన కొలదీ- చూసినప్పుడే ప్రారంభమయినా-కొంత తగ్గి మామూలు మనిషి కాగలిగింది.

"పార్వతమ్మా..." భాగ్యం ఏదో చెప్పబోయింది, కాని చెప్పలేకపోయింది.

పార్వతమ్మ నిట్టూర్పుతో అసహనాన్ని వెనిక్కి నెట్టి "భాగ్యం పడుకోవమ్మా.. నీళ్ళు సల్లబడిపోనాయి. కాపడం పెడతాను.." అంటూ వేడినీట్లో గుడ్డ ముంచి పిండింది? భాగ్యం మారుమాటాడకుండా బొమ్మల్లా పడుకుంది.

వెన్నుమీదా వీపుమీదా కొరడా దెబ్బల్ని మించిన బెల్టు దెబ్బలు తట్లుదేరి రక్తం కమిలిపోయినట్లు నల్లగా రంగు తేలాయి. పార్వతమ్మకీ అలాంటి దెబ్బలెన్నో అనుభవంలోకి వచ్చినా- భాగ్యాన్ని ఆ పరిస్థితుల్లో చూస్తే కోపం ఏమూలవున్నా, దాన్ని తుడిచేసి జాలిపేరుకుపోయింది. దెబ్బల మీద గుడ్డని అన్నినవుడల్లా భాగ్యంకు ప్రాణం పిండుతున్నట్లుంటే, పార్వతమ్మకేమో వళ్ళు జలదరిస్తోంది. ఇద్దరి కళ్ళలోనూ సన్నటి కన్నీటి తెర!

**వెన్ను మీదా వీపు మీదా కొరడా దెబ్బల్ని మించిన బెల్టు దెబ్బలు తట్లుదేరి రక్తం కమిలిపోయినట్లు నల్లగా రంగు తేలాయి.**

కాపడం పూర్తయినా భాగ్యం లేవలేక అలానే వుండిపోయింది.

పార్వతమ్మ కూడా చెయ్యివేళ్ళాడేసుకుని అచేతనంగా కూర్చుండిపోయింది. ఆమెకు తన కొడుకు గుర్తుకొచ్చి అసహ్యం వేసింది. 'వాడికి పెళ్ళి చేస్తే బాగున్ను' అనుకుంది. 'ఉద్యోగం లేకుండా పెళ్ళా? వాడయినా ఒప్పుకుంటాడా? ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా పెళ్ళంటూ చేస్తే ...వచ్చిన దాన్నీ, రేపు దాని కడుపున బిడ్డ పిల్లల్నీ తనే పెంచాలి, ఆ భారమూ తనే మోయాలి...... ఆ బాదరబందీ తనే

పడాలి' అనీ అనిపించింది. ఉద్యోగమొస్తే బాగున్ను' అనుకుంది. ఈ కాలంలోనూ...దానికితోడు వాడి చదువుకీ, కట్టలేని లంచాలకీ ఉద్యోగం రాదు. కష్టం అనీ అనుకుంది. కూలీ నాలికి వళ్ళు వంచడు..... ఈ పనులు మాత్రం మానడు..దీనికయితే వళ్ళూ , వయసూ వుంది' అని తిట్టుకుంది.

పార్వతమ్మ మెదడు కాసేపు మొద్దుబారిపోయింది. ఆమె దృష్టి తిరిగి భాగ్యం మీదికి మళ్లింది.

"భాగ్యం, నారాయణరావు వచ్చేసరికి శ్రీనుగాని వున్నాడా? ...అందుకే నిన్ను ఇలాగ...." అనుమానిస్తూ అడిగింది పార్వతమ్మ.

భాగ్యం దిగ్గున తలెత్తింది, కాని పార్వతమ్మ చూపులో చూపు కలిపి నిలువలేకపోయింది.

"లేదు.., ఆయనొచ్చేసరికి శ్రీను లేడు. అయినా శ్రీను రావడం 'అంతా'...ఆయనకి ముందునుండీ తెలుసు. శ్రీను వస్తున్నాడని కొట్టలేదు..." భాగ్యం తలదించుకొనే వుండి ఆగిపోయింది.

పార్వతమ్మ భాగ్యం వంక ఆశ్చర్యంగా చూసింది. 'తన పెళ్ళాం దగ్గరికి మరోడు వస్తున్నాడని తెలిసీ నారాయణరావు ఊరుకున్నాడా?' ....మొదట్నుంచీ వీళ్ళ సంబంధం తెలుసునా?!...అంతు పట్టడం లేదు.

'అయితే మరెందుకు కొట్టాడు?' అన్నట్టుగా చూసింది పార్వతమ్మ.

భాగ్యం తలగడమీదినుంచి తల ఎత్తకుండానే చెప్పింది.

"రాత్రి పార్టీ అయ్యిందట. అయినా పార్టీ కానిదెప్పుడు వీళ్ళకి?...ఆ పార్టీలో శ్రీను మూలంగా పరువు పోయిందట. శ్రీనే మాయింటికి వారసత్వాన్నిచ్చాడనీ, ఈ దఫాకి ఆడపిల్లయినా -మళ్ళా దఫాకు ప్రయత్నిస్తే... అబ్బాయి పుట్టొచ్చుననీ- ఎవరో ఒకరన్నారట. అందరూ అదివిని నవ్వేరట. మాట మీద మాటగా ఎన్నెన్నో అన్నారట. అది వింటే ఉరిపోసుకు చావాలట. ఈయన భరించలేకపోయారట. బయట కొచ్చేసారట. అలా పార్టీలోంచి లేచొచ్చి నన్ను చితక బాదేసి మరీ వెళ్ళిపోయారు. ఆ రాత్రికి రాత్రే వెళ్ళారు. ఇంతదాక రాలేదు. నా మీద ఆయన చేయి చేసుకుంటున్నప్పుడే శ్రీనొచ్చి ఒక్క క్షణం నిలబడి వెళ్ళిపోయాడు...."

పార్వతమ్మకు దోషులెవరో అంతుబట్టక పోయినా, దోషమంతా తన కొడుకుదే అన్నట్టుగా ఆమె ఆలోచనలన్నీ కొడుకు చుట్టూరానే తిరుగుతున్నాయి.

"శ్రీనునీ రావద్దనే చెపుతున్నాను..." భాగ్యం గొంతు వణికింది. దుఃఖం ఏడుపూ కలగలిసి పోతుంటే ముఖం తలగడకేసి రుద్దుకుంది. ఆ సమయంలో భాగ్యం శరీరం మొత్తం కంపం వచ్చినట్టు వణికిపోసాగింది.

భాగ్యాన్ని ఆ పరిస్థితుల్లో చూస్తుంటే పార్వతమ్మకు ఊరడించ బుద్ధయింది. కాని ఎందుకనో కూర్చున్న చోటునుంచి కదల్లేకపోయింది. చేతితో తడమాలనుకున్నా చేయిని చాచలేకపోయింది.

ఎప్పటికప్పుడు ఆ వాతావరణంలో అనంతమైన నిశ్శబ్దం ఆవహిస్తూనే వున్నది. ఇప్పుడు కూడా-

"...పనీ పాటు లేదని గాని,... అయినా వాడికీయేడు పెళ్ళిచేస్తాను. నా రెక్కల్లో సత్తువున్నంతకాలం లాగుతాను..." పార్వతమ్మ ఒక దీర్ఘమయిన నిశ్చయాని కొచ్చినట్లు ఆ మాట చెప్పి, పెద్ద ఊపిరి తీసుకుంది.

మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది.

చాలాసేపు గడిచాక పార్వతమ్మ కూర్చున్న చోటునుంచి లేచి నిలబడింది. "భాగ్యం, నే వెళ్తాను. గోడలకి సున్నమెయ్యడానికి రమ్మన్నారు. కూచుంటే అవదు గదా? నువ్వు వంట చెయ్యకు... మధ్యానానికి అన్నం పంపుతాలే.... వెళ్తా" పార్వతమ్మ పైటచెంగుకు చేతులు తుడుచుకుంటూ అంది.

భాగ్యం లేచి కూర్చుంది. పార్వతమ్మ ముఖంలోకి ఒక్క క్షణం చూసి, చూపు మరల్చుకుంది. " పార్వతమ్మా డబ్బులేమయినా అవసరమా?.... ఇవ్వనా?!" అడిగింది.

పార్వతమ్మకి అవసరం వున్నట్టే వుంది. కాని ఎటూ తేల్చుకోలేక ఒక నిముషం పాటు పెదవి విప్పలేకపోయింది. ఆఖరికి 'వద్దు' అంటూ ఇంట్లోంచి బయటకు నడిచింది.

వెళ్ళిపోతున్న పార్వతమ్మ వేపే చూస్తూ కూర్చుండి పోయింది భాగ్యం.

భాగ్యం కళ్ళముందు పార్వతమ్మ, ఆమె పెనిమిటీ పెద్దకొడుకు శ్రీనూ వాడి తమ్ముళ్ళు రమేషూ సురేషూ అందరూ కదలాడారు.

ఐదేళ్ళ క్రిందట కన్నవారింటి నుంచి ఇక్కడ కొచ్చినపుడు, పొరుగింట్లో కాపురముంటున్న పార్వతమ్మకీ ఇప్పటి పార్వతమ్మకీ బోలెడంత తేడా కనిపించింది- భాగ్యానికి. బక్క చిక్కిపోయినా తన బలవంతానే కుటుంబానికి ప్రాణం పోసిన పార్వతమ్మను తలచుకుంటే, కుటుంబంలో తాను పడుతున్న హింస ఏపాటిదీకాదని తోచింది భాగ్యానికి, అప్పటి రోజులూ గుర్తు కొచ్చేయి.

కాపురానికి... అంటే విశాఖపట్నం వచ్చిన తొలిదినాల్లో... ఇంతడుపట్నంలో ముక్కు ముఖం తెలియని వాడలో...కేంపులంటూ రైల్వేలో డ్రైవరయి కిరండల్ ,జయిపూర్, దుర్గ్, కంటాబంజి ఇటు భువనేశ్వరం, కటక్ ఎటు కటు వారాల తరబడి నెలల తరబడి పెనిమిటి రాకపోయినా, వచ్చి పూటుగా తాగేసి మీద కొచ్చినా ఆసరాగా నిలబడిందీ... ధైర్యాన్నిచ్చిందీ... పార్వతమ్మ కుటుంబమే!

పార్వతమ్మ కుటుంబం రైల్వే క్వార్టర్సులో వుండేది. భాగ్యం మొగుడు రైల్వేలో పనిచేసినందువల్ల ఎదురింట్లోనే అదే బ్లాక్‌లో వుండే ఇంట్లో కాపురం. అయితే పార్వతమ్మ పెనిమిటి రైల్వే లోకాకపోయినా దూరపు బంధువుల పేరున ఇల్లు ఎలాటయి, వారు సొంత ఇంట్లో వుంటే- వీళ్ళు దీంట్లో అద్దెకుంటున్నారు.

భాగ్యం ఒక్కర్తీ ఇంట్లో పడుకున్నప్పుడు తోడుగా పార్వతమ్మ దాని పిల్లలో వచ్చి పడుకొనేవారు. 'నీ ఒక్కదానకోసం ఏం వంట చేస్తావ్? పొయ్యి వెలిగిస్తావ్?' ఆ రెండు మెతుకులేవో మా యింట్లో తినరాదా?' అని అగ్గిపుల్ల వెలగనిచ్చేవారు కాదు. ఎప్పుడో వచ్చిన అమ్మా నాన్న అది చూసి "మా భాగ్యానికి అమ్మయినా అత్తయినా నువ్వే పార్వతమ్మా... నువ్వున్నావనే మా పిల్లని ధైర్యంగా వదిలి వెళ్ళ గలుగుతున్నాం" అని తృప్తి పడేవారు.

పార్వతమ్మ కుటుంబం ఎంత కలుపుగోలు కుటుంబమయినా కలవరింతలూ కన్నీళ్ళూ లేని కుటుంబమయిందికాదు. పార్వతమ్మ మొగుడు అప్పట్లో ఆర్టీసిలో డ్రైవరు. తాగుడు అలవాటు చేత, డ్యూటీలో ఉన్నప్పుడూ తాగడం మానుకోలేక, తాగేసి బస్సు వాగులోకి దింపేడని ఉద్యోగం లోంచి తీసేసారు. ఉద్యోగం ఊడిపోయాక అప్పుల్తోపాటు తాగుడూ పెరిగిపోయింది. ఇంట్లోని ఒక్కో వస్తువూ తాకట్టుకు వెళ్ళిపోయింది. పిల్లల చదువులూ ఎక్కడివక్కడే ఆగిపోయాయి. అంతో ఇంతో చదివే శ్రీను ఇంటరు ఫెయిలయినాడు. ఇంటిదారి తప్పిపోయినాడు. ముందేరు ఎలా వెళ్తే ఎనక ఏరు అలాగె ళ్ళిందని, వాడి తమ్ముళ్ళూ తోవ తప్పిపోయారు. ఎవరు ఎలాగపోయినా

అన్నానికి ఇల్లు మట్టేవారు. ఎవరికి తప్పినా తనకి తప్పనట్టు అప్పటికే నాలుగ్గోడలు మధ్య బానిసైపోయిన పార్వతమ్మ నాలుగు వీధులూ తిరిగి, నాలుగు వాకిళ్ళలో పనిచేసి అందరి కంచాల్లోకి అన్నమయ్యేది!

అప్పుడే చేబదుళ్ళు అవసరమయ్యేవి. పెద్దవాడంత చదువైనా మిగతా ఇద్దరు చిన్న పిల్లల్నీ చదివిద్దామని పార్వతమ్మకుండేది. ఆ విషయమై పట్టు పట్టేది. 'నేను మీ భాగ్యాన్ని, నా దగ్గరుంది ఇస్తున్నాను. తీసుకో పార్వతమ్మా.... కాదనకు' అంటూ భాగ్యం ఇచ్చినా- 'ఇంత బాకీ వున్నానమ్మా' అంటూ లెక్కలు తేల్చేది. 'డబ్బు పాపిష్టిది. మంచీ చెడూ దానికి బొమ్మా బొరుసూ.... ఏది పడుతుందో.... ఏదొస్తుందో చెప్పలేం' అనేది.

సరిగా రోజుల్లోనే- ఒక రోజు ఈ నాటికీ మరిచిపోలేని రోజయి పోయింది.

పార్వతమ్మని ఆమె పెనిమిటి తాగడానికిడబ్బులడిగేడు. లేవంది పార్వతమ్మ. నమ్మలేదు పెనిమిటి. పైగా "నేను నిన్నటివరకూ కష్టపడితే మీరంతా తిన్నారు, వున్నారు. ఈ వాళ ఉద్యోగం పోతాటికి చెల్లు కానీకి...చెల్లని దమ్మిడీకి కొరగాక పొన్ను. నాకు విలువ ఇవ్వడం లేదు. నా సంపాదన ఆగిపోయి, ఆడదానివి నీ సంపాదన మొదలవతోటికి నీ అధికరమూ మొదలయ్యింది...." అంటూ కేకలు వేసాడు. డబ్బులు తాగడానికి ఇవ్వనందుకో?... లేకపోతే ఇల్లు నడిపే భారము కన్నా అధికారమూ పార్వతమ్మ చేతుల్లోకి వెళ్ళిపోతున్నందుకో.... ఎందుకు సహించలేక పోతున్నాడో భాగ్యానికి పూర్తిగా అర్థమయింది కాదు.

"ఇంట్లో వుంటే పిల్లల్తో పాటు గెంజో గడుగో పోస్తాను. లేదూ...పీపాలకి పీపాలు తాగుతానంటే మాత్రం నావంట్లో నెత్తురు లేదు నీకు పొయ్యడానికి. అందుకిష్టమయితే ఇంట్లో వుండు. లేదంటే లేదు. ఆపిల్లలకీ రెక్కలొచ్చి రేపు అల బతుకు అలు బతికిందాక నాకీ చావు తప్పదు..." పారతమ్మ నమ్ముతున్నదే చెప్పింది.

పార్వతమ్మ మాటలు పూర్తయి క్షణం గడవలేదు. ఆమె పెనిమిటి ఒక్క వుదుటన లేచి "ఏటే లంజా...నాలుగు డబ్బులు తెస్తోటికి నాయురాలు వయిపోయినావేం? లప్మీ ఆడదానివి ఆడదాని లాగుండు..."అంటూ పళ్ళివరగరుసుకొని వచ్చి, పార్వతమ్మ వెన్నువంచి గభీ గభీ మని గుద్దేడు. ఆ పోట్లుని పార్వతమ్మ భరించలేక అడ్డుకోబోయింది. తన చేతుల్ని అడ్డుపెట్టి మీద పడుతున్న వాణ్ణి ఆపబోయింది. తిరగబడి మీద పడకపోయినా అడ్డుకున్నం దుకే... చేతుల్ని అడ్డం పెట్టినందుకే...చేతుల్ని విసిరికొట్టినందుకే ఆమె పెనిమిటి సహించలేకపోయాడు. భరించలేకపోయాడు. దాంతో ఆగలేక ఇంటి నలుమూలలా పిచ్చిపట్టినట్లు పరుగులు తీసాడు. చేతికందినదల్లా తీసాడు. కడకు కత్తిపీట దొరికింది. దొరికిన కత్తిపీట మదంతో ఇక్కడా అక్కడా అనకుండా అందిన చోటల్లా పొడిచి కుళ్ళబొడిచాడు. ఎవ్వరూ ఆపలేకపోయారు. పోగయిన జనంలో ఒకరిద్దరు ముందుకు వచ్చినా పొడిచేస్తానన్నాడు.

పార్వతమ్మ ఆగని దెబ్బలకు రొప్పుతూ రోదిస్తూ కేకలు పెడుతూనే వుంది. అలాగే వదిలేస్తే ప్రాణం పోవడం పెద్ద విచిత్రం ఏం కాదు. కాని ఎవ్వరికీ ఆపేసత్తువ లేకపోయింది. ఎక్కడి వాళ్ళక్కడ కాళ్ళూ చేతులు ఆడనట్టు నిలబడిపోయారు.

ఏడుస్తున్న రమేషూ సురేషూ తండ్రి కేకకీ...ఈ రూపానికి...తల్లి తెలివితప్పి పడిపోవడానికి...కొయ్యబారిపోయారు. ఇద్దరూ చెరొకమూల గోడకు అంటుకుపోయారు.

అప్పుడు శ్రీను కూడా అక్కడే వున్నాడు. అంతదాక తనూ చూస్తూ కళ్ళునిలిపేసి కొయ్యబారిపోయినా, కొంతసేపటికల్లా ఏదో పూనకం వచ్చినట్టు ఆగలేకపోయాడు. తండ్రి మాటకు జవాబివ్వడానికి భయపడే శ్రీను ఒక్కసారిగా ఉప్పెనలా ఉరికి తిరగబడ్డాడు. తండ్రి చేతిలోని కత్తి పీటను లాక్కున్నాడు. అలా లాక్కున్నప్పుడు శ్రీను చేతులు సన్నగా తెగాయి. అరచేతుల నిండా చిక్కని ఎర్రని రక్తం...పిడికిట్లో బంధించలేక జారవిడుస్తున్నట్టు ధారకట్టింది. బొటబొటమని కారుతున్న రక్తాన్ని బాధని లెక్కచేయకుండా దూరంగా కత్తిపీట విసిరేసాడు. అయినా ఆగలేదు. అక్కడేవున్న అప్పడాల కర్రని అందుకున్నాడు. తండ్రిని అందినచోటల్లా బలంగా కొట్టాడు. కొట్టిన చోటల్లా కాల్చివాతపెట్టినట్టుగా శరీరం పొంగి ఉబ్బింది. అవి మామూలు దెబ్బలు కావు. చావు దెబ్బలే! కడకు జుత్తు పట్టి ఎత్తి ముఖం మీద కొట్టాడు. నోటి వెంబడి రక్తం...బుడబుడమని...పెదాలు చిట్లిపోయాయి. పళ్ళు కదిలిపోయే వుంటాయి. అయినా సరే,ఆగని శ్రీనుని పార్వతమ్మ ఆపలేదు. ఎందుకనో అడ్డుకోలేదు.

వేరెవరో శ్రీనుని ఆపారు. మరికొందరొచ్చి పట్టుకున్నారు. ఇంకొకరు అప్పడాలకర్ర లాక్కున్నారు.

ఇంతలో పార్వతమ్మ ముఖం మీద నీళ్ళు చల్లి తెలివితెచ్చినా, ఆమె పెనిమిటి సొమ్మసిల్లి పడిపోయాడు. ఎవ్వరో ముఖం మీద నీళ్ళు చల్లి ఆయన్నీ కూర్చోబెట్టారు.

తరువాత అంతా ఆసుపత్రి చేరారు. పోలీసులు కేసు రాసు కోవడానికొచ్చేరు. రాజీకి రావడానికి పార్వతమ్మను అందరూ కలిసి ఎంతో సర్దిచెప్పితేకాని సాధ్యమయ్యిందికాదు.

ముక్కలయి పోతుందనుకున్న కుటుంబం ముక్కలు కాలేదు. కూడు, గూడు, కోసమే అన్నట్టుగా అందరూ ఆ ఇంటి కప్పుకిందనే చేరారు. పార్వతమ్మ తనకున్న రెండు చేతులూ కాళ్ళూ నాలుగు పక్కల నిలిపి ఆ కప్పుకి ఆసరాగా నిల్చిన గోడయ్యింది.

ఇంతజరిగినా ఇప్పటికీ పార్వతమ్మ సంపాదనతోటే దాని పెనిమిటి తాగుతాడు తింటాడు గాని మాట్లాడ్డం పూర్తిగా మానేసాడు. మిగతా పనులన్నీ మామూలే. నిత్యమూ మూగతనమే! ఎందుకో ఆ మూగతనమే పార్వతమ్మకు ప్రశాంతి నిచ్చేది.

ఆ సంఘటన జరిగిన రోజుల్లో భాగ్యం పార్వతమ్మ కుటుంబానికి మరింత దగ్గరయింది. గాయాలతో మంచం పట్టిన పార్వతమ్మకు ఉపచర్యలు చేయడంలోగాని...సేవలు అందివ్వడంలోగాని...పొయ్యి వెలగనిరోజుల్లో వంటచేసి వడ్డించడంలోగాని భాగ్యం ఆ ఇంటిలో మనిషయ్యింది. మాట లాడుకోని మనుష్యుల మధ్య మధ్యవర్తిత్వం నడిపింది. పార్వతమ్మ మందులకూ మాకులకుగాని, చిన్నవాళ్ళయిన రమేషూ సురేషూలకు ఫీజులు కట్టడంలోగాని, పుస్తకాలు కొనిపెట్టడం లోగాని అన్నీ తనే అయిచూసింది. 'తమ్ముళ్ళూ అంటూ ఆకలి వేళకు పిల్లలకు అమ్మలా అన్నం పెట్టింది.

అదిగో అలాంటప్పుడే శ్రీను భాగ్యానికి దగ్గరయ్యాడు. భాగ్యానికంటే శ్రీను అయిదేళ్ళు పైగానే చిన్నవుంటాడేమో 'అక్కా...అక్కా' అని అంతదాక పిలిచినవాడు 'భాగ్యం...భాగ్యం' అంటూ పేరు పెట్టి పిలిచే వాడు. భాగ్యం చనువనుకుంది. అభిమానమనుకుంది. అలా అనుకొనే చేతులు తెగిన శ్రీనుకు అన్నం తినిపించింది. గాయాలకు మందు పూసింది. మంట పెడితే ఉఫ్ మని ఊదేది. శ్రీను కన్నార్పకుండా చూసేవాడు. భాగ్యం తన విధి తనదే అన్నట్టుగా దేన్ని గ్రహించేది కాదు.

మాసిన జుట్టు రుద్దుకోలేని శ్రీను స్థితికి జాలిపడింది. ఒకరోజున

భాగ్యమే కుంకుడికాయ పుల్లపిండి శ్రీను తలని రుద్దింది. నీళ్ళు తలపైనుండి పోసింది. మొదటి సారిగా అప్పుడే శ్రీను ఆబగా భాగ్యాన్ని వాటేసుకున్నాడు. ఊహించని స్థితికి భాగ్యం కొయ్యబారిపోయింది. ఆమె మెదడు పనిచేయని ఆ రెండు క్షణాలూ శ్రీను ఉపయోగించు కున్నాడు. తడిసిన వంటితోనే వళ్ళంతా తడిమేసాడు. భాగ్యానికి జరుగుతున్నదేమిటో అర్థమయ్యాక ఒక్క క్షణమైనా ఆగక, నోరు రాక బలవంతాన వాటేసుకున్న చేతుల్ని విడిపించుకొని బాత్‌రూమ్‌లోంచి పరుగుపెట్టింది.

ఆరోజంతా భాగ్యం మామూలుగానే గడపలేకపోయింది. ఏదో జరగకూడనిది జరిగినట్టు తెలియని నొప్పో బాధో గుండెను బరువు చేసింది. ఎంత మామూలుగా వుండ'మన్నా మనసు అలా వుండలేదు.

'ఏమిటలా వున్నావ్?' పార్వతమ్మ అడిగింది కూడా. భాగ్యం ఇదీ అని చెప్పలేకపోయింది. అసలు చెప్పాలనీ అనుకోలేదు, తప్పితే దోషమెక్కడ వుందా?' అని తనకు తానే తర్కించుకుంది. శ్రీనుకు ఎడంగా వుండాలనుకున్నా, ఆకుటుంబానికి ఎడంగా వుండలేక అది వల్లకాని పనే అయింది. ఒంటిగా వుంటోందేమో...అందునా కలగలిసి పోయారేమో తెగతెంపులు చేసుకోవడం అనివార్యం కాలేదు.

మరో దఫా అర్థరాత్రప్పుడు శ్రీను భాగ్యం ఇంటి తలుపు తట్టాడు. ఏం జరిగేనో గాని సమయానికి ఆవాళ పార్వతమ్మే తోడుగా వుండడం తోటి 'మంచి నీళ్ళకని ' అడగకుండానే చెప్పి, అదోలా చూసి - నీళ్ళు ఇవ్వకుండానే నమిలి మింగివెళ్ళాడు.

రెండు మూడు దఫాలు తలుపు చప్పుడయితే భాగ్యం బెరుకుగా వెళ్ళితీసేది. ఎవరూ వుండే వారు కాదు. భ్రమేమో?...

శ్రీను విషయం పార్వతమ్మకు చెపితేనో?' భాగ్యం అనేక మార్లు అనుకుంది. 'ఇరవైఏళ్ళ కొడుకాయె...తండ్రి అలనా పాలనా లేనివా డాయె?...కష్టం తెచ్చి కడుపుల్లో పొయ్యడమే తెలిసిన పార్వతమ్మకు కాతరు చేస్తాడా?...అయినా ఈ పరిస్థితుల్లో పార్వతమ్మకు చెప్పి మళ్ళీ మనసు గాయం చెయ్యడం సబబేనా? కట్టుకున్నోడి నుంచీ పడుతోంది, ఇప్పుడు కాసిన కడుపునుంచీ పడాలా పాట్లు...?" అని ఈ విషయం తనలో తనే దాచుకుంది భాగ్యం. మగడికి చెప్పాలా వద్దా అనే ప్రశ్నే వేసుకోలేదు.

-భాగ్యానికి అప్పటి రోజులు తలపుకి వచ్చి ఆ ఆలోచనలు పూర్తికాలేదు. పిల్లది ఏడుస్తూ నిద్దట్లోంచి లేచి కూర్చుండిపోయింది. భాగ్యం ఈ లోకానికి వచ్చింది. పిల్లదాన్ని అందుకొని ఒడిలో కూర్చో బెట్టుకుంది. పిల్లది రొమ్ముల్ని దేవులాడుతోంది. భాగ్యానికి తన రెండు రొమ్ములూ బరువుగా ...సూదితో గుచ్చినట్లు నొప్పిగా తోచాయి. పిల్లది రొమ్ముని అందుకుంది. కాని పాలు చాలినంత రాకపోవడం వల్ల అప్పుడే మొలుచుకొస్తున్న పళ్లతో అణచి కొరికే ప్రయత్నం చేస్తుంటే భరించలేకపోయింది.

భాగ్యం ఎంతో సహనంతో పిల్లని రొమ్మునుండి ఎడంగా జరిపింది. పిల్లది ఏడుస్తూ ఎగబాకుతోంది. పార్వతమ్మ పాలుని కలిపి సీసాలో కెత్తడం గుర్తుకొచ్చి భాగ్యానికి ప్రాణం లేచొచ్చినట్లయింది. పిల్లని పట్టుకొని లేచినిలబడబోయింది. భాగ్యం వల్లకాలేదు. శరీరానికి కష్టంగా వుంది. పిల్లని మంచం పై దించింది . పిల్లది ఏడుపు ఎక్కువ చేసింది. భాగ్యం మంచం ఆసరాతో వంగుతూనే నిలబడింది. తనకి తెలియకుండానే రెండు చేతులూ నడుంని పట్టుకున్నాయి. తర్వాత ఊతగా గోడల్ని పట్టుకొని నడిచి, పాల సీసాను అందుకొని తీసుకు వచ్చింది.

బిడ్డ అప్పటికే మంచం దిగే ప్రయత్నం చేస్తుంటే ఆపి, మళ్ళీ మంచం మీద వేసి పాలసీసాను నోటికి అందించింది. పక్కనే కూర్చుంది. పాలు తాగుతూ పిల్లది ఏడుపు ఆపింది.

కడుపు నిండుతున్న కొద్దీ పిల్లదాని కళ్ళు వెలుగు చోటుచేసు కుంటోంది. దాన్ని భాగ్యం గుర్తించకపోలేదు. గుర్తించాక ముద్దులి డకుండా వుండిపోలేదు.

కొద్దిసేపటికి పార్వతమ్మ అన్నం తీసుకువచ్చింది. దాన్ని వైరు బేగులో అలాను వుంచి వంటగదిలో పెట్టింది. వచ్చి పిల్లని ఎత్తుకుంది.

"పన్లో కెళ్ళాలన్నావ్, పార్వతమ్మా.." భాగ్యం అడిగింది.

"..వెళ్ళాలే గాని అక్కడ మా ఇంట్ల చూస్తే అలగ..మీయింట్లో చూస్తే ఇలగ...నాకూ వంట్లో నొచ్చినట్టుగుంది, ఈ రోజుకు మరెల్లను...' ' పార్వతమ్మ చెప్పింది.

"ఏం మీ ఇంట్లో మళ్ళీ గొడవయ్యిందా?"

"ఇంటింటికీ వుంది మంటి పొయ్యనీ...ఇవన్నీ ఎప్పుడూ వున్నవే. ముందల నీవెళ్ళి ఉడుకు నీళ్ళు స్నానం చేసీ..., ఒక్క ముద్ద తిని చల్లబడు. పిల్లతల్లివి. జాగర్తగుండాలమీ. ఆలకోసమైనా తప్పదుగదా?' ' అంటూ విషయాన్ని దాటువేసిందే గానీ వాళ్ళ ఇంట్లో జరిగిన విషయం పార్వతమ్మ చెప్పలేదు.

పిల్లని ఆడిస్తూనే స్టవ్వు వెలిగించి వేణ్ణీలు కాచి బాత్‌రూమ్‌లో దించింది పార్వతమ్మ. భాగ్యం స్నానం పూర్తి చేసి చీర మార్చుకొని వచ్చింది. పార్వతమ్మ తెచ్చిన భోజనం తింటూ "నువ్వు తిన్నావా?" అడిగింది భాగ్యం.

ఆఁ..' అంటూ తలవూపి పిల్లని ఆడించడంలోనే మునిగిపోయింది పార్వతమ్మ. ఆ పిల్లదాని లేత చర్మమూ...దాని స్పర్శా...కల్మషం లేని చూపూ...ఆ చూపులోని వెలుగూ పార్వతమ్మని కట్టిపడేసినట్టున్నాయి. అందుకేనేమో పిల్ల బుగ్గలమీదా ముద్దుల్ని కుమ్మరిస్తోంది. పిల్లదాని తేగుడు అంటితే తుడుచుకోకుండా చప్పరిస్తుంది.

భాగ్యానికి ఆదృశ్యం చూస్తే గుండె భారమయింది. ఆ పిల్ల వల్లే తన జీవితంలో ఏవో మార్పులు వచ్చాయి. అందులో కష్టమూ సుఖమూ, దుఃఖమూ ఆనందమూ వున్నాయి. మంచి అనుభవాన్నో అనుభూతినో పొందినప్పుడు తనూ ముద్దులాడుతుంది. అది చెదిరినపుడు తనూ ఛీదరించుకుంటుంది.

కాని పార్వతమ్మకు ఆ పిల్ల పుట్టుక వల్ల పోయిందీ అనుకుంటే పరువు తప్ప, రాని అప్రతిష్ఠ లేదు. వీధి వీధంతా తెలిసిపోయింది. చుట్టుబాటు చుట్టాలందరికీ తెలిసిపోయింది. కొడుకుని కంట్రోలు చెయ్యమని కొందరు పార్వతమ్మని పోరితే-మరి కొందరు ఆ భాగ్యాన్ని కంట్రోలు చేయమని పోరారు. అలా పోరిన వాళ్ళలో అయినవాళ్ళ నుండి కాని వాళ్ళదాకా అందరూ వున్నారు. ఆ సంగతి భాగ్యానికీ తెలుసు. వినికూడా...విననట్టే... పట్టించుకోనట్టేవున్న పార్వతమ్మని చూస్తే భాగ్యానికి ఆశ్చర్యం వేస్తుంది. ఆకాడికీ చుట్టాలంతా ఏ పండక్కో పబ్బానికో వచ్చినపుడు ఈ విషయమై విడవకుండా ప్రతిదఫా మాట్లాడేవారు.

" ఆ శ్రీను గాడికి ఎంతవయసని, ఇంత కొవ్వి పోయాడు"

"కుర్రాడే కాదన్ను...దొరికిన దగ్గరకి వెళ్ళడమూ తప్పనను... కాని...కాని ఇదేంటి దాన్నే పట్టుకు వేళ్ళార్థం బాగులేదు.

"...అందునా పెళ్ళయిన దాన్ని..."

"కండలు పెంచేసొచ్చి కస్సున లేస్తాడు, కాలు దువ్వతాడుగాని... కాలూ సేతులూ ఇరిస్సినోడుంటే బాగున్ను..."

....ఇలా ఎన్నను కొన్నా, శ్రీనుకు ఎదుట పడి చెప్పినవారు లేరు. బుద్ధిగా ఒకరిద్దరు చెపితే ప్రయోజనం లేదు. కోపపడి చెపితే -తగువు...'నువ్వేవడె చెప్పడానికి మా ఇంటికి రావద్దు...ఫో... " చిన్నా పెద్దా లేదు శ్రీనుకి.

"అసలు వాడ్ని కాసిన తండ్రి సన్నాసి గోడ్ని తన్నాలి"

"ఏం తంతాం? కొడుకే తంతూ వుంటే..."

"వీడికి బుద్ధుంటే కదా, వాడికి బుద్ధి చెప్పడానికి"

"వీడ్ని చూసి మిగతా వాళ్ళు నేర్చుకుంటారయితేః"

శ్రీను మీదునుంచి వాడి తండ్రి సన్నాసిని నిజంగానే సన్యాశిని చేసి మాట్లాడేవారు. తిట్టిపోసేవారు. 'నేనేం చేయను...నేనెళ్ళ మన్నానా గాని" సన్యాశి తేల్చేసాక సంబంధం తీరిపోయినట్టే వుండే వాడు. పైగా అనేక దఫాలుగా కొడుకు చెయ్యి చేసుకోవడంతో పట్టించుకోకపోవడమే బాగుందతనికి.

"ఆ భాగ్యాన్ని తన్నాలి...మొగుడి చేత పొడిపించాలి..."

"పొడిసే వాడయితే ఇలాగ వదలడు ఊరిమీద..."

"దాన్ని శ్రీనూ వదలడు..."

"ఎంతనంగనాచి, పతివ్రతలా వుంటుంది"

భాగ్యానికి ఎదుటపడి తిట్టకపోయినా, వెనకాతలే వినిపించినట్టు అనేవారు. ఆయా సమయాల్లో శ్రీనే ఆపద్బాంధవుడు. అయితే భాగ్యం దుఃఖం గడ్డకట్టుకుపోయింది రాను రాను, అంచేత అంతగా చలించకపోయినా- అప్పుడప్పుడూ గండిపడ్డ గుండెలా కళ్ళు వర్షించేవి. . "అయినా దీనంతటికీ మూలం పార్వతమ్మే...కాపోతే తానూ కష్టపడ్డం మానేస్తే అందరికీ అన్నీ తెలిసొచ్చును".

"చిన్న పిల్లలు అన్యాయమైపోతారు"

"అవునూ అన్నీ తెలిసి ఆభాగ్యానితో సంబంధమేంటి? రాక పోకలేంటి?"

"అన్ని తెలిసి చేసినోళ్ళు అనుభవించాలి మరి"

చుట్టూ తిరిగి అన్ని సూట్లూ పోట్లూ పార్వతమ్మకే తగిలేవి. పనిమానెయ్యమని అన్నవారు పస్తులు పడితే పిలిచి పిడికెడు మెతుకులు వెయ్యరు, భాగ్యంతో వున్న సంబంధం సాదక బాధకాలు ఎవ్వరికీ అర్థంకావు. అందుకని అర్థమయ్యేలా చెప్పే చేసే ప్రయత్నమెన్నడూ పార్వతమ్మా చేయలేదు. బంధువులూ అనుకున్న వాళ్ళు -చితికిపోయిన కుటుంబాన్ని చేరదియ్యక వెలివేసినట్టుగానే అయిపోయారాఖరికి.

ఇల్లుమారిపొమ్మన్నారు. అద్దే కదా' అన్నారు. కాని అద్దెకట్టలేక వస్తువులు పద్దు పెట్టి...ఆ వచ్చిన డబ్బు అయిదువేలూ ఇంటిమీ దిచ్చారు. ఇంత తొందరగా ఇల్లొదిలి పోవడం, డబ్బురావడం అయ్యేపని కావు.

అవన్నీ- ఒక్కటొక్కటీ - భాగ్యానికి గుర్తుకొచ్చేయి. భాగ్యం ఇంకా అవే ఆలోచనల్లో వున్నది. కళ్ళు తెరచుకొని వున్నా కంటిముందు దృశ్యం అగుపడ్డం లేదు. మనసు మీద పడ్డ మరకలేవో చెరగకుండా వున్నాయి.

"భాగ్యం ఏటాలోచిస్తున్నావ్? చెయ్యి ఎండిపోతంది. లెగు, వెళ్ళి కడుక్కురా...లెగు...." పార్వతమ్మ భాగ్యాన్ని కుదిపింది. భాగ్యం తులక్కుపడి తను ఎక్కడ వున్నదీ ఏమి చేస్తున్నదీ అర్థమయ్యి, కూర్చున్న కంచం ముందునుంచి లేచివెళ్ళి చెయ్యి కడుక్కొంది. ఆ తరువాత వచ్చి పార్వతమ్మ పక్కనే కూర్చుంది. సంశయిస్తూనే కొద్దిపాటి నిశ్శబ్దం తరువాత అడిగింది.

"పాపమీద కోపం లేదా?...నన్ను చూస్తే అసహ్యం వేయడం లేదా?"

ఆ ప్రశ్నతో పార్వతమ్మ తలదించుకోలేదు. ధైర్యంగానే భాగ్యం కళ్ళలోకి చూసింది. పిల్లదాన్ని గుండెలకదుముకుంటూ చెప్పింది.

"...అమ్మాః...భాగ్యం...చిన్నపిల్ల. దానికేం తెలసని కోపగించుకోవాల?! పాపమో..పుణ్యమో మనం చేసిన దానికి ఒక జీవి భూమి మీద పడ్డాది. మనకండలో కండ...మనరక్తంలో రక్తం కాబట్టి కండని కొండ చెయ్యాల...అంతే, ఆలకిప్పుడేటీ తెల్దు. రేపు పెరిగిన కొద్దీ మనల్ని చూసి అన్నీ నేర్చుకుంటారు. కల్మషమయి పోతారు. నీమీదంటావా? ..నువ్వనే కాదు నీననే కాదు, ఈ బూమ్మీద ఆడదాని పుట్టుకే అనహ్యామయిపోయింది.." పార్వతమ్మ మాటలు ఏవో ఆలోచనల దొంతరల్లోకి జారిపోయి మాటాడుతున్నట్టు వుంది.

"అమ్మా.. భాగ్యం చిన్నపిల్ల దానికేం తెలుసని కోపగించుకోవాల?! పాపమో పుణ్యమో మనం చేసిన దానికి ఒక జీవి భూమి మీద పడ్డాది. మనకండలో కండ.. మన రక్తంలో రక్తం కాబట్టి కండని కొండచెయ్యాల... అంతే, ఆలకిప్పుడేటీ తెల్దు. రేపు పెరిగిన కొద్దీ మనల్ని చూసి అన్నీ నేర్చుకుంటారు. కల్మషమయి పోతారు. నీమీదంటావా?.... నువ్వనే కాదు నేననేకాదు, ఈ బూమ్మీద ఆడదాని పుట్టుకే అసహ్యమయి పోయింది."

మళ్ళీ నిశ్శబ్దం...

"నా వల్ల మీ పరువు పోయింది..."భాగ్యం తనేమీ మాట్లాడుతోందో తనకే తెలియడం లేదు.

"గుట్టుగా సాగిపోతే ఏ పరువూ లేదు. గుడ్డ జారిపోతేనే అంతా. మా ఇంటి పరువు అంటావా? అది నన్ను కట్టుకున్నాడే తీసేసాడు. ఇంక కడుపున పుట్టినవాళ్ళ మాటింకేటి? మగమనిసి ఏనాడైతే తాగేసి రోడ్డుమీద పడిపోనాడో...ఆనాడే పరువూ రోడ్డున పడి బజారు పాలయిపోయింది. తండ్రుంటే ఉచ్చపోసుకొనే పిల్లలూ...తాగుబోతు తండ్రిని గౌరవమివ్వక తిరగబడ్డారు. తన్నారు. చెయ్యిజారిపోయింది. .అదే ఈ రోజు మళ్ళీ తండ్రీ కొడుకుల కొచ్చింది యుద్ధం....." పార్వతమ్మ చెప్పకూడదనుకొని ఇందాక భాగ్యం దగ్గర దాచిన విషయం చెప్పడం ప్రారంభించి ఆగిపోయింది.

భాగ్యం పార్వతమ్మ ముఖంలోకి చూసిందేకాని ఏమయ్యిందని అడగలేదు. కాని పార్వతమ్మే చెప్పుకొచ్చింది.

"నువ్వు తాగడం మానీ..నేనూ భాగ్యం దగ్గరకు వెళ్ళడం మానేస్తా... నిజం నువ్వు మానెయ్యి...నే మానకపోతే ఒట్టు ..." శ్రీను అన్నాడు.

"దానికీ దీనికి సంబంధమేమిటి? అవతల ఆయన నారాయణ

రావొచ్చి... 'మా పరువు పోయింది, మేం ఉరిపోసుకు చావాలి...మీ అబ్బాయిని మా ఇంటికి రావద్దని చెప్పండన్చెప్పి...రోడ్డు మీద నలుగుర్లో ఏడ్చాడు...'' శ్రీను తండ్రి సన్యాసి సమాధానమూ ప్రశ్నా అదే!

"వాడొచ్చి నీ దగ్గరేడ్చినందుకే ఇంత బాధపడిపోతున్నావే...మరి అమ్మొచ్చి నీ దగ్గర ఎన్నిసార్లు ఏడ్వలేదూ తాగొద్దని, కాళ్ళమీద పడింది, కాళ్ళతో తన్నులూ తింది. నువ్వు తాగడం మానేసావా?" శ్రీను అడిగాడు.

"....ఊఁ...దానికీ దీనికీ ..అయినా కాలికీ మెడకీ లంకె వెయ్యకు.. సన్యాశి పదాలు తడుముకున్నాడు.

"నీతులు చెప్పకు, చెప్పేముందు నువ్వు దుమ్మరిగుడిసెలో అదే మందు కొట్టులో దూరకు. అప్పుడు చెప్పు..." మొండిగా శ్రీను.

"............" జవాబు లేని సన్యాశి.

"నువ్వు మందు ముట్టకు...నేను భాగ్యాన్ని ముట్టను..." మళ్ళీ అదే విధంగా శ్రీను.

"కుటుంబం వీధిలో పడుతుంది..." సన్యాశి.

"మరి నీవల్ల మేం పడలేదా?" శ్రీను.

ప్రశ్నకు ప్రశ్నా...జవాబుకి జవాబు...నిలబడని తక్కెడ తత్వం! ఒకరికొకరం చెట్లు అనేచెల్లుబాటు -రాజీ! కాదంటే పేచీ! దాంతో మాటా మాటా దెబ్బా దెబ్బ..మామూలే , మారిందేం లేదు.

ఎంతకూ తగువు తేల్లేదు ఎప్పట్లాగే కొట్టుకున్నదాక వచ్చారు.

పార్వతమ్మ చూస్తూ సహించలేకపోయింది. అరిచింది. గీపెట్టింది. నెత్తీనోరు బాదుకుంది. బతిమాలాడింది. ఎవరిని వద్దంటే వాళ్ళే-

"నీ మొగుడికి చెప్పుముందు.."

"నీ కొడుక్కి చెప్పు ముందు..."

తగువు తీరింది కాదు. గొడవ ఆగింది కాదు. గడికో గడియకో గుద్దులు వేసుకొనేటట్టు వుండడంతో భరించలేక అక్కడే వుండలేక ఎటూ పోలేక ఇదిగో ఇటు వచ్చినట్టు చెప్పింది పార్వతమ్మ.

రెండవ సంవత్సరం చదువుతుండగా భాగ్యం పుట్టింది. నారాయణ పెళ్ళంగానే చిన్నప్పట్నుంచి పేరుమోసింది.

నారాయణ్రావు అమ్మా నాన్నలు అంటే - భాగ్యంకు అమ్మమ్మా తాతయ్యలే అత్తమామలు అయేరు కదా, వాళ్ళు చాలా సంతోషించేరు. 'నా కూతురు ఇంతకాలానికి వరములుండి ఆడబిడ్డను కానిందని... భాగ్యాన్నిచ్చిందని ...కోడల్నిచ్చిందని' ఉప్పొంగి పోయారు. ఎందుకంటే భాగ్యం అమ్మమ్మతాతకి ఒక్కడే కొడుకు. ఒక్కగానొక్కడే ఆస్తికి వారసుడు. అంచేత రేపు పెళ్ళిచేస్తే ఎవర్తో పరాయిదాయి...ఆ వచ్చినదాయి ఆ ఆస్తిని నెత్తిన పెట్టుకు మోసుకుపోతుందనిని, భాగ్యమయితే మనమరాలు గనుక తిన్నా -కూతురు బిడ్డేనని, పరాయివాళ్ళకు ఆస్తి పోదని, -ఆ ఆస్తి పోగుకోసమే నారాయణ్రావు భాగ్యంల పెళ్ళయిందేతప్ప ఈడుజోడు చూసి ఏట్లోతోసేమన్నట్టుగా మాత్రం జరగలేదు.

నారాయణ్రావుకీ భాగ్యానికీ పదిహేడు సంవత్సరాల చిన్నా పెద్దా. భాగ్యం మూడు సంవత్సరాల పిల్లప్పుడు నారాయణ్రావుకు ఉద్యోగం వచ్చింది. ఎంత ఆస్తి వున్నా ఉద్యోగం చేస్తే తప్పులేదని, ఉద్యోగం పురుషలక్షణం అనీసి...ఇంట్లో వాళ్ళని ఒప్పించి నారాయణ్రావే ఉద్యోగంలో చేరాడు.

ఉద్యోగంలో చేరాక నారాయణ్రావు చేతిలో మరిన్నిడబ్బులు తిరిగాడేవి. పైగా ఇంటికి పంపాల్సిన పనిలేదు. ఇంటినుండే వందోపందో వద్దన్నా అనకపోయినా వచ్చేవి. దానికితోడు మెల్లీసు (ఒంటరి)గా వుండడంవల్ల వందిమాగదుల్లా స్నేహితులు పెరిగారు. జీవితాన్ని అనుభవించాలని చేసిన చేష్టలన్నీ చెడుకి దారితీసాయి. మందూ విందూ...పొందూ పసందూ అన్నీ అప్పుడే ప్రారంభమయి ఆ తర్వాత అలవాటు పడ్డాయి. ఈ విషయాలన్నీ ఇంట్లో వాళ్ళకి తెలిసాయి.

కొడుకుని ఉద్యోగమంటూ "ఊరమ్మట వదిలేసినందుకు నారాయణ్రావు తల్లి బాధ పడింది. మగనితో కొడుకు విషయమై పోట్లాడింది. 'మనింట్లోనే నలుగురు నౌకర్లూ చాకర్లూ వుంటే వీడు

సాలలో పశువులు మేపుతిని ఈతకొచ్చేసరికి పిక్క పట్టేసరికి సంతలో అమ్మడం... ఆదృశ్యం ఎందుకో భాగ్యాన్ని బాధపెట్టేది.

భాగ్యం జరిగిందంతా విన్నాక మరేమీ మాట్లాడలేకపోయింది. సమస్యంతా తిరిగి తిరిగి తన చుట్టూ చేరింది. తనే సమస్యయి అందర్నీ చుట్టేసింది. అందుకే దోషిలా తలదించుకుంది.

మళ్ళీ నిశ్శబ్దం. నిశ్శబ్దం నిశ్శబ్దంలా లేదు. అదొక భయంకరమైన భరించలేని శబ్దంలా వుంది.

"నిన్ను నారాయణ్రావు బాగా చుసూకోడా?..." పార్వతమ్మ ప్రశ్న ప్రశ్నలా లేదు. పిడుగులా వుంది. ఊహించని ప్రశ్న అది. పార్వతమ్మ భాగ్యం జీవితం చాలా వరకు చూసింది కాబట్టి అలా అడుగుతుందని ఊహించలేకపోయింది భాగ్యం. ఆమె గుండె మరింత బరువెక్కి పోయింది. అందులోనూ ఐదేళ్ళ పరిచయకాలంలో ఇరుగు పొరుగు తనంలో పార్వతమ్మకి తెలిసిందీ చూసిందీ చాలా ఎక్కువే.

గడచిన జీవితాన్నంతటినీ ఆకాలాన్నంతటినీ తోడి పార్వతమ్మ ముందర పంచలేకపోయింది భాగ్యం. ఎన్నో చెప్పాలనుకుంది. కాని చెప్పలేక పోయింది. అయినా కళ్ళముందు గడచిన జీవితం కదలాడింది.

భాగ్యానికి స్వయానా మామయ్యే నారాయణ్రావు. అంటే భాగ్యం అమ్మకు తమ్ముడు. ఒకరికోసం ఒకరు పుట్టారని పెద్దలు ఎన్నాళ్లినుంచో చూసి ఎప్పుడో చెప్పారు కాబట్టి - నారాయణ్రావు ఇంటరుమీడియట్

ఎక్కడో నౌకరి చేయడమేటి?". ఆమె మగడు 'ఆడు మగాడే' అన్నాడు. అదొక్కటే సమాధానం.

"మరి ఆడుచేసిన పన్లో...?"

"మగపిల్లాడే కదేఁ" అలా అనడంలో కొంత అహంకారం...గర్వం వున్నా, ఏ మూలో మరికొంత భయమూ గూడు కట్టుకొనే వుండేది, బయటపడేది కాదు.

"పెళ్ళి చేస్తే అన్ని సర్దుకుంటాయి. కుదురుతాయి" నారాయణ్రావు తల్లిదండ్రులిద్దరూ ఏక నిర్ణయానికి వచ్చారు. బంధుమిత్రులు అందుకు నిజమే నని తమ వత్తాసు పలికారు.

దాంతో నెలలు తిరక్కుండానే నారాయణ్రావు, భాగ్యంల పెళ్ళి ని పెద్దలు ఎంతో ఉత్సాహంగా జరిపారు. అప్పటికి భాగ్యంకు పదమూడేళ్ళు. ఆ ఏడాదే రజస్వలయింది. అక్కడికి మూడు నెలల్లోనే పెళ్ళి.

చీర చిలక్కొయ్యకు చుట్టినట్టుండేది. భాగ్యంకు కట్టక ముందు సంబరంగా వున్నా, చీర కట్టాక భారంగా వుండేది. నడక వచ్చేది కాదు. గౌనులేసుకుంటే ఎంత బాగున్ను అనిపించేది.

అలాంటి పిల్లని కుర్రాడితో కాపురానికి పంపటానికి ఎవరికీ ఇదమిద్ధం అయిందికాదు. ఆ పరిస్థితిని దాటడానికి నారాయణ్రావుని ఒక్కణ్ణీ పంపించేసి, భాగ్యాన్ని మరో ఏడాది పాటు ఇంటి దగ్గరే వుంచారు. పద్నాలుగేళ్ళు కనిపించకుండ ప్రతి రోజు మినపసున్నుండలు తినిపించారు. జునుగులు, కొమ్ము సెనగలు పచ్చివి, ఉడకబెట్టి ఎలా కావాలంటే అలాగ..వద్దన్నా వినక తినిపించారు.

సాలలో పశువులు మేపుతిని ఈత కొచ్చేసరికి పెక్కపట్టేసరికి సంతలో అమ్మడం..అదృశ్యం ఎందుకో భాగ్యాన్ని బాధపెట్టేది.

పశువుల దాణా గురించి మాట్లాడినట్టే...తన తిండి గురించి పదే పదే ఇంటిల్లి పాదీ ఇరుగూ పొరుగూ మాట్లాడ్డం భాగ్యంకు ఆశ్చర్యంగా వుండేది. ఎంత తిన్నా ఈ కాలపు పిల్లలు ఏం తింటారు?' అనేవారు. అయితే ఏడాదిలో ఒళ్ళు ఎంతగా పెరిగింది తెలుసుకోవడానికి అద్దమే అక్కర్లేదు. జబ్బలమీద జాకట్టు నిలబడ్డం సాక్ష్యం! లంగా మడుచుకోకుండా కట్టుకోవడం సాక్ష్యం. గుండెల మీద పైట జారకుండా నిలవడం సాక్ష్యం!

అప్పడే భాగ్యం ఏపుదనమంతా ఎటెళ్ళిపోయిందో తెలీదు గాని గాలి తీసేసినట్టు మనిషి ఎండిపోయింది. ఎముకలు ఎక్కొచ్చాయి. ఆరోగ్యం పాడయిపోయింది.

ఇన్ని సాక్ష్యాధారాలు వున్నాయి గనుక ఇప్పుడు అమ్మాయిని అబ్బాయి దగ్గరికి అంటే కాపురానికి పంపడం క్షేమని పెద్దలందరూ తలచారు. తలచిందే జరిగింది. అయితే తలచంది కూడా జరిగింది. భాగ్యంకు బహిష్టులో కడుపు నొప్పుయి మందు తీసుకోవడానికి మరలా వెనక్కి వచ్చింది. మాసంలో పంపిస్తామని అనుకున్నా, చిన్న పిల్ల ముద్దూ ముచ్చటకని మరో రొండు మాసాలు వుంచేసారు.

ఈలోగా నారాయణ్రావు నుండి భాగ్యాన్ని పంపమన్చెప్పి కబుర్ల మీద కబుర్లు. ఉత్తరాల మీద ఉత్తరాలు, అరడజను టెలిగ్రామ్‌లున్నూ. భాగ్యం మీద ఎంత ప్రేమని ఇంటిల్లిపాది అనుకొన్నారు. మురిసి పోయారు. కాని భాగ్యనికి మొదట్లో అర్థంకాని విషయాలు తర్వాత్తరువాత అర్థమయినాయి.

'ముదురు బెండకాయ'ని బ్రహ్మచారని తెలిసిన వాళ్ళు ఉడికిస్తున్నారని, 'ఈ వయసులో నీకు పిల్లనెవరిస్తారన్చెప్పి ఆట పట్టిస్తున్నారని...వీటన్నిటికీ తోడు అంతదాక హోటల్లో తిని తిరిగిన నారాయణ్రావుకు అప్పుడు సరిగా కిరండల్ ట్రాన్స్‌ఫర్ కావడం..అక్కడ హోటల్సవీ లేక పోవడం..వంటావార్పూ రాక, అలవాటు లేక చేసుకోక ...చేతులూ వళ్ళూ కాల్చుకోవడం...ఆ భయంతో వంటాతిండీ మాని కడుపు కాల్చుకోవడం..అయితే మొత్తానికి ఎదిగిన ఏడాది ఏడాదిన్నర వరకూ భాగ్యాన్ని కాపురానికి పంపలేదు.

కొండలూ లోయలూ దాటిఅడవి ప్రదేశంలోకి చొరబడిపోతు న్నట్టుగా వున్నా తలిదండ్రులు తనతోటే వుండడంతో భాగ్యానికి భయం వేయలేదు. కే.కేలైను తొలిసారిగా చూస్తున్నందుకు వింతగా విచిత్రంగా తోచింది. అమ్మానాన్నలు పదిరోజులుండి పరాయి వాళ్ళులా వెళ్ళిపోతున్నప్పుడు మాత్రం తొలిసారిగా తానిప్పుడు వేరే లోకంలో వున్నట్టు భాగ్యం గుర్తించింది. అది ఒంటరితనంగా కూడా గుర్తించింది. తన పరిస్థితికి తనమీద తనకే జాలి వేసింది...ఏడుపొచ్చింది. ఎందుకంటే ఆయన డ్యూటీకి వెళ్ళిపోతే ఒంటిగా వుండడం కష్టమయిపోయేది. ఇరుగూ పొరుగూ వున్నా ఎడం ఎడంగావున్న ఇళ్లే...రైల్వే క్వార్టర్లే....అన్నీ కలిపి తానుపుట్టి పెరిగిన వీధిలో వాసంత వుండేవి కావు. పైగా అందులో చాలా ఇళ్లు ఖాళీగా వుండేవి. సంసారం...పిల్లాజెల్లాతో కాపురం వుండే ఇళ్ళు మరీ తక్కువ.మొక్కేసుగా వున్న ఇల్లే ఎక్కువనిపించేది భాగ్యానికి. దానికితోడు వున్న అందరూ తెలుగు వారే కాదు, రకరకాల బాషల వాళ్ళూ...ప్రాంతాల వాళ్ళూనూ - అంచేత భాషబోధపడక, రాక, కొద్ది పాటి ఎడమే. ఇంకొన్ని ఇళ్ళువున్నా పిల్లలకిక్కడ చదువుల్లేవని, పై ఊర్లలో ఎక్కడో కుటుంబాల్ని పెట్టి మగ మనుషులు వుండేవారు. రెష్టుకు నెలకూ పదికీ వెళ్ళి చూసి వస్తుండేవారు. మరీ చిన్న పిల్లలయిన కుటుంబాలు మటుకు వుండేవి. అలాగే పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయి. వాళ్ళు వాళ్ళ పెళ్ళిళ్ళు అయిపోయి బాధ్యతలు తీరిపోయిన ఒంటరి ముసలి మొగుడూ పెళ్ళాలు మటుకు వుండేవాళ్ళు.

నారాయణ్రావుకు లైను వెళ్ళడమంటూ వుండేది. ఏ బండినో తీసుకువెళ్ళి మరో బండితోనో వచ్చే వారాయన. అవి భాగ్యానికి నరకపు రోజులే. అలాగని ఆయన వున్నప్పుడూ స్వర్గం దిగి వచ్చిందను కోవడానికి వీళ్ళేదు. తెలిసిన మనిషి తోడని తప్పితే, మామయ్యని చూస్తే పెనిమిటిని చూసినట్టుగా కాక, ఏదో పెద్దమనిషిని చూసినట్టుండేది భాగ్యానికి. భయం వేసేది. భక్తిలాంటి గౌరవంగా తోచేది. కాపోతే కావల్సిన సన్నిహితత్వమో స్నేహత్వమో కోరుకున్నదేదో భాగ్యానికి దొరికేది కాదు. అది అడిగి తీసుకోలేనిది.

దాంతో - ఆయనొస్తే ఏం ఏం అమర్చాలి? ఏమిటేమిటి వండాలి? మరి ఆయనకేమిటంటే ఇష్టం....? - వీటన్నింటితో భాగ్యం తొట్రుపడేది. అచ్చటా ముచ్చటలకు సంబంధించిన ఆలోచనలు అంతవరకు మునురుకున్నా - మునిరిపోయి ముక్కలైపోయినట్టు అన్నీ పటాపంచలైపోయేవి.

'భాగ్యం' అంటూ నారాయణ్రావు అప్పుడప్పుడూ దగ్గరకు తీసుకున్నా, భాగ్యం మనిషిక దగ్గరయేదే కాని మనసుకు దగ్గరయ్యేది కాదు. ఎందుకంటే ఎప్పుడు ఎలా వుంటారో....తాగేసి గనుక వస్తే ఎలా కేకలు వేస్తారో...తను భయపడిపోతూ వణికిపోతుంటే ఎంతలా పగలబడినవ్వుతారో...ఆ నవ్వుకి నవ్వురాక ఏడుపొస్తుంది భాగ్యానికి. అది చెప్పినా అర్థంకాని బెంగ. కలుపుగోలుగా మాటాడని మనిషి దగ్గర బితుకు. ఇరుగు పొరుక్కి చెప్పినా పిచ్చిపిల్ల అనినవ్వడం...నిజంగా పిచ్చిదానిమల్లె భాగ్యం ఈ సంసారాన్ని అందుకుంది కాదు. వయసందుకు అందుకొనేందుకు సహకరించేది కాదు.

అప్పుడే భాగ్యం ఏపుదనమంతా ఎటెళ్ళిపోయిందో తెలీదు గాని గాలి తీసేసినట్టు మనిషి ఎండిపోయింది. ఎముకలు ఎక్కొచ్చాయి. ఆరోగ్యం పాడయిపోయింది. ఆ విషయం తెలిసాక, అమ్మా నాన్న రావడం...భాగ్యాన్ని తీసుకెళ్ళిపోవడం జరిగిపోయింది. సరైన వైద్య సదుపాయం లేకపోవడం, అక్కాబావల్ని కాదనలేకపోవడం వల్ల నారాయణ్రావు మరేమి అనలేదు.

అటు తర్వాత అయిదేళ్ళవరకూ అంటే నారాయణ్రావు కిరండల్‌నుండి ఇక్కడ విశాఖపట్నం ట్రాన్సుఫర్ అయ్యేవరకూ భాగ్యం వెళ్ళే అవకాశం లేకపోయింది. ఎందుకంటే అనారోగ్యంపోయి

**భాగ్యానికిప్పుడు వయసొచ్చింది. యవ్వనమొచ్చింది. శరీరానికి కావలసిన వుండవలసిన వాంఛొచ్చింది. ఎవ్వరూ లేని ఇంట్లో ఒకరి కెదురుగా... ఒకరు... ఒకరితో ఒకరు... ఒకరులో ఒకరు...**

మనిషితేరుకొనేసరికి దాదాపు సంవత్సరంనర కాలం తేలిపోయింది. తీరా బయలుదేరబోయేసరికి అత్తమామలయిన అమ్మమ్మ తాతయ్యలకు ముసలితనం ఆవహించడం...ఆరోగ్యం చెడిపోవడం - దాంతో మరి కొడుకులున్నారా కూతుర్లున్నారా...ఒక్కగానొక్క కొడిక్కి ఒక్కగానొక్క కోడలు...మనమరాలి సేవలు...ఆలనాపాలనా అవసరమయ్యేవి. ముసలాళ్ళు కదలనిచ్చేరుకాదు.

అలాగని ముసలాళ్ళిద్దరూ ఎంతోకాలం బతికి బట్టకట్టలేదు. ఆరుమాసాలు తిరగకుండానే ముసల్ది ఒదిగిపోయింది. తల్లిని బుగ్గి చెయ్యడానికొచ్చిన నారాయణ్రావు తనతో భాగ్యాన్ని తీసుకు పోబోయాడు. తండ్రినీ తనతో రమ్మన్నాడు. ఆయన ఊరొదలనన్నాడు. ఈయన ఉద్యోగం వదలనన్నాడు. రైతులకివి రోజులు కావు అన్నాడు కూడా. ఎవరికీ ఇవి రోజులు కావన్నాడు అతగాడి తండ్రి.

"ముసల్ది ఎన్నాళ్ళు బతికేసింది? ముసలాడు ఎన్నాళ్ళు బతికేస్తాడు? ఆఖరి రోజుల్ల భాగ్యం వున్నా...ఇన్నాళ్ళూ అక్కడి నీరు పడక నిప్పుపడక పాడయిపోయింది. ఇప్పుడూ జబ్బుపడిపోయిందనీ వదిలీ. పైగా పొలమూ పుట్రా...గొడ్డూ గోదా ఎవరు చూస్తారు? ఎవరు చేస్తారు? పాలేర్లు పెట్టి చేయించినా.....పనొచ్చేసరికి పట్టుమని చేయించడానికి మనిషుండాలి...." పెద్దలూ బంధువులు బదులుపలికేరు.

ఏదైతే ఏం? అన్నింటికీ పరిష్కారంగా భాగ్యం వుండిపోవడమొక్కటే కడకు శరణ్యమయింది. అదే పరిష్కారమయింది. వ్యవసాయానికీ దక్షతయింది. బాధ్యతల బరువు వయసుని వంచేసింది.

నారాయణ్రావు వచ్చి వెళ్ళిపోవుండేవాడు. భాగ్యం అన్నిటికీ అలవాటు పడుతున్నది. అనివార్యమనుకుంటున్నది.

"కొడుకు కోడలు ఒకరికొకరు కాకుండా పోయారా? నిప్పులు పోసేనా నేను?" మనోవ్యథ. మంచమెక్కినా వదల్లేదు. అదే ఏడాది కళ్ళుమూసే ముందర అదే మాటన్నాడు. పాపం తాతయ్య పిచ్చివాడు.....

పిచ్చివాడు కాక మరేమిటి? ఆ మాటల్ని నారాయణ్రావు పట్టించుకోలేదు. రవ్వంత కూడా ఆలోచించలేదు. పైగా "పంటా పొలమూ మధ్యలో వున్నాయి. కాపుపోతే...ఇన్నాళ్టి శ్రమ పోతుంది. కొట్టించిన గుండా పిండీ...పెట్టుబడో....?" లెక్కలు వేసాడు. భాగ్యం అవి ఆ ఏడాదికే లెక్కలేమో అనుకుంది. అటుపైన ఏడాది ఏడాది అవే లెక్కలు తేలడంతో తన లెక్కల్లేవికనుకుంది. అదే విషయం నారాయణ్రావుని భాగ్యం అడిగింది కూడా!

"మీ అమ్మా నాన్న...అందరం చూసివెళ్తున్నాంగా' అని తన్ని కూడా కలిపేసుకున్నాడు నారాయణ్రావు. 'కాదూ అంటే మీ అమ్మా నాన్నల్ని వచ్చి ఇక్కడే వుండమను. తోడే గదా వుంటారు' తేల్చేసాడు.

దూరం పెరిగింది.

రాకపోకలు - ఫలసాయాల్ని బట్టి...ఋతువుల్ని బట్టి.. వచ్చి పోయినా. ఏ చినుకు ఏ విత్తనాన్ని మొలిపించిందోగాని....భాగ్యం దాహాన్ని తీర్చింది లేదు.

భాగ్యం ఎదురుచూసే చూపుల్లో ఎన్నో నల్లమబ్బులు కరిగి నీర వ్వడమూ తెలుసు....ఏవో మబ్బులు వీడని సంగతీ తెలుసు... కాలం దేనితో సంబంధం లేనట్లు గడిచిపోయింది.

తరువాత నారాయణ్రావుకు విశాఖపట్నం బదిలీ అయింది. భాగ్యాన్ని తెచ్చి దిగబెట్టారు ఆమె తలిదండ్రులు.

"మేం వున్నాం గదా...పొలం పంటా చూసుకుంటాం, మేం చెయ్యలేకపోతే అంబారానికి (కౌలుకి) ఇచ్చేస్తాం...కూలికి పెడితే కాదా? ఎంతో వచ్చినంతే వస్తుంది. ఈ అయిదారెకరాలకే భాగ్యమే వుండక్కర్లేదు. మీరు వచ్చి చూసి పోతూ వుండొచ్చు. వచ్చిందేదో అందిందేదో పట్టుకుపోవచ్చు...." అని అడక్కుండానే తమ ఆలోచన చెప్పారు.

అది భాగ్యం తలిదండ్రుల అప్పగింత కావు!

అది భాగ్యంకు నారాయణ్రవు అహ్వానించడమూ కాదు!

అయినా ఒకే గూటిలో చేరారు. మళ్ళీ అయిదేళ్ళకి. కాని భాగ్యానికి ఎన్నో ఏళ్ళు గడిచిపోయినట్లుండేది.

భాగ్యానికిప్పుడు వయసొచ్చింది. యవ్వనమొచ్చింది. శరీరానికి కావలసిన వుండవలసిన వాంఛొచ్చింది. ఎవ్వరూ లేని ఇంట్లో ఒకరికెదురుగా ...ఒకరు... ఒకరితో ఒకరు... ఒకరులో ఒకరు ...ఎన్నో అనుకుంది. ఎన్నో ఊహించుకుంది. తెలిసొచ్చిన సరసం కలిసి రావా లనుకుంది. ఊహలతో ఉక్కిరి బిక్కిరయిపోయి కొత్త పెళ్ళికూతురే అయింది.

కాని నారాయణ్రావుకు శారీరక అనుభవం కొత్తాకాదు, అరుదూ కాదు, ఆయన కంతా పాతే! భాగ్యం కోసమని...కాపురం కొస్తుందని తనేం మడికట్టుకు కూర్చోలేదు. పైగా తనకి తాను 'మగాణ్ణని' ఏనాడో గుర్తించుకున్నాడు. పాతివ్రత్యం ఆడవాళ్ళకేగాని మగాళ్ళకు లేదని తారసపడిన ఎందరి ద్వారానో ఎరిగి. లోకమంతా అలాగే వుందని...తాను కూడా అలా వుండడం తప్పుకాదనీ అనుకున్నాడు. అనుకున్నాడు గనుకనే తనగురించి తనెప్పుడూ ఆలోచించలేదు.

అంతకు ముందెన్నడో ఆలోచించినా - అమ్మా నాన్నా అక్కా బావ అంతా జీపిత భాగ్యంగా 'భాగ్యాన్నే' అనడం ఒక వంక అయితే - 'మీ మేనగోడలు పాకానికొస్తే నీవు లోకానికొస్తావ్' అని ఒక వంక - కట్టుబాటు శ్రేయస్సుకీ...ఎకసెక్కాల హాస్యానికీఆచీతూచుకున్నప్పుడు ఒకటే ఒకటి అనుకున్నాడు. భాగ్యాన్ని చేసుకోవాలి. బాధా (?) తీరిపోవాలి....

అలాగే తీర్చుకున్నాడు....ఏ వయసుకు అందాల్సిన ముచ్చటలు ఆవయసుకే అందుకున్నాడు. కాకపోతే కాసిన్ని డబ్బులు ఖర్చయినాయి.

అలాంటిది ఎక్కడెక్కడో తిరిగి మరిగిన నారాయణ్రావుకి తీరనివి లేవు. వాటి ఊహలు లేవు. అంచేత ఉత్సుకతా లేదు. ఉబలాటమూ లేదు. భాగ్యం తనకుండే తహతహ భర్తకీ వుండాలనుకొనేది. తను కోరుకున్నంతగా ఆయన కూడా కోరుకోవాలనుకొనేది. ఆయన కోరుకోకపోవడం వల్ల, భాగ్యం కొత్తదనంగా భావిస్తున్న దాన్ని పాతదనంగా నారాయణ్రావు భావించడం వల్ల - చెలరేగిన అసంతృప్తి ఏదో...అసహనంగా భాగ్యంలో పెరిగేది.

"ఆడపిల్ల అందొస్తుంది...ఇదిగో, ఎంతసేపు? ఎదిగిన తరువాత ఏపు ఎక్కువ. అదిగో ఇదిగో... ఎదిగిపోయింది, కండపట్టింది...ఒళ్ళు చేసింది....." అన్నారు పెళ్ళి జరిపిన పెద్దలు. కాని 'ఒకరి శరీరాలు

మరొకరికి అందొచ్చినా ఒకరి మనసు మరొకరికి అంది రాలేదు!'

ఎప్పుడో ఒకసారి...అదీ యాంత్రికత...నింగిని తాకాల్సిన కెరటం గాల్లోకి లేవక ముందే విరిగిపోయేది. ఒదిగిపోయేది. తీరం కేసి తలబాదుకొనేది. అలాగని కెరటాలు లేవడం మానుకోలేదు. పొంగడం మానుకోలేదు. కుంగడం మానుకోలేదు.

అనేక రకాల భోజనాలు చేసి రుచులు ఎరిగిన నారాయణ్రావుకి ఇంట్లోవున్న రుచి రుచి కాకపోవడం...రుచించకపోవడం భాగ్యానికి చాలా మటుకు అర్థమయేది. అణచుకొనేది. అలా నియంత్రించు కోవడం వల్లకానప్పుడు చెలరేగే సెగలు అనేక రకాలుగా దహించె య్యడం...నారాయణ్రావూ గుర్తించాడు.

కాని ఏదో స్తబ్దత ....సందిగ్ధత...

అంతా కలిపితే నిశ్శబ్దం!

భాగ్యం దృష్టిమరో దార్లో కొచ్చింది. అది ఆరిపోయిన దీపం వెలిగించాలని కావలసినంత కాంతి పొందాలనీ కాదు, ప్రమిదనే ధ్వంసం చేయాలనే తీవ్రత వున్నా అదివల్లకాని పని....అందుకే మూలాన్నే మర్చిపోయే దార్లు వున్నాయని భ్రమించింది. వెతుక్కుంది.

"మంచి సినిమా వచ్చింది వెళ్దాం...."

రాను సంతానం కలగడం చాలా అవసరమనుకుంది. కడుపు పండితే కలతలు కొన్నయినా తీరిపోయేవి, అని కూడా తోచేది, ఎందుకంటే ఇంట్లో పేరుకుపోతున్న అశాంతి తొలగిపోవడానికి ఒక కొత్త దారి దొరికేది' అని కూడా తోచేది.

కాని భాగ్యం కోరిక తీరింది కాదు.

నారాయణ్రావు లైను వెళ్ళిపోయినప్పుడల్లా భాగ్యం తలిదండ్రులు ఆమె చెంతకు వచ్చివాలేవారు. వాలిపోయిన ముఖాలతో అసుపత్రులన్నీ తిప్పారు. టెస్టులన్నీ చేయించారు. ఎక్కడికంటే అక్కడకు తిప్పేవారు. మందులూ మాకులూ వాడారు. బహిష్టులోనొప్పి అందుకు కారణమని మొదటనుకున్నారు. కాని ఆ నొప్పి కాలక్రమేనా పోయింది, కాని సమస్య తీరలేదు. ఆమె తలిదండ్రులు ప్రయత్నాలు ఆపలేదు.

ఒకవైపు ఇలా వుంటే మరొపక్క 'భాగ్యం గొడ్రాలని తేలిపోయింది. ఇంకెంత కాలం? ఇకనైనా మేలుకోవాలి. పిల్లాజెల్లా కలగకపోతే నారాయణ్రావొక్క మొగపురుగూ అయి నిలబెట్టుకు వచ్చినా... ఇక మీదట వంశం నాశనయిపోతుంది. ఇక ఆగి లాభంలేదు" అన్నారు అయిన వాళ్ళు.

సమస్య సమసి పోవడానికి నారాయణ్రావుకి మళ్ళీ పెళ్ళి శరణ్యం కాదు,తప్పనిసరని తేలిపోయింది.

**ఎప్పుడో ఒకసారి.. అదీ యాంత్రికత.. నింగిని తాకాల్సిన కెరటం గాల్లోకి లేవకముందే విరిగిపోయేది. ఒరిగిపోయేది. తీరం కేసి తలబాదుకొనేది. అలాగని కెరటాలు లేవడం మానుకోలేదు. పొంగడం మానుకోలేదు. కుంగడం మానుకోలేదు.**

"....షికారుగా తిరిగొద్దాం...."

- భాగ్యం అభ్యర్థనలని నారాయణ్రావు తోసిపుచ్చేవాడు. ఆసక్తి కనబర్చేవాడు కాదు. ఒక్కదానవీ వెళ్ళు అనేవాడు. లేదూ ఇరుగూ పొరుగును తీస్కెళ్ళు అనేవాడు. 'వాళ్ళకి మొగుళ్ళున్నారని...' అనాలని ఆగిపోయేది భాగ్యం.

"ఈ ముసలోడికి దసరా పండగ ఎందుకు? నలుగుర్లో నిన్ను నవ్వులపాలు చేయలేను...." నారాయణ్రావు నవ్వులపాలుకు గురవుతున్నట్టే గొంతుకూడుకుపోయేది. మాటలు రాకపోయేవి.భాగ్యం చప్పున చల్లబడిపోయింది. తన చర్యలు తనకే అసహ్యంగా తోచేవి. తన జీవితమే కాదు మామయ్య జీవితం మీద కూడా జాలివేసేది.

అలాంటప్పుడే నారాయణ్రావు తమ పెళ్ళి గురించి బాధపడేవాడు. జరగకుండా వుండాల్సింది అనేవాడు. అన్యాయమే జరిగింది నీకు అనేవాడు - అలా అని అప్పుడప్పుడూ బాధపడుతూ వుండేవాడు. భాగ్యంకు ఏడుపొచ్చేది. అంతకుమించి మామయ్యమీద జాలి కలిగేది. గౌరవం కలిగేది. పెద్దతనం మీద భక్తి కలిగేది.

నారాయణ్రావు భాగ్యం దంపతుల్ని గురించి - భాగ్యం తలి దండ్రులు, మరి కొంతమంది బంధువులు కలవలరపడేవారు. కాపురం ఎలా సాగుతున్నదీ అన్న విషయము కాదు వాళ్ళనందుకు గురిచేసింది. అసలా విషయము ఎప్పుడూ ఎవరూ పట్టించుకోలేదు.

అంత మందీ పట్టించుకొన్నదక్కటే!

అది 'సంతానం'!

ఏడెనిమిదేళ్ళు గడచిపోయినా పిల్లలు కలగకపోవడం... భాగ్యం కడుపు పండకపోవడం దిగమింగుకోలేని సమస్యయిపోయింది.

భాగ్యం మొదట్లో సంతానం గురించి లోచించలేదు, కాని రాను

"అవునవును ఇప్పటికే ఆలస్యమయిపోయింది, నిజమే....." వంత పాడారు, వంతూ తీర్చిచ్చారు. అందుకు సిద్ధమయిపోయేరు. ఎవరో కాదు నారాయణ్రావు పిన్నమ్మ పెద్దమ్మ పిల్లలే తమ ఆడపిల్లల్ని ఇచ్చేస్తామని ముందుకొచ్చారు. భాగ్యం తలిదండ్రులకి తమరక్త సంబంధీకులే అలా అనేసరికి తలతిరిగి పోయింది. పైగా పోటీ పడి వచ్చిన వార్ని చూస్తే నోటంట మాట రాలేదు.

" పిన్నమ్మ పెద్దమ్మ పిల్లలే కదా, పెద్దగా యారళ్ళు గొడవ వుండదు. ఉన్నా ఒకే కుండలోని అన్నం .మన కూడుపోదు, మనకుండ పోదు...." శాస్త్రాల్ని పొడుస్తూ ఖచ్చితమయిన మాటల్ని నిశ్చయంగా చెప్పారు.

భాగ్యం తలిదండ్రులు ఎంతగానో ఏడ్చారు. కూతురు కాపురం చూస్తూ చూస్తూ బుగ్గయి పోతుంటే తట్టుకోలేకపోయారు.

భాగ్యంకు తల్లిగా కాక, నారాయణ్రావుకు అక్కగా - పెద్దయి పుట్టుకకు వున్నా తమ్ముడి జీవితం తమ్ముడి ఇష్టమే అయినా - అందులో తన కూతురు జీవితం కూడా కలిసి వుందని కాళ్ళావేళ్ళా పడింది.

ఆ సమయంలో నారాయణ్రావు అచేతనంగా వుండిపోయాడు. అవయవాలు పనిచేయని వాడిలా అయిపోయాడేగాని అవునని అనలేదు - కాదనీ అనలేదు. ఆ వ్యవహారమే మరింత పెద్ద ప్రమాదంలా తోచేది. నోరు తెరచి చెప్పనప్పుడు ఎవ్వరి ప్రయత్నాలను ఎవ్వరూ అవుకోలేదు.

అప్పుడు పార్వతమ్మ కూడా వచ్చిన భాగ్యం తలిదండ్రుల్ని ఓదార్చి, తనకి తెలిసిన చోటల్లా 'వేటి మందుల'ని నాటుమందులుకు తిప్పింది.

భాగ్యం తలిదండ్రులు అపకుండా చేసిన ప్రయత్నంలో....డబ్బులు బాగా ఖర్చయిపోయినా.... ఇంగ్లీషు వైద్యులు ఒకమాట చెప్పేరు. అమాట వినడం అదే మొదట. లోకంలో అంతదాక అలా జరుగుతుందని భాగ్యంకు తెలీదు. ఆమె తలిదండ్రులకూ తెలీదు. భాగ్యం పడుతూ లేస్తూ చదివిన పది తరగతుల్లో పుస్తకాల్లో ఎక్కడా చదువుకోలేదు. అవి అర్థం చేసుకున్నంత చదువు లేకపోయినా సరే, డాక్టర్లు చెప్పితే కొంత అర్థమయింది.

....అదే... నారాయణ్రావు...దాంట్లో ఆ కణాలేవో లేవనీసి చెప్పారు. అందుకని వేరెవరివో....(స్పెర్మ్)...కలక్టు చేసి కావాలంటే భాగ్యానికి ఎక్కిస్తారనీ చెప్పారు. అది విన్నప్పుడే మతిపోయిన భాగ్యానికి అది ఎలా జరుగుతుందో ఊహించలేకపోయింది అయితే...అలా ఎక్కించిన వారివి.. వారి వివరాలు రహస్యంగా ఉంచుతారట. అలాగే తమకి కావలసిన రంగు...ఛాయ, ఎత్తూ...బరువూ... వీటినీ ఎంచుకోవచ్చుట. వారి ఆయా శారీరక మానసిక లక్షణాలు కొద్దో గొప్పో వచ్చే తీరుతాయట..... ఇవేవీ భాగ్యానికి మింగుడు పడడంలేదు.

భాగ్యం తల్లీదండ్రీ తటపటాయించినా అందుకు సిద్ధపడి పోతున్నారు."ఊ" కొట్టిన వారల్లా ఏమీ మాట్లాడుకోకుండానే చూపుల్లోనే ఒక నిర్ణయానికొచ్చారు. కూతురు కళ్ళలోకి చూసే ప్రయత్నం చేసారో లేదోగాని భాగ్యం తన చూపుని నేల నుండి పైకెత్తలేక పోయింది.

"ఆ...వైద్యానికి ఇక్కడ కుదరదు, మీరు ఔనూ అంటే మటుకు అందుకు ఏర్పాట్లు చేస్తాం. అయితే డబ్బు బాగా ఖర్చవుతుంది. పెట్టుకుంటామంటే చెప్పండి, డేట్ అరేంజ్ చేస్తాం..." అన్నారు డాక్టర్లు.

భాగ్యాన్ని అడిగారు.

భాగ్యం బదులివ్వలేదు .

"మనదేశం వెనకబడివుంది గాని....అదే ఇతర దేశాల్లోనయితే....' చెప్పబోయి భాగ్యం కళ్ళలోకి చూసి డాక్టరు ఆగిపోయేడు.

భాగ్యం కళ్ళు నీటికుండలు.

"బాగా ఆలోచించుకొని వస్తాం..." చెప్పాడు భాగ్యం తండ్రి.

అలాగే నన్నారు డాక్టర్లు.

అసుపత్రి నుండి వచ్చాక భాగ్యం చిన్న పిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె తలిదండ్రులు సముదాయించలేకపోయారు.

రెండు మూడ్రోజులు గడిచాయి. కన్నీళ్ళు ఇంకిపోయాయి. చారికలు మాత్రం చెరిగి పోలేదు. మళ్ళీ మొదలు...

"అమ్మాఁ...భాగ్యం....ఒప్పేసుకోవే, చేతులారా జీవితం చేజారిపోనివ్వకేఁ...." తల్లి ఆవిధంగా ప్రాధేయపడ్డం భాగ్యానికి వింతగా వున్నది. తనని కానీ పెంచిన తల్లేనా? తనకోసం తల్లడిల్లిన తల్లేనా? - ఇలా మాట్లాడుతున్నది...నిలువెత్తు ప్రశ్నలు. నిదురపోనివ్వని ప్రశ్నలు.

భాగ్యం ససేమిరా కాదంది.

పిల్ల కనడంతోటి జీవితం కుదట పడిపోతుందని భావించిన వాళ్ళని భాగ్యం అంగీకరించలేకపోయింది. ఇంత ఆస్తికీ...ఓ వారసుడు. అనుభవించడానికి కావాలి. అది పరాయి వాడికి పోకూడదు. అందుకే అయినవాళ్ళ నుండి అమ్మనాన్నలదాక అందరి ప్రయత్నమని భాగ్యం గుర్తించింది.

"విడాకులిస్తాడేమో?....."

అది భాగ్యం మొగుడు అనకముందే, ఆమె తలిదండ్రులే అన్నారు. భయపెట్టారు. బాధపెడ్డారు.

సరిగ అరోజుల్లోనే శ్రీను.......

గడచిన జీవితం గడియ గడియకూ కళ్ళముందు కదలాడుతున్నది.

భాగ్యం తనని తను సమీక్షించుకుంటూనే వున్నది. ప్రశ్నించుకుంటూనే వున్నది. సమాధానం పడలేక పోతూనే వున్నది.

'నారాయణ్రావు నిన్ను బాగా చూసుకుంటాడా?' అని పార్వతమ్మ వేసిన ప్రశ్న చిన్నదే అయినా - చిన్న తీగలాగితే డొంకంతా కదిలినట్టు భాగ్యం కదిలిపోతున్నది. కంపించి పోతున్నది.

ఇంతలో రొమ్ము మీద చిట్టుక్కుమని లేత పళ్ళగాటు!

నొప్పి...దానిమీద మందు రాస్తున్నట్టు లేత స్పర్శ...ఆ బుల్లి బుల్లి చేతులు గుండెల్ని దాటి బుగ్గల్ని తాకుతున్న.....తేగుడుతో తడుపుతున్న పెదాలు....

భాగ్యం అంతా మర్చిపోయింది.

ఏదో ప్రపంచంలోంచి ఇంకేదో ప్రపంచంలోకి ఒక్కసారిగా వచ్చినట్లయింది. పిల్లది భాగ్యం కళ్ళలోకి చూసింది.

ఆ బోసి నవ్వుకు బిడ్డను అక్కున జేర్చుకున్న భాగ్యంకు చేదు జీవితంలో - ఇగిరిపోతూ ఇంకెక్కడో కొద్దిగగావున్న తీపితనం భాగ్యానికి బతుకుమీద ఆశపుట్టించింది. ఆ ఆశతోనే కాలాన్ని ఈదాలనుకుంది.

పూడుకు పోయిన గొంతు సర్దుకుంటోంది. కళ్ళ నీళ్ళు కొలకుల్లో ఇమడలేక పోయి బయటకు జల జలా...వస్తున్నాయి.

సంతృప్తీ అనంతృప్తుల మధ్య....స్థబ్దతా నిశ్శబ్దాల మధ్య...గడ్డకట్టుకుపోతూ - చలనమొచ్చి ప్రవహిస్తూ - భాగ్యం.

అలాంటి స్థితిలో చూస్తున్న పార్వతమ్మ తన ప్రశ్నకు ఏ జవాబునీ ఆశించలేదు. అడగకుండానే అనేక జవాబులు ఆలోచనల్లో తిరుగాడుతూ షల్టీలు కొట్టాయి.

భరించటం అలవాటయిన నిశ్శబ్దమే మళ్ళీ.....అక్కడ వ్యాపించింది.

అప్పుడే పార్వతమ్మ చిన్న కొడుకు సురేషు వచ్చాడు.

"అమ్మాఁ.....నువ్విక్కడున్నావా?....మరేమో నువ్వు సున్నమెయ్యడానికి వస్తామన్నావట కదా?! ఆలెవరో వచ్చారు. ఇంటి దగ్గరున్నారు. నువ్వు రాయేఁ..."అన్నాడు.

"నువ్వు పద..పద వచ్చేస్తాను..." కొడుకుని పంపించేసిందేగాని చాలా సేపటివరకు పార్వతమ్మ కదలలేక పోయింది. కొంతసేపటికి తర్వాత పార్వతమ్మ 'మళ్ళొస్తాన'ని చెప్పి వెళ్ళిపోయింది.

మొదట్లో ఎదురెదురుగా వున్నప్పుడు రెండిళ్ళలో వున్నా - ఒకే ఇల్లులా...అంతా ఒకచోటే వున్నట్టు గడిచిపోయేది. అలాంటిది ఇంటిపై ఇచ్చిన అయిదు వేలూ రాకుండానే పార్వతమ్మ కుటుంబం ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. దానికి కూడా ఇదే కారణం...? శ్రీనులాగే వాడి ఈడు కుర్రాళ్ళందరూ పాడయిపోతారని అటుంచి, భాగ్యంకు తగినపని చెయ్యాలని చెప్పి, రైల్వేలో పని చేయకుండానే క్వార్టర్సులో వుంటున్నారని కంప్లయింట్ ఇచ్చి ఇల్లు కేన్సిల్ చేయించారు - ఇరుగూ పొరుగూ.

"లోకంలో ఇంతమంది క్వార్టర్సులో వుంటున్నారు. మీ ప్రవర్తన మూలంగానే నాకు ఎలాటయిన క్వార్టరు కేన్సిల్ చేసారు. ఇక మీదట కూడా లేకుండా చేసారు. చేసిందానికి మరొకలయితే ఇచ్చిన అయిదువేలు ఇవ్వక పోదును. దిక్కున్న చోట చెప్పుకోమందును. కాని ఏదో బంధుత్వమని చెప్పి ఇవ్వననడం లేదు.... నా దగ్గరున్నప్పుడే ఇస్తాను "తేల్చి చెప్పాడు అదూరపు బంధువు.

క్వార్టర్సు వెనకాలే సమయానికి ఇల్లుదొరికి పార్వతమ్మ కుటుంబం అందులో దిగిపోయింది.

భాగ్యం పిల్లని జోకొడుతూ ఆలోచిస్తోంది.

"పిల్లలకోసం....నా శారీరక సుఖం కోసం, కోరిక కోసం...శ్రీనుని వాడుకున్నాని పార్వతమ్మ అనుకోదూ?'...అప్రశ్న పార్వతమ్మకి తన

మీదున్న అభిమానాన్ని ప్రేమనీ చెరిపెయ్యదు కదా?....అలా అయితే ఈ సంబంధాలు ఇన్నాళ్ళు కొనసాగేవనేనా?!...."

"అయినా శ్రీనూని తను దూరంగానే వుంచింది. కాని ఆ అబ్బాయే ఆగలేదు....."

భాగ్యానికి కళ్ళముందు అప్పటి రోజులు మళ్ళీకదలాడాయి.

"అక్కా అక్కా.... నల్లకుక్క రెండు పిల్లల్ని పెట్టింది"

"అందులో ఒకటి నల్లటిది, ఇంకోటి తెల్లమచ్చలదక్కా..."

రమేషూ సురేషూ ఇద్దరూ భాగ్యంతో చెపుతూవున్నారు. ఇంతలో ఇంటి లోపలి నుండి శ్రీను కేక..." భాగ్యమక్కని పిలవండిరా, అన్నం ఉడికిపోతోంది, కూరకు అన్నీ రడీ చేసాను...."

బాత్‌రూమ్‌లో ఆ రోజు జరిగిన పని తరువాత శ్రీను భాగ్యం ఎదుట తలెత్తుకోలేక పోతున్నాడు. ఎదుట పడకుండా తప్పించుకుంటున్నాడు. అసలు వారం రోజులూ - మాటలు మామూలుగా మొదటిలా ఎప్పటిలానే మాట్లాడలేకపోయాడు. తలెత్తి చూడడానికి అదవా చూపు కలిసినా ఆ కళ్ళలో జంకుని భాగ్యం పసిగట్టింది. వారం రోజులకిదేమాట. అదీ నేరుగా కాకుండా వినబడేటట్టు కబురుగా......

భాగ్యం వంటగదిలోకి వచ్చింది. అన్నందించుతున్న శ్రీను తడబడుతూ దించినట్టో....వదిలేసినట్టో తెలీదు...తపేలా వదిలి పరుగు. ఆ కంగారు చూస్తే భాగ్యానికి నవ్వొచ్చింది.

పొయ్యి మీద కలాయి పెట్టి తాళింపు సిద్ధం చేస్తూ, మరో పక్క అన్నం వారుస్తూ భాగ్యం తనపనిలో తానున్నది. శ్రీనుతలుపు చాటు నుండే భాగ్యాన్ని చూస్తున్నాడు. కనురెప్పలు కొట్టుకోనంతగా కంటి గుడ్లు నిలబడి పోయాయి. భాగ్యం అనుకోకుండా చూసింది. గమనించ నట్టే కళ్ళు తిప్పకుండా మరో వారగా దృష్టినిలిపింది. శ్రీను చూపులు మామూలుగా లేవు. నడుం మడతల మధ్య చిక్కుకు పోయివుంది. భాగ్యం కొంగుని నడుం చుట్టూ తిప్పింది.

అంతే...శ్రీను గబగబా పరుగులాంటి నడకతో బయటకు వెళ్ళిపోయాడు.

ఇల్లు ఊడ్చుడానికి వంగి నపుడు .. తను ఉమ్మిఊయడానికి వంగినట్టువంగి, ఆర్పని కళ్ళతో అలాగే -

తలార బోసుకున్నప్పుడు ఆ జుట్టువంక ఇష్టంగా -

వెనుదిరిగి పరాకుగా వున్నప్పుడు భాగ్యం జాకీట్టువంక... ఆ జాకట్టులోని బ్రా వంకా వాంఛగా -

భాగ్యంకు ఇవన్నీ చూస్తుంటే ఎలా చెప్పాలో తెలియక, తనే శ్రీనుకళ్ళముందు తిరక్కుండా - దొరక్కుండా వుండిపోవాలని... తలుపులు వేసుకు నిర్భందించుకోవాలని నిర్ణయించుకున్నా, సాధ్యం కాలేదు.

పార్వతమ్మకు చెపుదామంటే నోరురావడంలేదు. అవకాశ మొస్తే శ్రీనుకే చెప్పాలనుకుంది భాగ్యం. శ్రీనులో వచ్చిన మార్పులేవో స్పష్టాస్పష్టంగా భోదపడుతూ వుంటే కొద్దిరోజులు గమనించాలనుకొంది.

వెంకాయమ్మ ద్వారా మరిన్ని బోగట్టాలు భాగ్యానికి తెలిసాయి. శనివారంపూట టిఫిన్‌కని, రుబ్బుకోసం... గ్రైండరు కోసం వచ్చినపుడు అవి ఇవీ చెప్పి ఈ కాలం కుర్రోళ్ళ గురించి చెప్పింది. అడగకుండానే శ్రీను గురించి చెప్పింది.

కొత్తగా వయసొస్తొందేమో ఆ బలుపు అలాగే వుంటుందని, అందుకే శ్రీను ఇన్నాళ్ళూ బాగా చదువుకున్నా - ఈ మధ్యే కొత్తకొత్త ఫ్రెండ్స్‌తో తిరిగి అలవాటు పడకూడని వాటికి అలవాటు పడుతున్నాడని చెప్పింది. అసలు సాయంత్రపూట... అలకి ఈపూట ఆపూట నేటి ఎప్పుడూ బేచీబేచీలుగా తిరిగి గుంటల గురించి గంటలతరబడి మాటాడుకోవడమనే చెప్పింది. ఎవరి తలిదండ్రులు ఊరెళ్లే వాళ్ళింట్లోనే పార్టీనట. మందూ ముండా అన్నీనూ....' చెప్పింది.

భాగ్యంకు ఆశ్చర్యంగా వుంది. జరగ కూడనిదేదో జరుగుతున్నట్టూ అనిపించి "పార్వతమ్మకి..." ఆగిపోయింది.

"వద్దమ్మా.. వద్దు.. ఆ తల్లి మాలచ్చిమి ఆడమనిషయీ మగమనిషమీ అన్నిరూపాయలు ఆ కుటుంబం కింద పడతంది. నెత్తురు ఊడుస్తంది. అది చాలదా? ఇంకా ఇదొక లంపోటకదూ

**అంతవరకూ అచేతనంగా వుండిపోయిన భాగ్యం శరీరంలో ఎంతకాదనుకున్నా కదలిక మొదలయ్యింది అదొక చైతన్యం... ఇదీ అని చెప్పలేనిస్థితి. రుచికరమైన పదార్థానికి తనప్రమేయం లేకుండానే నాలుక లాలాజలాన్ని స్రవించినట్టు ...**

ఆ తరువాత రోజు "భాగ్యమక్కా అమ్మ పిలుస్తోంది..." శ్రీను పిలుపు ఇన్నాళ్ళలా లేదు. 'భాగ్యం' ఒక్కటే బయటకు వచ్చి, 'అక్కా' అన్నపదం గొంతులోనే నెమ్మదిగా దిగమింగుకు పోయింది.

అక్కా' అని పిలవలేక పోతున్న శ్రీనుని గమనించింది భాగ్యం. పార్వతమ్మ వుంటే ఒకలాగ, లేకపోతే ఇంకోలాగ పిలిచేవాడు ఒకనాడు పార్వతమ్మ దృష్టిలో కొచ్చింది...అదే విషయం అడిగింది అడిగిన దానికి కాక, వేరేదేనికో సమాధానమిచ్చి దాటవేసాడు.

ఒకరోజొచ్చి 'బాగ్గి' పేరయితే ముద్దుగా వుంటుందన్నాడు శ్రీను.

భాగ్యంకు శ్రీను ప్రవర్తన అర్థమవుతున్నా 'ఇదేమిటి?' అని అనలేకపోయింది. ఏమిచేయాలన్నది, ఎవరికి చెప్పుకోవాలన్నది తెలవడంలేదు. అయినా ఏమని చెప్పగలను?' అనుకుంది.

శ్రీను నోట్లో బ్రెస్సు పెట్టుకొని గంటల తరబడి గడపలో నిల్చొనేవాడు. ఎదురింట్లో భాగ్యం ఏం చేస్తున్నదీ చూసేవాడు.అలా చూడడం కోసమే నిలబడేవాడు.

ఆయమ్మకి... మొగుడి వంక సుఖంలేదు. పిల్లలు ఇలగని తెలిస్తే.. ఉరేసుకు చస్తుంది, మనకెందుకు మధ్యల పాపం..?!" వెంకాయమ్మ గ్రైండర్‌లో నలిగిన పప్పును పట్టి చూసింది.

నలిగిన మననుతో వున్న భాగ్యాన్ని చూడలేకపోయింది వెంకాయమ్మ.

భాగ్యంకు ఏదీ చేతిలో లేనట్టయి ఊరుకుండిపోయింది.

రోజులు గిర్రుమని తిరిగి పోతున్నాయి.

అవి -

అవి దసరా ఉత్సవాల రోజులు. క్వార్టర్స్‌లో వుండే వాళ్ళందరి దగ్గరా డబ్బులు పోగుచేసి 'రైల్వే బొమ్మంటే' ఇదీ అనిపించేలా పెద్ద ఎత్తున చేసారు. హరికథా బుర్రకథట్లాంటివి ఎగిరిపోయినా చిన్నతెరకట్టో, టెలివిజన్ పెట్టో రోజుకు రోజా సినిమాలే, ఒక్కోరోజు రెండేసి కూడా. అర్థరాత్రి దాటిపోయేది. ఫేవరెట్ సినిమాలు వంతుల వారీగా.. అలాగే పెద్దోళ్ళ కోరిక మేరకు పాతసినిమాలు...

బొమ్మలు చూసి సినిమా చూసి పడుకోవడానికి వస్తానని చెప్పింది పార్వతమ్మ. అసలు భాగ్యాన్ని రమ్మంది. కాని భాగ్యంకు తలనొప్పిగా వుండడంతోటి బయలుదేరలేదు. రోడ్డు మీద సినిమాలంటే చిన్నప్పుడెప్పుడోగాని వెళ్ళాలనిపించదిప్పుడు. కొందరు ఆడవాళ్ళు కుర్చీలు పట్టుకు వెలుతున్నా, భాగ్యం మటుకు మంచంమీద చేరగిలబడిపోయింది.

నారాయణ్రావు లేడు. లైను వెళ్ళాడు. అంచేత తోడుగా అలవాటుగా పార్వతమ్మ వస్తుందని తలుపు చేరవేసి వుంచింది. పక్కమీద దొర్లింది. భాగ్యానికి ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.. తెలివి వచ్చేసరికి వంటిమీద శ్రీను వాలిపోయున్నాడు. నైటుబల్బు వెలుతురులో శ్రీనుని సులువుగానే గుర్తుపట్టింది. జరుగుతున్నదేమిటో అర్థమయ్యింది గాని ఏం చేయాలనీ భాగ్యం తేల్చుకోలేకపోయింది. తేరుకోలేకపోయింది. అప్పటికే చీరకొంగుగాని పైటగాని వుండాల్సిన స్థానంలో లేవు. జాకట్టు గుండీలు ఒకటొకటీ తెగుతున్నాయో.. వీడుతున్నాయో తెలియడంలేదు. నడుం చుట్టూ వున్న చీర సర్రుమని బలంగా పక్కకు పోతుంటే గబుక్కున భాగ్యం చెయ్యి కదిపింది. ఆమె చేతికి శ్రీను చెయ్యి దొరికింది. ఆ కొద్దిపాటి క్షణాల్లోనే శ్రీను తన నాలుకతో చీకటి తొలగని.. వెలుగుసోకని స్థలాల్లో దేవులాడుతున్నాడు. పసిపిల్లాడి మల్లె ఏ అచ్ఛాదనా అడ్డులేని గుండెల్ని........

అంతవరకూ అచేతనంగా వుండిపోయిన భాగ్యం శరీరంలో ఎంతకాదనుకున్నా కదలిక మొదలయ్యింది. అదొక చైతన్యం... ఇదీ అని చెప్పలేని స్థితి. రుచికరమైన పదార్థానికి తన ప్రమేయం లేకుండానే నాలుక లాలాజలాన్ని స్రవించి నట్టు ...

అబగా చుట్టుకు పోతూ పెనవేసుకు పోతూవున్న చేతుల్ని ఛీత్కారించ లేకపోయింది. ఎన్నాళ్లినుంచో కోరుకుంటున్నదేదో. అందుతూ అందిస్తూ వుంటే చేతులు చాపకుండా వుండలేక పోయింది. చెయ్యి కలుపకుండా వుండలేకపోయింది. తనూ శ్రీనులాగే అయ్యింది. శ్రీనులో భాగమయ్యింది. భాగ్యంలో భాగం శ్రీనయ్యాడు.

నింగినంటిన కెరటాలేవో తిరిగి నేలకు చేరాయి.

శ్రీను కళ్ళు మూసుకున్నాడు. భాగ్యం శ్రీను వంక చూసింది. శ్రీను కళ్ళు తెరిచి వెంటనే మూసుకున్నాడు. సిగ్గుతో చూడలేని తనాన్ని భాగ్యం గుర్తించింది. శ్రీను వంక అలాగే చూసింది. ఆచూపు అక్కడే నిలబడక అలా తనమీదకే ప్రసరించింది నగ్నంగా వున్న శరీరం... ఏదో తృప్తిని మోస్తూవున్నా - అసంతృప్తినీ పెంచుతూవుంది. అది అసహ్యంగా... తప్పిదంగా రూపాంతరం చెందుతూవుంది.

అలసిన దేహంలాగే అలసిన మననూ మరి ఆలోచించలేకపోయింది. అచేతనంగా వుండిపోయిన భాగ్యం మెదడు స్తబ్దతకు గురయింది. అలగ ఎంతసేపు గడిచిందో తెలీదు, కళ్లు తెరచి చూస్తే శ్రీను లేడు. పక్క మీద తనొక్కర్తే వుంది. చీర చుట్టుకుంటూ చూసింది, తలుపులు శ్రీను వెళ్ళిపోయినట్టు సాక్ష్యమిచ్చాయి.

భాగ్యం పక్కమీంచి లేచి చీరసర్దుకుంది. తలుపు గడియపెట్టి వచ్చి పడుకుంది. నిద్ర పట్టడం లేదు. చేయకూడని అపరాధమేదో చేసినట్టు తన మనను తనవే క్షమించడంలేదు.

కనిపించని నేరమేదో చేసినట్టు... పశ్చాత్తాపంతో అది తీరనట్టు... తనని తనే నమ్మలేనట్టు... ఇదీ అని చెప్పలేని ఇదమిద్ధం కాని భావాలేవో భాగ్యాన్ని పిండిచేస్తున్నాయి. ఏదో దాడికి గురయినట్టు చెమటలెక్కి పోయింది. ఎందుకో తెలీదు గాని ఏడుపొచ్చేసింది. ఏడ్చేసింది. క్షణాల్లో దుఃఖమూ గడ్డ కట్టుకుపోయి కన్నీళ్ళింకి పోయినట్టే కళ్ళు ఆరిపోయాయి. వేకువ ఝామునెప్పుడో నిద్రపట్టింది భాగ్యానికి.

ఆవారంలోనే నారాయణ్రావు ఇంటికి వచ్చి రెండ్రోజులే వుండి తిరిగి లైను వెళ్ళిపోయాడు. శ్రీను మాత్రం తచ్చాడుతూనే వున్నాడు. భాగ్యంలో రగులు తున్నదేదో ఇంకెప్పుడూ ఇలా జరక్కూడదు' అని తీర్మానించింది. మొదట్లో అలానే వున్నా... తరువాత రోజుల్లో 'తప్పో ఒప్పో ఒకసారి జరిగాక.... జరిగిపోయిందేదో చెరిగిపోదు' అనిపించింది కూడా. ఆకలి వేసినట్టు... నిద్రవచ్చినట్టు.... అంతే సహజంగా శరీరం మరో శరీరాన్ని కోరుకొనేది! ఆయావేళల్లో శరీరాన్ని భరించడం కష్టమనిపించేది. ఆకలికి తాలలేనట్టే, నిద్రకి తాలలేనట్టే జీవమున్న శరీరమున్నా........

భాగ్యంకు ఆయాసందర్భాలలో కోరిక కలిగేది. అణచుకొనే శక్తి లేకపోయేది. ఒకటి రెండ్రోజులు.. వారం అంతకుమించి బంధించడం వల్లయ్యేదేకాదు. అయా సందర్భాలలో బీడు నేల వాన చినుకు కోసం... వడగళ్ళ వాన కోసం ఒడి చాచుకు కూర్చున్నట్టుగానే భాగ్యం శ్రీను కోసం చూసేది. శ్రీను అందుకోసమే చూస్తున్నట్టుగా చేసే ప్రయత్నాలు అందుకు మరింత సహకరించేవి. అలా ఆ తరువాత రోజులకలయిక-తరువాత్తరువాత రోజుల కలయికకు కొనసాగింపయ్యింది.

అయితే అప్పుడప్పుడూ భాగ్యంకు చచ్చిపోవాలనిపించేది. ఏదో తెలియని బాధ గుండెను గొలపొడుస్తూవుంటే విరక్తి భావం కలిగేది. భరించలేక బతుకు చాలించుకుందామనే సరికే కడుపులో పిల్లది పడింది. ఎందుకో మళ్ళీ బతకాలనే కోరిక.. ఆశ చిగురించేయి. శరీరంలో కోరికా పెరిగేది. రాత్రివేళకు తనకు తెలియకుండానే భాగ్యం శ్రీను కోసం ఎదురుచూసేది. ఒకటొరెండు నెలలకి రోజులన్నీ ఎప్పటిలాగే మామూలయిపోయేవి.

భర్త తాగి వీధుల్లో తిరగడానికి రాత్రీ పగలూ లేదని పార్వతమ్మని తన ఇంట్లోనే పడుకొనేట్టు చేసి, శ్రీను తన కార్యాన్ని ఆటంకం లేకుండా చేసుకున్నాడు.

భాగ్యం నెలతప్పినందుకు పెద్ద పండగే అయ్యింది. భాగ్యం అమ్మానాన్నలు వచ్చారు. ఇన్నాళ్లికి తమ పూజలు ఫలించాయన్నారు. దేవుడు కరుణించాడన్నారు. మొరాలకించాడన్నారు. మొత్తానికి అపురూపం అయిపోయింది వాళ్ళకి. వాళ్ళ ఆనందాల్ని అనుభూతుల్ని చూస్తూ భాగ్యంకు అబ్బురమనిపించింది. కన్న వాళ్ళ సంతృప్తి భాగ్యానికి తీపిగా తోచింది.

పండ్లు రకరకాల జాతులవి తెప్పించిపెట్టారు. ఫలహారాలూ వంటలూ ఒకటేమిటి? ఎక్కడ ఏది దొరుకుతుందన్నా - అది కాలం కాదన్నా - అదే కాలమని పట్టుపట్టి పైసలు పెట్టి ఇల్లు నింపేసారు తలిదండ్రులు.

**ఆకలివేసినట్టు ... నిద్రవచ్చినట్టు ... అంతే సహజంగా శరీరం మరో శరీరాన్ని కోరుకొనేది! ఆయా వేళల్లో శరీరాన్ని భరించడం కష్టమనిపించేది. ఆకలికి తాలలేనట్టు, నిద్రకి తాలలేనట్టు జీవమున్న శరీరమున్నా ....**

శ్రీను ఇదంతా చూస్తూనేవున్నాడు. ఆ సందడికి మూలం తనే ననుకున్నాడు. అలా అనుకున్నాక గర్వం వేసింది. ఘనకార్యం సాధించినట్టుతోచింది. ఆ సందడిలో తనూ భాగం పంచుకున్నాడు. ఎవ్వరు తననిగుర్తించే వీలులేక పోయినా భాగ్యం గుర్తించే తీరుతుందని భావించాడు. ఆవిడ జీవితాన్ని నిలబెట్టిన భగవంతుడుగా కూడా శ్రీను భ్రమించాడు.

అదంతా కూడా చర్యల రూపంలో ప్రతిస్పందన వస్తుందని భాగ్యం నుండి రావాలని శ్రీను ఆశించాడు. కాని భాగ్యం మామూలుగా వుండడంతో తనే ప్రదర్శించాలని అనుకున్నాడు. అంచేత ఇంట్లో... పరాయింట్లో సొంత మనిషిలాగ నచ్చిన మిఠాయిలన్నీ తిన్నాడు. పాలూ పళ్ళు తాగాడు. భాగ్యాన్ని కూడా తినమన్నాడు.

శ్రీనువాలకం చూస్తున్న భాగ్యం తలిదండ్రులకు మండుకొచ్చింది. ఏమీ అనలేక భాగ్యంతో చెప్పారు. భాగ్యం సరిగ్గా సర్ది చెప్పలేక... చనువుని-పోతేపోని ఎంతఅని - అనేసింది.

నారాయణ్రావు లైను నుండి వచ్చి భాగ్యం వట్టిమనిషి కాదని తెలుసుకొని అందరి సందడిలో తనూ భాగం పంచుకున్నాడు. ఆనందించాడు. మిత్రులందరికీ మందుపార్టీ ఇచ్చాడు.

బంధువులు కూడా వచ్చి పరామర్శగా అభినందనలు తెల్పివెళ్ళారు.

నారాయణ్రావు ఎప్పుడూ సెలవు పెట్టి ఎరుగక పోయినా ఇప్పుడు మాత్రం నెలరోజులు సెలవు పెట్టి ఇంటి పట్టునే వుండిపోయాడు. మొదటిసారిగా భాగ్యానికి అలాంటి పరిస్థితిని చూస్తున్నందుకు విడ్డూరంగా వుంది. పైగా ఆరోగ్య సూత్రాలు కూడా చెప్పడం.

అంతమందీ సంతోషంగా వున్నందుకు భాగ్యంకూడా సంతోషం వేసింది. ఎంత సంతోషంగా వున్నా ఒక్కోఅప్పుడు ఏదో తెలియని వెలితిగా వుండేది. విచారంగా వుండేది. మరొక్కసారి భయంగా వుండేది. ఆభయంతో కుచించుకుపోయేది. ఏదో ఘర్షణ అలికిడి లేకుండానే ఆమెను వెంటాడి వేటాడేది. అలాంటప్పుడే మోయకూడని భారాన్నేదో మోస్తున్నట్టని పించేది. మోయలేనట్టూ అనిపించేది.

ఆ భారం మోయడం వల్లనే అంతమందీ సంతోషిస్తున్నప్పుడు అదితప్పకాదనీ భాగ్యంకు అనిపించేది.

మొత్తానికి ఇంటి వాతావరణంలో మార్పు వచ్చింది.

అయితే శ్రీను లోనూ మార్పొచ్చింది. భాగ్యం తనని గుర్తించడంలేదని, అశ్రద్ధచేస్తున్నదని కోపం కలిగింది.

ఏది ఏమయినా మరోపెళ్ళని కాని, విడాకులనికాని, వారసుడనికానీ భాగ్యానికి భయాలన్నీ పోయాయి! ఉన్నదల్లా ఒక్కటే భయం... అది శ్రీను నుండి కొత్తగా తలెత్తిన భయం.

ఆరోజు నారాయణ్రావు లైను వెళ్ళలేదు. ఇంట్లోనే వున్నాడు. అంటే ఇంటిముందు అరుగు మీద కుర్చీలు వేసుకొని వచ్చిన చుట్టాలెవరితోనో కబుర్లు చెప్పుకుంటున్నాడు. భాగ్యం కోసం శ్రీను ఇంట్లోకి నడిచాడు. ఎప్పుడో వచ్చే అవకాశం కోసం ఆగినట్టులేడు. రోషంగా వుండడంతో ముందు వెనగా చూడ్డంలేదు.

అప్పటికి భాగ్యం వంటేదో చేస్తున్నది. వట్టిమనిషి కాదని అప్పుడే అమ్మానాన్ని పనిసాయం కోసమని దూరపు బంధువుల పేదపిల్లని తెచ్చిపెట్టి వెళ్ళారు. ఆ పిల్లేమో కూరలేవో తరుగుతున్నది.

వంటగదిలోకి చొరబడిన శ్రీనుని భాగ్యం గ్రహించలేదు. రెండుక్షణాలు జరిగినా చూడనందుకు తనకేదో అవమానం జరిగినట్టు రెండు గంటలయినా చూడనట్టు శ్రీను చిన్నబుచ్చుకున్నాడు. ఎక్కడో కొద్దికొద్దిగా ప్రారంభమైన కోపం ఎక్కువయింది. ఆగలేకపోయాడు.

"భాగ్యం...భాగ్యం..నిన్నే"

ఆసంబోధనకు ఆకూరలు కోస్తున్న పిల్ల ఎవరా అని అర్థంకాక చూస్తోంది.

"నేను గుర్తున్నానా? ...

'లేవు' నవ్వుతూ శాంతపరుద్దామనే ఉద్దేశంతో అంది భాగ్యం.

"అంతేమరి... నీ అవసరం తీరిపోయింది, అని చెప్పెయ్యి. నీ సొకుకీ సొంపుకీ కారణం నేను..."దేనికి మూల తనని భావిస్తున్నాడో దాని పరోక్షంగా ఎత్తి చూపుతున్నాడు శ్రీను. ఆగొంతులో ఏదో కసి నిండుకుంది.

భాగ్యంకు అర్థమవుతున్నది.

ఆపిల్లకూ ఏదేదో అర్థమవ్వక, కూరలు తరగడమాపి అనుమానంగా చూస్తున్నది.

"నువ్వు కూరలు కొయ్యి, అలా చూస్తావే?"

శ్రీను గొంతుకి అందులోని అజమాయిషీకి వులుక్కుపడిందాపిల్ల. అయోమయంగా భాగ్యం వంక ప్రశ్నార్థకంగా చూసింది.

"...శ్రీనూ..." భాగ్యానికి ఏమనాలో తెలియడంలేదు.

"అంటే నేను గుర్తున్నానన్నమాట..." శ్రీను మాటలో గొంతులో కసివుంది.

భాగ్యంకు ఏదో ప్రళయం ముంచుకొచ్చినట్టుగానే తోస్తున్నది. అందుకనే సాధ్యమైనంత సౌమ్యంగా "విషయమేమిటో చెప్పు... దేనికి?" ' అడిగింది.

శ్రీను భాగ్యం కళ్ళలోకి చూసాడు. కూరగాయలు తరుగుతున్న పిల్లవంకచూపు తిప్పి "నీపేరేమిటి?" అడిగాడు.

"జానకి.." తెలియని మనిషి అడుగుతుంటే తేరుకోకుండానే చెప్పిందాపిల్ల.

"నీకు రాముడు తెలీదా? సరే..." శ్రీను మాటలు పూర్తవకముందే 'తెలీదు' నిజాయితీగా చెప్పింది జానకి.

"సరే.. ఈ ఇంటిముందు రోడ్డుందా? ఆ రోడ్డు దాటితే.. ఎదురుగా ఇల్లువుందా? అది మాదే... వెళ్ళు... శ్రీను వున్నాడో లేదో కనుక్కురా? పో..." శ్రీను ఆజ్ఞాపించాడు. జానకి లేచి గౌను దించుకుంటూ లంగా సర్దుకుంటూ వెళ్ళింది.

"నీ ప్రవర్తనేమీ బాగోలేదు..." భాగ్యం కోపాన్ని పెదవి మాటున అదిమిపట్టింది.

"అవునుమరి ఇన్నాళ్ళూ నా ప్రవర్తన బాగున్నా, ఇప్పుడు బాగోదు... ఇకమీదట బాగోదు..." ఏదేదో ఊహిస్తూ అన్నాడు శ్రీను.

భాగ్యం తలదించుకొని పని చేస్తూ 'ఆయన వున్నారు' అంది.

'వుంటే వున్నీ' అంటూ పక్కనే కేరియర్లో వున్న లడ్డూని రెండు అంగల్లో తినేసి భాగ్యం పైట చెంగుతోనే మూతి తుడుచుకున్నాడు శ్రీను. భాగ్యం శ్రీను చర్యకు కంగారు పడింది. ఎవరైనా చూసేరేమోనని అనుమానంగా చూసింది. గుండె వేగంగా కొట్టుకోవం ప్రారంభించింది.

"డబ్బులొద్దు" శ్రీను చెప్పాడు.

ఎప్పటికప్పుడు డబ్బులు అవసరమని తీసుకు వెళ్ళే శ్రీను వాటికోసమేమోనని అనుకున్నా, అది కాదనడంతో భాగ్యం అర్థం కాక 'మరి?' అడిగింది.

"నువ్వు కావాలి"

భాగ్యం చెవి దగ్గర నోరు పెట్టి చెప్పాడు శ్రీను. అలానే బుగ్గని అందుకొని ముద్దుపెట్టుకుంటూనే చటుక్కున కొరికాడు.

భాగ్యం అదిరిపడుతున్నది. అటూఇటూ చూస్తూవున్నది.

"నువ్వు కావాలి" మళ్ళీ శ్రీను అదేమాట.

ఏమనాలో తెలియక 'అలాగే' అంది భాగ్యం

'ఎప్పుడు?' అంటూ భాగ్యం నడుంమీద తన చేతివేళ్ళతో గీతలు గీస్తూ మడతల్ని లెక్కపెడుతూ శ్రీను.

"...అబ్బా...శ్రీనూ..." భాగ్యం చేతకానిదయింది.

"ఔను... నేనే...ఓయ్..."శ్రీను పలుకుతూ మురిపాలకు పోతున్నాడు. స్టవ్వుమీద వుడుకుతున్న పాత్రలో గరిటతిప్పి కలుపుతున్నాడు.

జానకి రావడం ఇద్దరికీ అగుపించింది.

'బాగ్గీ' అంటూ తన రెండు చేతుల్తో భాగ్యం ముఖాన్ని పట్టుకొని, వాంఛాపూర్తిమైన.... ఆవేశపూరితమైన... బలంతో గట్టిగా అమె పెదాల్ని తన పెదవులతో పట్టి గట్టిగా కొరికాడు శ్రీను.

చిట్టుక్కుమంది, శబ్దం రాకుండానే భాగ్యం పెదవి పంటిగాటుకు విచ్చుకొని రక్తం ఎర్రగా పెదవిరంగులో కలిసి పోతూ... పెదవిరంగుని హెచ్చిస్తూ లిప్స్టిక్‌లా... అలాగే కరిగిపోయినట్టే సన్నగా జారిపోతూ....

బాధతో మూలిగింది భాగ్యం.

శ్రీను ఎడంగా జరిగి తన పెదవుల్ని ఒకదానికొకటి రాపిడి చేస్తూ చప్పరించు కొని పొడిగా చేసుకున్నాడు.

భాగ్యం తన పెదాల్ని చప్పరిస్తూవున్నా, రక్తం స్రవిస్తూనే వున్నది. అమె ఏదో అనబోయింది. కాని అప్పటికే జానికి వచ్చింది.

"వచ్చేసావా జానకీ? ఆ రాముణ్ని వదిలి జానకి అడవులపాలైనా... నువ్వు భాగ్యాన్ని వదలవన్నమాట" శ్రీను మాటలు జానకికి అర్థం కాలేదు. భాగ్యానికి ఒక వైపు శ్రీను మీద కోపం వున్నా, మరోపక్క తెలియని ప్రేమో... ఏమో?!

"ఏమన్నారు?" శ్రీను మళ్ళీ అడిగాడు జానకిని.

"ఎదురింట్లో అడిగానండి, శ్రీను ఏమో ఇక్కడికో.. ఎక్కడికో... వచ్చారని చెప్పారండీ..." జానకి కనుక్కున్న విషయమే చెప్పింది.

"అహా...అలాగా, అయితే ఆ శ్రీనుని నేనే..." అంటూ నవ్వుతూ బయటకు శ్రీను వెళ్ళిపోయాడు. జానకి అమాయకంగా అతడు వెళ్ళినవంకే చూస్తూ వుండిపోయింది.

భాగ్యంకు ఎంత నవ్వుని అపుకుందామన్నా వల్లకాలేదు.

కొద్దిసేపటికి జానకి కూడా తేరుకొని నవ్వేసింది. "వచ్చినబ్బాయి ఎవులోగానండీ... మాకానోడండి... మీరంటే చాలా చనువు కూడా వున్నాదన్నమాట. మంచోడే... ఒక్కదెబ్బకొట్టాడు... భలయినోడే... మొత్తానికి నవ్వించేసాడు కుర్రోడు. మాఊర్ల సువ్వారి వీదిలోని సన్నిగాడంతే..." ఏం గుర్తుకొచ్చిందో జానికి తలదించుకు పనిచేసుకు నవ్వుతూనే వున్నది.

భాగ్యం జానకి వంక చూసింది. జానకి తన వంక ఎక్కడ చూస్తున్నదోనని భయపడ్డది. పెదవికయిన గాయం కూడా ఎక్కడ కంటబడుతుందోనని కంగారు పడ్డది. కనబడకుండా వుండడానికని పదేపదే భాగ్యం తన పెదవుల్ని చప్పరించుకుంది. అలా చప్పరిస్తున్న కొలదీ భాగ్యానికేదో తియ్యదనం కలిగింది. ఆ తియ్యదనాన్ని కలిగించిన శ్రీను తలపుకొచ్చి ఇష్టంగా నిట్టూర్చింది.

ఆవాళ మధ్యాహ్నం భోజనాలప్పుడు పెదవి తగిలిన కారం వుప్పుకీ కణేల్ మని మంట పుట్టడంతో 'అమ్మా...ఉఫ్...' అంది, వూదుకుంది. పెదవి చప్పరించుకుంది.

నారాయణ్రావు చూసి తినడమాపి 'అరే ఏమయింది?' అడిగాడు. భాగ్యం పెదవిని కూర్చున్న చోటునుండే ముందుకు వంగి గమనించాడు.

"నాలిక్కరుచుకున్నాను... పెదవి కొనుక్కున్నాను...." భాగ్యం శ్రీనుని తలచుకుంటూ మదిలోనే తిట్టుకుంటూ అంది.

"ఎందుకంత గాబరా? పోన్లే... కారం తగిలితే పోతుంది... తిను పరవాలేదు" అనేసి నారాయణ్రావు తన భోజనం కానిచ్చి లేచాడు.

మంచి నీళ్ళు తెచ్చి భోజనం దగ్గర అమర్చుతున్న జానికికి ఇదేమి అర్థంకాలేదు. ఎందుకంటే పొద్దునే తను చూసి భాగ్యాన్ని ఆ విషయం అడిగిందికూడా. అయినా తనకెందుకన్చెప్పి నోరుమూసుకొని విననట్టే నటించింది.

ఆరాత్రికి పార్టీలంటూ బార్‌కు వెళ్ళిపోయాడు నారాయణ్రావు. తమవూర్లో సినిమా హాల్లు లేవని ఫస్టుషో సినిమా కెళ్ళింది జానకి. సమయం చూసి ఇంట్లో చొరబడి 'భాగ్యం' అన్నాడు శ్రీను తలచగానే ప్రత్యక్షమయినట్టు

'సారీ..'అన్నాడు పెదవి వంక చూస్తూ.

'ఎందుకునాయనా...' మళ్ళీ పెదవెక్కడ కొరికేస్తాడోనని భాగ్యం భయపడుతూ పెదవి దాచుకుంది.

"ఎందుకంత భయం" శ్రీను అడిగాడు

"నీకయితే తెలిసేది, తిన్నప్పుడు ఎంతమంట పెట్టిందో తెలుసునా?" భాగ్యం పెదవి చూపించి అడిగింది.

"మరెప్పుడూ అక్క కరవనులే.. ఇంకోచోట చూసుకుంటా' నవ్వుతూ శ్రీను అంటూవుంటే 'ఆఁ...' నోరు వెల్లబెట్టింది భాగ్యం. తేరుకొని నవ్వి, లాలనగా శ్రీను జుట్టు పట్టుకులాగి ఒక్క మొట్టుపెట్టింది భాగ్యం.

'ఇంకొటివ్వవూ' శ్రీనుకి ఆనందంగా వుంది.

భాగ్యం మరోటి మొట్టింది, అదీ దెబ్బతగిలీ తగలనట్టు సున్నితంగా.

"ఆకలేస్తోంది... పెట్టవా?' శ్రీను కళ్ళలోని ఆకతాయి తనానికి, లేని కోపం తెచ్చుకుంటూ "ఎప్పుడూ అదేనా?" అంది భాగ్యం.

"కాదు... అన్నం పెట్టు, ఆకలి" కనుగుడ్ల తిప్పకుండా అన్నాడు శ్రీను.

భాగ్యం నిజమేమోనను కొని అన్నం పెట్టింది.

"నువ్వు తిన్నావా?" శ్రీను అడిగాడు.

"లేదు, అయన వచ్చాక...." భాగ్యం మాటతో శ్రీను కొంత చిన్నబుచ్చుకున్నా బయట పడకుండానే అన్నం కలిపి ముద్దలుగా చుట్టాడు. చుట్టాక ' రా ఇలా కూర్చో' భాగ్యాన్ని ఎదురుగా కూర్చో మన్నాడు. భాగ్యం వల్ల కాకపోయినా తలుపుగడియ పెట్టీ పెట్టనట్టుగా పెట్టి వచ్చి కూర్చుంది.

"ఇది కోడిగుడ్డు.... ఇది కొంగ గుడ్డు... ఇది వాగుడ్డు... ఇది నీ గుడ్డు...." శ్రీను మరీ చిన్నపిల్లాడులా అంటుంటే-' సరిసరే... తిను తిను...' అంది భాగ్యం. అవతల టైము కావస్తున్నదన్న బెంగ పెరుగుతోంది.

"నాకోసం కాదు, బాగ్గీ నీకు... నీకోసం... నావల్లే నీకు పెదవి చిట్లిందిగా.... అందుకే నువ్వు 'ఆఁ..' అని నోరు తెరు. నాలికమీద ఒక్కో ముద్దు.. కాదు ముద్ద పెట్టేస్తాను.. సరేనా..." శ్రీను అసక్తి కలిగేలా అడిగాడు.

భాగ్యం వద్దంది. శ్రీను వినలే. వాడి పంతమే నెగ్గింది. భాగ్యానికి ఆ ముద్దలన్నీ తినిపించాడు. ఆకలి లేకపోయినా భాగ్యమూ ఎందుకో తినగలిగింది. చిన్నప్పుడు తల్లి గోరు ముద్దలు తప్పితే.. అప్పుడెప్పుడో గోరింటాకు రెండు చేతులకు పెట్టుకున్నప్పుడు సాయంత్రమనగా పెట్టుకున్నా - బాగాపండాలని తెల్లవారిందాక వుంచినపుడు... అప్పుడప్పుడూ అమ్మో.. అమ్మమ్మో తినిపించేవారు. అదీ చిన్నతనంలోనే!ఈ వయసులో ఇదే మొదట... ఇదే ఆఖరూనేమో.. అనుకుంది భాగ్యం.

అలా ఒకరు తినిపిస్తూవుంటే తినడం ఎంతో హాయిగా వున్నది. జీవితాంతం వుండవలసిన హాయి అరుదుగా దొరికితే?.... అందుకే ఆప్యాయంగా ప్రేమగా అన్నమంతా తినేసిందిభాగ్యం. ప్రేమగా ముద్దులాడింది. శ్రీను గర్వపడ్డాడు. ఆ గర్వంలో 'ఒరే బాగ్గీ రోజూ ఇలా తినకూడదూ, తినిపించకూడదురా రాస్కెల్..." చిలిపిగా వయినా తిట్టేడు. భాగ్యం నెత్తిమీద రెండు మొట్టాడు 'చెల్లూ' అంటూ.

తలుపు చప్పుడు పార్వతమ్మ తోయడం భాగ్యం తియ్యడం ఒకేసారి జరిగింది. అప్పటికే భాగ్యం తన ఎంగిలి పెదవుల్ని చప్పరించుకుంది. ఏ అనుమానమూ రాకుండా తుడుచుకుంది కూడా.

ఎంగిలి చేతుల్తో శ్రీను అగుపించాడు పార్వతమ్మకి.

'ఇక్కడ తినేసావా? .... చెప్పడమయినా వుందా? నీ కోసమని అన్నం వుంచాను. పొద్దే అడుక్కున్నాడు అరుగుకదలడం లేదు వేసొస్తానుండు..." పార్వతమ్మ తిరిగి వెళ్ళింది. తల్లి ఎదుటే చేయి కడుక్కున్న శ్రీను తలుపు దగ్గర నిలుచున్నాడు. అప్పుడే సినిమా నుండి జానికి వచ్చింది. ఆ వెనకాతలే నారాయణ్రావు.

శ్రీను వెళ్ళిపోయాడు వెళ్ళలేనట్లు.

శ్రీను ఇక్కడా తినక, అక్కడ ఇంట్లోనూ భోజనం లేక ఆకలితో వుంటాడన్న వుండక తప్పదన్న ఆలోచనతో భాగ్యం బాధపడింది.

నారాయణ్రావు తాగినా తెలివి మీదే వున్నాడు. 'భాగ్యం నీకోసమే... నేనక్కడే తిన్నాను... పులావ్ కట్టించు కొచ్చాతిను" పొట్లాం అందించాడు. సారా కంపుకొద్దికొద్దిగా వస్తోంది. కిల్లీ నములుతున్నాడు.

"ఇంతవరకా, నేను భోజనం చేసాను'భాగ్యం చెప్పింది.

"అయ్యో 'ఆలస్యమయిపోయానే...' నొచ్చుకొని దిగులుపడ్డాడు నారాయణ్రావు.

అంతటి అలసటలో కూడా శ్రీనుకి ఎక్కడలేని సత్తువా వచ్చేసింది. ఎలా ఉన్నవాడల్లా అలాగే పరిగెత్తాడు. అందిన దుస్తులు చేతుల్లోనే వున్నాయి.నారాయణ్రావు శ్రీనుని ఆపలేదు. ఆతరువాత శ్రీనూ అగుపించలే అదరి దాపుల్లో కూడా.

నారాయణ్రావు తన నల్లటి తోలు బెల్టు తీసి చేతులు నొప్పెట్టేదాకా, నగ్నంగా వున్న భాగ్యం శరీరమంతటి తట్లుతట్లుగా అంగుళం కాలీ లేకుండా కొట్టాడు. ఇంకా కోపం చల్లారక ఎదురుగా వుంటే కుర్చీతీసి భాగ్యం మీద ఎత్తేసాడు. దానికాళ్ళు విరిగిపోతే అకర్రని తీసి చితక్కొట్టేసాడు. రక్తాలు చిమ్మి చిమ్మి శరీరం ఊటబావయిపోయింది.

తెలివి లేని స్థితిలో ఆసుపత్రిలో చేర్చి భాగ్యాన్ని ఇరవైముప్పైరోజులు అక్కడే వుంచాల్సివచ్చింది. అప్పుడే ఆ దెబ్బలకు అంతా గర్భం పోతుందను కున్నారు. కాని గట్టి పిండమయి బిడ్డ బతికుందని అంతా ఆశ్చర్యపోయారు. ఆ పిండం కరిగి పోయినా బాగున్ను అనుకుంది భాగ్యం. మధ్యలో వచ్చిందేదో మధ్యలోనే పోతేనే మంచిదని తలపోసింది. కాని తలచినట్టు జరుగలేదు.

భాగ్యం పార్వతమ్మ సాయంతో తలిదండ్రుల సహకారంతో మందులూ మాకులూ వాడి మామూలు మనిషయింది.

రహస్యంగా వుంచిన విషయాలన్ని విస్తృతంగా వెలుగులోకి రావడంతో భాగ్యంకు మరి బతకాలనిపించలేదు. భాగ్యం చావాలని చేసుకున్న ప్రయత్నాలన్నీ అర్థంలేనివని, అపురూపమైన బంధమేదో పేగుతో ముడివేసుకొని ఇంత కాలం జీవితాన్ని నిలబెట్టిందని, అలా నిలబెట్టిందాన్నే నాశనం చేయడం పాపమని, చెయ్యని పాపానికి శిక్ష వేయడం నేరమని, జన్మ ఇవ్వకే పోవాలిగాని ఇచ్చాక సగం ప్రాణంతో

సముద్రంలోకి దూకేసాక చాలా సేపటికి ఒడ్డు దొరికింది. అలసిపోయిన ఇద్దరూ సేదతీరుతూ ...
మత్తుగా మూసి వుంచిన కళ్ళు తెరిస్తే ...

చివరికి ఆపలావ్ పొట్లాం జానకి తింది. తిందేగాని ఆ పిల్లకు వాంతొచ్చినట్టుగ వుంది. సారా వాసన పడకుండావుంది.

రోజుల లీవూ గడచిపోయి, నారాయణ్రావు మళ్ళిడ్యూటికి అంటే లైన్ కని బయలుదేరాడు. అటు నారాయణ్రావు వెళ్ళడంతోనే జానకిని సినిమాకు పంపించేసి శ్రీను భాగ్యం ఇంట్లో దూరాడు. నెల రోజుల ఎడబాటు భరించలేక పిచ్చిమీదున్నాడేమో తలుపులకుండే బోల్టు వెయ్యకుండానే గడియతగిలించి భాగ్యాన్ని చుట్టేసాడు. తన రెండు చేతుల్తో బలంగా భాగ్యాన్ని ఎత్తుకొని గిరగిరా తిప్పాడు. కళ్ళు తిరుగుతున్నాయన్నా భాగ్యం మాట వినిపించుకొనే స్థితిలో లేడు. శ్రీను. అలాగే తెచ్చి మంచం మీద చిన్నపిల్లను పడేసి నట్టుపడేసి మరీ తనూ వాలిపోయాడు. బొడ్డు మీద నోరు ఆనించి, బూరవూది నట్టు వూదాడు. అలా ఊదుతూనే వున్నాడు. భాగ్యం కితకితలతో తట్టుకోలేక పగలబడి నవ్వుతోంది. విరగబడినవ్వుతోంది.

వాళ్ళిద్దరూ ఆసమయంలో దేన్నీ పట్టించుకున్నట్టులేరు. ప్రపంచం మొత్తం పిలిచినా కూడా! అందుకే అప్పుడు పేరుపెట్టి పిలుస్తున్నా వినిపించలేదు.

సముద్రంలోకి దూకేసాక చాలా సేపటికి ఒడ్డు దొరికింది.

అలసిపోయిన ఇద్దరూ సేదతీరుతూ...

మత్తుగా మూసి వుంచిన కళ్ళు తెరిస్తే...

ఎదరుగా నారాయణ్రావ్!

తీసిపారెయ్యడం సబబు కాదని హితవు కోరినవారు అన్నారు.

డాక్టర్లు చెప్పిన మరో ముఖ్యవిషయం ఏవిటంటే ' బిడ్డను తీసి పారెయ్యడంతో బిడ్డేకాదు, గడువు దాటి పోయింది కాబట్టి అబార్షన్ కుదరదు, ఆపరేషన్ చేస్తే తల్లికి గ్యారంటీ లేదు' అని చెప్పడంతో - దాంతో బిడ్డ పుట్టుక అవసరం తప్పనిసరి అయిపోయింది.

భాగ్యం చేసుకున్న పాపాలకే శిక్ష అనుభవిస్తుందను కున్నాడు నారాయణ్రావు. అవే ఆమెనిలా చుట్టుముట్టాయనుకున్నాడు. అయితే భాగ్యం మీద జాలి కలిగింది. తప్పితే భాగ్యం జీవితం పట్టాలు తప్పడానికి తన పాత్ర ఎంతో ఆచీతూచుకోలేదు. అయినా ఇప్పుడు నారాయణ్రావు ఆవేశం చల్లారి, భాగ్యం ఆరోగ్యం కుదిటపడి ఇప్పుడు మళ్ళీ మామూలు వాతావరణం నెలకుంటూ వుంది.

కాలం మళ్ళీ మాములయింది.

ఇన్నాళ్లూ అంటే ఆసుపత్రిలో వున్నన్నాళ్లూ కనపడని శ్రీను మళ్ళీ ఏమీ జరగనట్టే జరిగి దగ్గర కొచ్చాడు. భాగ్యం దూరంగా వుందామంది. జరిగిపోయిందేదో జరిగి పోయిందంది. ఇంకే సంబంధాలు వద్దంది.

శ్రీను ఒప్పుకోలేదు.

"నా అవసరం తీరిపోయింది?" అడిగాడు

భాగ్యానిది నోరు రాని స్థితి

"నీకు పిల్లల కోసం కావల్సొచ్చానా? ఆ పనేదో నెరవేరిపోయింది కాబట్టి, అడిగితే నేరస్తుడినా?" భాగ్యాన్ని గద్దించాడు శ్రీను.

"అది కాదు...." అందే గాని భాగ్యం ఇదీ అనిచెప్పలేకపోయింది.

"ఏదికాదు... ఆకడుపులో బిడ్డ నీది కాదు కదా... తీసెయ్యి... నన్ను తీసేసినట్టే తీసెయ్యి..." రాని పొట్టని రెండు చేతుల్తో లాగాడు శ్రీను.

భాగ్యం చేతులెత్తి మొక్కబోయింది.

"ఒక్కసారి చేసిన తప్పుతప్పే, పదిసార్లు చేసినా తప్పు తప్పే..." పదిసార్లు చెప్పినా శ్రీనుది అదేమాట, వందసార్లు చెప్పినా అదేమాట.

శ్రీను రద్ధాంతం చేస్తుంటే, రచ్చకీడ్చబోతూవుంటే వాదించలేక మరో దిక్కులేక మౌనంగానే అంగీకరించింది. అవునన్నా కాదన్నా అలానే మొండిపట్టుపట్టి, భాగ్యాన్ని ఆక్రమించేవాడు.

మళ్ళీ ఒకరోజు... నెల తిరక్కుండానే.. నారాయణ్రావు కళ్లముందు భాగ్యం, శ్రీనుల... అదే దృశ్యం!

నారాయణ్రావు మొదటి దఫాలా భాగ్యాన్ని కొట్టలేదు. తిట్టలేదు. పొమ్మనలేదు. కిమ్మనలేదు. ఏమీ అనలేదు. ఏమీ జరుగనట్టే వున్నాడు. ఎంతో జరుగుతుందని అనుకున్న భాగ్యానికి కళ్ళముందు జరుగుతున్నది చూస్తూంటే తనని తనే నమ్మలేకపోయింది. నారాయణ్రావులో వచ్చిన మార్పు నిశ్శబ్దంగా గొంతునులిమిపెడుతున్నంత బాధగా తోచినా అది అప్పుడప్పుడే! అయినా సరే భాగ్యం శ్రీనుతో కలసి కంటపడకుండా వుండేందుకే జాగ్రత్తలూ తీసుకుంది.

భాగ్యానికి భర్త దెబ్బలు తెరిపిచ్చి, ఊపిరి తీసుకొనే లోపే ఊహించిన పరిణామాలు జరిగాయి.

శ్రీను భాగ్యం శరీరం పొందాక, అనుభవించాక అక్కడితో ఆగలేదు.

భాగ్యం నెలల మనిషయి ఇష్టం వున్నా లేకపోయినా సరే శ్రీను బలవంతం చేసేవాడు. తన కోర్కె తీర్చుకొనేవాడు. తీర్చుకోనివ్వని పక్షంలో ఒక కొత్త థియరీ నేర్చుకున్నాడు. అది తరతరాల నుండీ వస్తున్న పాత థియరీయే!

శ్రీను వాళ్ళమ్మను సాధించుకోవడానికి వాళ్ళనాన్న వేసిన అస్త్రం... సంధించిన శస్త్రం... అనేక ఇళ్ళల్లో కూడా అదే బాణం, రామునికొకటే బాణం అన్నట్టు... మగవాడికి ఒకటే బాణం.

మదించిన ఏనుగుకు అంకుశం గుచ్చినట్టు....

దెబ్బకు దెయ్యం జడిసి కాళ్ళమీద పడినట్టు

తంతే లొంగుతారు! అమ్మని నాన్న అలాగే లొంగతీసుకోవడం శ్రీనుకు తెలుసు. అలాగే ఏ రెండొందలో పెట్టి ఇద్దరమని చెప్పి ఆ రాత్రి నలుగురూ కలసి సామూహికంగా సంయోగం జరపబోతే-ఒప్పుకోని దాని ఎముకులు గుల్లచేసినట్టు గుద్దిన గుద్దులు భరించిన వాళ్ళని ప్రత్యక్షించి చూసాడు. ఆ అనుభవాల సారాంశం పిండుకున్నాడు శ్రీను.

అదేమందు!

అదే మంత్రం!

అన్నిటికీ ఒక్కటే మంత్రందండం!

'నేనెలా చెయ్యలేను శ్రీను' బతిమలాడుకుంది భాగ్యం. అంతలోనే భయంతో వెన్నెముక వణికింది.

శ్రీను చెప్పినట్టేగానే,వాడు విప్పిన షర్టు తొడుక్కుంది. ఫేంటుకూడా! పొట్టపట్టదు. చూసి ఆపుకోలేనంతగా నవ్వాడు శ్రీను.

"నువ్వెందులోనయినా బాగుంటావ్" సర్టిఫికెట్ ఇచ్చాడు.

అక్కడితో ఆగితే బాగున్ను. కాని ఏవేవో పుస్తకాల్ని తెచ్చి అందులోని బొమ్మల్ని చూపించేవాడు భాగ్యానికి. వివిధ బొమ్మల్ని చూపించి ఆయాభంగిమల్లో వుండమనేవాడు. ఇదేమిటి అంటే 'యాంగిల్స్' అనేవాడు శ్రీను.

గర్భం దాల్చకముందు, గర్భం దాల్చిన మొదటిదినాల్లో నయితే భాగ్యం అందుకు అంగీకరించి ఆయాకోణాల్లో నిల్చొనేది. వాళ్ళాయునున్ని మెచ్చుకొని శ్రీను ఆయాకోణాల్లోనే అంతకులేని లోకాల్ని దాటేవాడు. కొత్తగా కష్టంగా వున్న భాగ్యానికి రతి సుఖం సరికొత్తగా వుండేది. అంచేత కాదనేది కాదు.

భాగ్యం తనకు తెలియకుండానే తన శరీరం మీద అధికారం శ్రీనుకి అప్పగించినట్లయింది. అప్పగించడం కాదు, శ్రీనే వశం చేసుకున్నాడు.

మరిప్పుడు వట్టి మనిషి కాకపోవడంతో భాగ్యంకు అలా వుండడం, చేయడం కష్టమనిపించేది. శరీరం సహకరించేది కాదు. పైగా ప్రాణ సంకటంగా తోస్తూ భయం వేసేది. అందుకనే ఈ సమయంలో వద్దంది. శ్రీనుకు అర్థమయ్యేది కాదు, దూకుడే దూకుడు.

"నా వల్ల కాదు, వదులు" భాగ్యం చెప్పింది.

"పరవాలేదు, కొత్తగా మాట్లాడతావేటి?" శ్రీను తనని చూస్తూ అలా మాట్లాడేసరికి భాగ్యం నోరు రాక తన పొట్టవేపు చూసుకొనేది. శ్రీను అది గ్రహించి 'ఈ ముల్లిముండ కోసమనేనే హం....' అని నవ్వి ముద్దులు పెట్టేవాడు - పొట్ట చెక్కలయ్యేట్టు మరీ.....ఎంతో ప్రేమన్నట్టు అనిపించినా' భాగ్యానికి ఆ అభిప్రాయం శ్రీను ప్రవర్తన వల్ల స్థిరంగా నిలువ నిచ్చేది కాదు.

"ఇదీ ఎక్సరసైజే......వంటికి మంచిది" శ్రీనుమాట.

"ఇప్పుడుకాదు..." భాగ్యం బదులు.

శ్రీను చేస్తున్న బలత్కారం భరించలేని భాగ్యం కసురుకొనేది. కోపగించుకుంది. దాంతో శ్రీను తిరిగి కసిరాడు. సరదాగా సరసంగా వుంటూనే భాగ్యం విననప్పుడు చిలిపిగా ప్రవర్తిస్తూనే చిటుకూ పటుకూ మని కొట్టేవాడు. దెబ్బ చుర్రుమనేది. అసలా దెబ్బలు వేళాకోళంగా కొట్టినట్టు వున్నా వాటిని కాస్తున్న భాగ్యానికి అలాతోచేది కాదు. ఆ తిట్లు కూడా ముద్దు ముద్దు హద్దులు దాటి, మురిపాలు దాటి, మొరటుగా - అంగీకరించనపుడు మరింత మోటుగా వుండేవి.

భాగ్యానికి పెరుగుతున్న నీరసం, అనాసక్తతకు దారిచూపి ఆసక్తి చూపకపోతే అందులో పాల్గొనడానికి సిద్ధంకాకపోతే, సీరియస్ అయిపోయేవాడు. నిమిరిన చేతుల్తోనే చెంపలు చెల్లుమని పించేవాడు.

"శ్రీనూ.....'ఫో.....ఫో" భాగ్యానికి వచ్చినమాట అదొక్కటే.

"ఎక్కడికి పోనూ? నీ కడుపులోనే వున్నాగా!....చూడు నాకు నేనే ఎలాగ ముద్దుపెట్టుకుంటానో.." అన్చెప్పి శ్రీను మళ్ళీ భాగ్యం పొట్ట మీద ముద్దులు కురిపించి, మురిపాల పేర్లతో బుజ్జగించి కావల్సింది సాధించాక కనుమరుగయేవాడు.

భాగ్యం తనకు తెలియకుండానే తన శరీరం మీద అధికారం శ్రీనుకి అప్పగించినట్లయింది. అప్పగించడం కాదు, శ్రీనే వశం చేసుకున్నాడు.

నారాయణ్రావే కాదు అప్పుడప్పుడూ శ్రీనొచ్చినా అంతే భయం!

ఆ భయమే మరింత లొంగేటట్టుగా భాగ్యాన్ని వంచింది. వంచించింది.

రోజులెన్ని గడిచిపోయినా పిల్లది కడుపుల పడ్డ ఏడాది భాగ్యం పుట్టిన రోజు మరిచి పోలేనిది. మాయనిది. అంతటి మచ్చ. గాయం కూడా!

భాగ్యం పుట్టిన్రోజు కనిచెప్పి శ్రీను చిన్న బ్రీఫ్‌కేస్‌తో వచ్చాడా రాత్రి. నారాయణ్రావు లేడు. జానకి కూడా వాళ్ళ అమ్మా అయ్యకు బాగులేదని వెళ్ళింది.

శ్రీను చెప్పిందాక భాగ్యానికి తన పుట్టిన రోజు గుర్తుకురాలేదు. నారాయణ్రావుకి కూడా గుర్తులేదు. ఆ ఏడాదే కాదు ఎప్పుడు కూడా అంతే. కనుక ఆయన సెలవు పెట్టలేదు. వుండలేదు.

భాగ్యానికి పుట్టినరోజులు జరిపే తలిదండ్రులు రానురాను జరుపుకోవడం మానుకున్నారు. కనుక ఎవ్వరికీ గుర్తులేక, తనకీ గుర్తులేక పోయినా శ్రీనుకు గుర్తున్నందుకు గుర్తించినందుకు నిట్టూర్పుతోనే తృప్తి పడింది.

"ఏమిటి తెచ్చానో చెప్పుకో.." శ్రీను బ్రీఫ్ తెరవకుండానే అడిగాడు.

"ఏమోఁ...." ఊహించలేకపోయింది భాగ్యం.

"ట్రై చెయ్యి" అన్నాడు శ్రీను.

ఎంత ఆలోచించినా భాగ్యానికి తట్టలేదు. 'నీకు తట్టదు కూడా' ...శ్రీను తేల్చేసి బ్రీఫ్ తెరిచాడు. వి. సి. పి. దిమ్మ! ఓస్ అంతేనా అన్నట్టుగా చూసింది భాగ్యం. ఆ చూపుల్ని శ్రీను పట్టించుకోలేదు.

వి. సి. పికి టీవీకి కనెక్షను ఇచ్చాడు. స్విచ్ ఆన్ చేసి కేసెట్ పెట్టాడు. ప్లే నొక్కాడు. ఏదో పాత సినిమా..విష్ణుమూర్తి అంతారంలో ఎన్టీరామారావు...

ఏదో పాత సినిమా ఏమో అనుకొని భాగ్యం ఎదురుగావున్న కుర్చీలో కూర్చుంది. శ్రీను స్టాప్ బటన్ నొక్కి ఎఫ్ఎఫ్ నొక్కాడు. కేసెట్ తిరిగింది. మళ్ళీ ఆపాడు. మచ్చలు మచ్చలుగా టీవీ తెరంతా అలికేసినట్టుగా అస్పష్టంగా వుంది.

శ్రీను గర్వంగా చూస్తూ భాగ్యం పక్కనే వచ్చినిలబడ్డాడు.

ఇంతలో బుల్లి తెరమీద దృశ్యానికి స్పష్టత వచ్చింది. మానవాకారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్వేచ్ఛగా విచ్చలవిడిగా తిరుగాడుతున్నాయి. రెండుక్షణాల్లో మారుతున్న దృశ్యాల్ని గమనించే సరికి భాగ్యం తులుక్కుపడింది. ఇంతకు ముందెన్నడూ చూడని దృశ్యాలు.

భాగ్యం తేరుకొని తెరిపార చూసింది. తన ఒంటిని తనే చిక్కుకుంది. నిజమే! ఇలా కూడా వుంటాయా అనిపించే రీతిలో...

టీవీ నిండుగా నగ్నంగా వున్న ఆడామగా...ఒకరి అవయవాల్ని మరొకరు ప్రేరేపించుకుంటూ.....చుంబించుకుంటూ...రతి కార్య క్రమం!

తల ఒక్కసారి తిప్పిచూసింది భాగ్యం. అప్పటికే శ్రీను ఎప్పుడు తలుపులు బిగించి వచ్చాడో, వంటి మీద ఒక్క నూలి పోగూలేదు. అలాగే నిలబడి ఆ దృశ్యంకేసి కళ్ళార్పకుండా చూస్తున్నాడు. భాగ్యంకు అసహ్యం వేసేదేమో కాని చూపుని తిరిగి తెరకేసి తిప్పింది. శరీరంలో ఏదో అలజడి మొదలయి అనుకోకుండానే భాగ్యం కళ్ళూ నిలిచి పోయాయి. అది శరీరం కుండే లక్షణమో....బలహీనతో.. బోధపడ డానికి అది సమయం కాకుండా వుంది.

తెరమీద దృశ్యమే జరిగి తీరాలన్న పట్టుదలతో గాఢమైన క్రూరమైన వాంఛతో వున్న శ్రీను తగ్గలేదు. భాగ్యం ఒప్పలేదు. శ్రీను భాగ్యాన్ని జుట్టుపట్టుకులాగాడు. ఆమె లొంగలేదు. శ్రీను మరింత కోపంతో జుట్టుపట్టుకొనే బాత్‌రూమ్‌లోంచి టీవీ వున్న గదిలోకి ఈడ్చుకు వచ్చాడు.

భాగ్యం మళ్ళీ ఊసుకుంటూ బాత్‌రూమ్‌లోకి పరుగుతీసింది.

శ్రీను ఈదఫా జుత్తు వదలకుండానే వెన్నుమీద గుద్దుతూ మళ్ళీ గదిలోకి ఈడ్చుకొచ్చాడు.



భాగ్యం చేతులెత్తి దండం పెట్టింది. పాదాలమీద పడింది. గతంలో నారాయణ్రావుతో దెబ్బలు తింటున్నప్పుడు ఎన్ని ప్రయత్నాలు చేసి భయపడుతూనే బయటపడాలని చూసిందో - ఇప్పుడూ అలాగే అన్ని ప్రయత్నాలు చేసింది. కాని ఫలితం లేకపోతూనే వున్నది. భాగ్యం భరించలేకపోతున్నది. దానికితోడు వికృతంగా జుగుప్సను కలిగిస్తూ కదలాడు తున్న తెరమీది ఆకారాలు...ఇంక ఆగలేదు...శ్రీనుని బలంగా వెనక్కి తోసి వి. సీ. పి దిమ్మను అందుకొంది భాగ్యం. అఁ..' శ్రీను గొంతుదాటి మాటరాకముందే ఆ విసీపి దిమ్మను నేలకేసి కొట్టింది...దాంతో తెరమీది దృశ్యం భయపడి పారిపోయినట్టు మాయమై పోయింది. ఇల్లంతా పగిలిన వీసీపి ముక్కలు పరచుకున్నాయి. శ్రీనుకు జరుగుతున్నదేమిటో అర్థం కాలేదు. పిచ్చిగా చెలరేగిపోతున్న వికారం దిగిపోయింది. కోరిక చప్పుమని చల్లారిపోయింది. కాని అహానికి అగ్గంటుకుంది.

దాంతో శ్రీను "లంజాకూతురుకనా...నీయమ్మ..ఎంత పని చేసావే లన్జీ.."బూతులు అందుకున్నాడు. చేతిలోకి ఏదీ అందుకోకుండానే భాగ్యం మీద దాడి చేసాడు. బలంగా పిడికిళ్ళు బిగించాడు. భాగ్యం ముఖం మీద మూతిమీద గుద్దాడు. ఆగుద్దులకు భాగ్యం ముందరి పళ్ళన్నీ కదలిపోయాయి. ఒక పన్ను విరిగిపోయింది కూడా. రక్తం బొటబొట మని కన్నీళ్ళలాగే!

భాగ్యం చేసిన రొద..ఏడుపుకు భయపడి శ్రీను గబగబా బట్టలు తొడుక్కొని పారిపోయాడు.

రైల్వే క్వార్టర్సులో ఇరుగూ పొరుగూ గనుక, అది అర్ధరాత్రి అయ్యిందిగనుక, మొగుడూ పెళ్ళాల మధ్య ఎప్పుడూ వున్న గొడవ గనుక...అదే అయ్యుంటుదని తలచారు గనుక - తెలివి వచ్చి లేచిన వాళ్ళు బద్ధకించారు.

పార్వతమ్మ లేదు. వెంకాయమ్మ వచ్చింది. భాగ్యాన్ని చూసి "ఏటమ్మా నారాయణ్రావు కింత వయసొచ్చినా ఇదేం పోగాలం" అని

తిట్టుకుంది. తరువాత ఆమె చిట్లిన పెదాలమీద పంచదారపోసి అద్దింది. రక్తం వస్తునే వున్నది. పళ్ళు సలుపుతున్నాయి. భాగ్యం లేచి వెళ్ళి నోరు కడుక్కుంది. కాని అప్పటికే తను అసహ్యంగా భావించిందేదో దాన్ని రక్తమే కడిగేసింది.

ఆరాత్రి ఎలా తెల్లవారినా భాగ్యం ముఖం వాసిపోయింది. బయటకు రాడానికే భయపడింది. ఒకరోజు అలానే గడిచిపోయింది. అయితే మంచినీళ్ళు కూడా మింగని స్థితిలో వుండడంతో తిండీ తిప్పలు లేని భాగ్యాన్ని పార్వతమ్మ, వెంకాయమ్మ ఆసుపత్రిలో చేర్చారు.

> "నాకు తెలుసు" నారాయణ్రావు అలా అనడంతో గబుక్కున తలెత్తిన పార్వతమ్మ నారాయణ్రావు కళ్ళలోకి చూసింది. తప్పు చేసినట్టు తలదించుకుంది.

భాగ్యం పార్వతమ్మ అడిగిన మీదట శ్రీనుతో జరిగిన విషయాన్ని చెప్పింది. ఏడ్చింది.

'ఇంటికి రానీ చెప్పుతానాడిపని' గట్టిగా అనుకుంది పార్వతమ్మ. కాని శ్రీను ఆవారం రోజులు ఇల్లుపట్టలేదు.

భాగ్యం దాదాపు నెలరోజులు ఆసుపత్రిలోనే వుండవలసి వచ్చింది. ఆమధ్య కాలంలోనే నారాయణ్రావు వచ్చాడు. ఆసుపత్రికెళ్ళి భాగ్యాన్ని చూసాడు. బాత్‌రూమ్‌లో కాలుజారిపడి పోయినట్టు, ఆపడడంలో నీళ్ళకుండీకి ముఖం గుద్దుకున్నట్టు నారాయణ్రావు తెలుసుకున్నాడు. వారం రోజులు సెలవు పెట్టి వున్నాడు. ఆయారోజుల్లో శ్రీనుకూడా ఆసుపత్రికి వెలుతూండేవాడు. ఆసుపత్రిలోవున్న ముప్పై రోజుల్లో ఇరవైరోజులకు పైగా ద్రవ పదార్థమే భాగ్యానికి ఆహారం. జీవం. పళ్ళన్నీ బాగా దెబ్బతిని పోవడం నమల్లేని కారణంగా...మింగడమే కష్టమయిపోతే మొదట్లో సెలేన్సు ఎక్కించినా తరువాత ద్రవపదార్థాలిమ్మన్నారు. అందుకు అవసరమైన పళ్ళుజాతులన్నీ టౌనంతా గాలించి తెచ్చి ఇచ్చేవాడు శ్రీను.

శ్రీను అలా తెచ్చినవి పిండి ఇచ్చినపుడు భాగ్యం తాగేదికాదు. నారాయణ్రావు అది చూసి "అన్నమూ తినకపోతే...ఒక రొట్టీ వీలు కాదంటే...కనీసం పళ్ళరసం తాగకపోతే ఎలాగ" అనేవాడు.

"వట్టి మనిషి కాదు, నెలలు నిండుతున్నాయి. ఇంక అదృష్టం..కడుపులో బిడ్డకు ఏ దెబ్బా తగల్లేదు. తినకపోతే బతికిన బిడ్డ...ఆకడుపులోని బిడ్డ కడుపులోనే ఇదవుతుంది...ఆపాపం చుట్టుకో కూడదు..." పక్క బెడ్‌లోని ముసలిపేషెంటు అనేది.

"ముందు జాగ్రత్త వుండాలి, ఇప్పుడు కాదంటే ఎలాగ..." నర్సులు కోపగించుకొంటూ చెప్పేవారు.

ఇందరు..ఇన్ని పరిస్థితుల మధ్య...భాగ్యం ఇచ్చిన ఆహారమేదో మింగేది. ఆ అవకాశమే చూస్తున్నట్టు శ్రీను గ్లాసుని అందించేవాడు. భాగ్యం కళ్ళంట నీళ్ళు తిప్పుకొని మింగేది.

నెలరోజులూ అలాగే గడిచాయి. ఆఖరిరోజు ఇంటికొచ్చేస్తామనగా వెంకాయమ్మ నారాయణ్రావుని ఆసుపత్రి ఆవరణలోనే అడిగింది.

"ఇదేం బాగులేదు బాబు...."

అర్థంకాని నారాయణ్రావు అయోమయంగా చూసాడు.

"మీరు మగపుట్టుకే పుట్టారు. మాకంటే ఒకపువ్వు ఎక్కువేసి పుట్టారు. కాని అలగ ఆడదాన్ని కొట్టకూడదు. దానికితోడు కళ్ళుతెరవని జీవొకటి కడుపులో వున్నాది. అది నేలన పడి కళ్ళు తెరిస్తే ఇంకన్ని ఎలాగా బాధలే..." వెంకాయమ్మ ఇంకెప్పుడు జరగకూడదనే చెప్తోంది.

"నేనేం చేసాను?" నారాయణ్రావుకు ఏదో అర్థమవుతూ వున్నా అడిగాడు.

"ఇంకేం చెయ్యాలి బాబూ, పళ్ళు ఇరిచెస్తావా? ఆ రాత్రొచ్చి నిన్ను అడుగుదామంటే పారి పోనావు.." వెంకాయమ్మ ఇంకా మాట్లాడేదే, కాని అప్పుడే పార్వతమ్మ రావడం జరిగింది ఏిండంతో తొట్రుపడింది.

"ఇక్కడున్నావా వెంకాయమ్మా భాగ్యం పిలుస్తంది...ముందెళ్ళిరా .." పార్వతమ్మ గాబరా పెడితే వెంకాయమ్మ గబగబా తిరిగి లోపలికి నడిచింది. పార్వతమ్మ కూడా అనుసరించబోయింది.

"పార్వతమ్మా.....నిన్నే" నారాయణ్రావు పిలుపుతో ఆగింది.

"ఏం బాబు...మళ్ళొస్తాను బాబూ...." అందేగాని పార్వతమ్మ ముందుకి వెనక్కీ కదలలేక పోయింది. ఆమె అవస్థని నారాయణ్రావు గమనించాడు. దాంతో అనుమానానికి మరింత బలమొచ్చింది.

"వెళ్ళాగాని రా‹..." నారాయణ్రావు మళ్ళీ అన్నాడు.

బిత్తర చూపుల్తో....బయటపడకుండా వుండడానికి ప్రయత్నిస్తూ పార్వతమ్మ తలెత్తకుండానే నారాయణ్రావు ముందు ఆగింది.

"ఏం జరిగింది? అసలేం జరిగిందో చెప్పు?"

"నాకు తెలీదు.."

"నాకు తెలుసు" నారాయణ్రావు అలా అనడంతో గబుక్కున తలెత్తిన పార్వతమ్మ నారాయణ్రావు కళ్ళలోకి చూసింది. తప్పు చేసినట్టు తలదించుకుంది.

"నువ్వు చెప్తావా?నేను చెప్పనా?..."

నారాయణ్రావు మాటలకు పార్వతమ్మ ఏమీ మాటాడలేకపోతోంది.

"బాత్‌రూమ్‌లో జారి పడలేదు. మూతిపళ్ళు విరిచేసారు...డాక్టరు చెప్పాడులే. చేసిందెవరో నాకు తెలుసు..." నారాయణ్రావు మాటలకి ఒక్క మాట బదులివ్వలేక పోయింది.

"శ్రీను జాగ్రత్త.." అనేసి నారాయణ్రావు వెళ్ళిపోయాడు.

పార్వతమ్మకు ఒళ్ళంతా చెమట పట్టింది. భాగ్యాన్ని కలువకుండానే ఇంటికి పరుగుతీసింది. శ్రీనుని చేతితో కొట్టి కొట్టి విసిగిపోయింది. తన చేతులే పీకి పోయాయి. వాడికి చీమ కుట్టిన చలనం లేదు.'పిచ్చెక్కిందేమిటి" అని తిరిగి తల్లిని అడిగాడు.

"పిచ్చెక్కిందిరా, నిన్ను కాయడం వల్ల. నువ్వు పుట్టగానే ఇలాంటివాడివని తెలిస్తే దరిద్రపు కొడుకు పుట్టలేదని గొంతు నులిమి చంపేద్దును.." పార్వతమ్మకు దుఃఖం ముంచుకొస్తోంది.

"పోని ఇప్పుడు చంపెయ్యి" వ్యంగ్యంగా అన్నాడు శ్రీను.

"...నేను చంపక్కర్లేదురా...ఆ బాధ మాకక్కర్లేదు...ఆపనేదో భాగ్యం మొగుడు నారాయణ్రావే చేస్తామన్నాడు. నువ్వు చేస్తున్నపనులకి.." పార్వతమ్మ గొంతులో కసి పేరుకుపోయివుంది.

"వాడేనా? వాడితో ఎవరున్నారా?" శ్రీను గొంతులో పొగరుంది.

"ఏమో...ఆల పెళ్ళాల్ని నువ్వు తంతే తప్పులేదు. అలు నిన్ను తంతే తప్పా"...ప్రశ్నించింది పార్వతమ్మ.

"అయితేమిటి చంపుతారా? చంపనీ....నన్ను చంపితే, భాగ్యం వాడ్ని చంపుతుంది...."ధైర్యంగా నమ్మకంగా అన్నాడు శ్రీను.

పార్వతమ్మకు మరింక మాట్లాడబుద్ధి వెయ్యలేదు. కన్నందుకు రెండక్షింతాలు పడేద్దామని ప్రయత్నం చేస్తూనే వున్నది. కాని ఉద్యోగం

సద్యోగంలేని, చదువూ సంధ్యాలేని వాడికి..వాడినడవడికి...వచ్చిన సంబంధాలు వడివడిగా పారిపోతున్నాయి.

ఈ విషయాలన్నీ మరుసటి దినమే తనలో ఇముడ్చుకోలేక పార్వతమ్మ భాగ్యంతో చెప్పింది.

భాగ్యం పెదవి విప్పలేకపోయింది.

అవాళే, డిశ్చార్జి చేస్తున్నప్పటికీ తెలిసీ కూడా నారాయణ్రావు అందుకే రాలేదేమోనని అనుమానించి, నిర్ధారించుకుంది. సమయానికి భాగ్యం చేతిలో డబ్బులు లేకపోయాయి. డిశ్చార్జి కావలసిందల్లా ఒకరోజు ఆలస్యమయిపోయింది. జానకి వెళ్ళి, భాగ్యం తలిదండ్రులకు కబురు పంపాక వాళ్ళు రావడం డబ్బుకట్టడం జరిగితేనే, డిశ్చార్జికి అవకాశం కలిగింది.

భాగ్యం చేస్తున్న పనులకు అసహ్యము, నారాయణ్రావు అలా పెళ్ళాన్నివదిలి వెళ్ళినందుకు కోపమూ కలిగాయామె తలిదండ్రులకు. జానకి ద్వారా అలకి ఆ విషయాలు దృఢపడ్డాయి. అంతకు ముందే భాగ్యం ఎవరితోనో సంబంధం పెట్టుకుందన్న విషయం గాలిలా వచ్చినా ధుమారమై అంతటా చుట్టేసింది. ఊరిలో తలతీసేసి నట్టుగా వుంది. అందుకనే మొక్కుబడిగా వచ్చివెళ్ళారే గాని మనసువిప్పి మాటాడలేదు.

భాగ్యం తల్లిని అదే విషయం అడిగింది.

"ఛీ...నీదొక బతుకే...ఊరికుక్క కన్నా అధ్వాన్నమైపోయింది..." ఒక్కగా నొక్క కూతుర్ని....ఎంతకాలంగానో ఎదురుచూసి కాసిన కూతుర్ని....పెంచిపెద్ద చేసి ప్రేమతో రేయింబవళ్ళూ తలచుకునే కూతుర్ని - కనబడితే అక్కున చేర్చుకొని అమ్మా' అని తనే కూతరయిపోయిన ఆ తల్లి ఛీదరించుకుంది. అసహ్యించుకుంది. తండ్రయితే మాటాడలేదు. ముఖం చూడలేదు. అవసరమైన డబ్బు మాత్రం ఇచ్చి అప్పు చెల్లించేసినట్టు పనయిపోయినట్టూ వెళ్ళిపోయాడు. అతని వెంటే భాగ్యం తల్లికూడా. కనీసం 'వెళ్తున్నామమ్మా' అని కూడా ఎవ్వరూ చెప్పకుండానే వెళ్ళిపోయారు.

భాగ్యంకు బాధ కలుగలేదు. ఏడుపు రాలేదు. అనేకానుభవాలకు కన్నీళ్లింకి పోయాయి. మనసు మూగబోయింది. అందుకే అందరిలాగే తన తలిదండ్రులూ ప్రవర్తించార్లనుకుంది భాగ్యం. అంతకు మించి మరేమీ ఆలోచించలేదు. ఇప్పటికే జీవితం తన అధీనం లేనట్టూ...ఇంతకాలం నిర్ధారించిన వాళ్ళెవరెవరో వదిలేసి పోయినట్టు అనుకుంది. అనాధను అనుకోలేదు. కడుపులో బిడ్డకు నెలలు నిండిపోవడం ఆక్షణాల కోసమే ఎదురు చూస్తున్నట్టే వుండేది.

పురిటికి కన్నవారు వచ్చి తీసుకు వెళ్ళలేదు. అంతకు మును పెప్పుడో నెలతప్పినందుకు ప్రపంచం బద్దలయినంత హడావిడీ సందడీ జరిగింది. మరికాన్పుకి ఇంకెన్ని ఏర్పాట్లో అనుకుంది. కాని ఇప్పుడవేవి జరుగలేదు. సుంయ్‌మని అట్టులేదు. వంటలూ మిఠాయిలూ..సీమంతమూ .... ఏవీలేవు.

నెలతప్పిన మొదట్లో చాటుగా చింతకాయలు తెచ్చిచ్చినట్టుగానే శ్రీను ఏవేవో తినడానికని తెచ్చి ఇచ్చేవాడు. 'ఏమేమిటి ఇష్టం?' అని అడిగేవాడు. అలాంటి సందర్భాలలోనే దగ్గరకు రాకపోయినా శ్రీను నీడలా వున్నాడని అనిపించేది. అంత వరకూ వున్న కోపం ఏటో ఎగిరి పోయేది.

భాగ్యంకు బాధ కలుగలేదు. ఏడుపు రాలేదు. అనేకానుభవాలకు కన్నీళ్ళింకిపోయాయి. మనసు మూగబోయింది.

పార్వతమ్మ 'కూతుర్లు లేనిదాన్ని, ఏమయినా ఇలాంటి సమయంలో ఒక ఆడపిల్ల దిక్కులేని దాన్లాగ వుంటే ఎలాగ? కడుపులోని బిడ్డ ఎంత ఘోషిస్తోంది?' అని అనుకొని పెనం వేసింది. పిండి వంటలు చేసింది.

అందుకు శ్రీనూ సాయపడ్డాడు.

పార్వతమ్మే తల్లై చూసింది. ఇంట్లోనే - తొలి కాన్పయినా సరే పెద్దలుండీ చూస్తే సులువుగానే తల్లీ బిడ్డా వేరయినారు.

శరీరం ఎన్ని రాట్లూ పోట్లూ భరించినా నెలలునిండాక భూమ్మీదకు ఘరో జీవినిదింపింది!

భాగ్యం ప్రసవానికి మొదట్లో భయపడినా 'గట్టిపిండం' అని తల్చుకొని ఎంతో ధైర్యం తెచ్చుకుంది. అందుకనే ఆ పిల్లదాన్ని చూస్తే ఎంతో ప్రేమ పుట్టింది. అంతలోనే జాలి కలిగింది. "లోకం నిన్ను ఎలా చూస్తుందో" అనుకుంది. 'ఆడపిల్లవైనాక ఇంకోలా ఎలా చూస్తుంది' అని సరిపెట్టుకుంది. సమాధాన పడింది.

భాగ్యాన్ని చుట్టపు చూపుగా చూసి వచ్చి వెళ్ళిపోయారామె తలిదండ్రులు. నారాయణ్రావు ఈ మధ్యకాలంలో ఎప్పుడూ మాటాడక పోయినా బిడ్డపుట్టాక తొలి సారిగా మాట్లాడేడు. నారాయణ్రావు మిత్రులెవరెవరో చూడడానికి వచ్చి వెళ్తూ' ఎవరి పోలిక' అని నారాయణ్రావుని అడగడంతో...ముందుకొస్తున్న నారాయణ్రావు మళ్ళీ వెనక్కి ముడుచుకుపోయాడు.

నారాయణ్రావు కోపమంతా పురిటికందునేమీ అనలేక భాగ్యం మీదకు తిరిగేది. ఊపిరి బిగబట్టినట్టే కోపాన్ని బిగపట్టి వుండేవాడు. భరించ లేనప్పుడు మందు కొట్టేవాడు. బాధని చెప్పుకోలేక పోయినా పంచుకోమని మిత్రులకు మందు పార్టీ ఇచ్చాడు.

శ్రీనేదో ప్రపంచాన్ని గెలిచినట్టుగా వున్నాడు. ఆ ఆనందంతో మిత్రులందరికీ మందు పార్టీ ఇచ్చాడు. పట్టుకోవడానికే భయంవేసే పురిటికందుని ముద్దులతో ముంచేసాడు. అందులో భాగంగా భాగ్యంకు కూడా!

పిల్లదానికి మూడునెలలు నిండాయనగా అప్పుడు మళ్ళీ ఏం మనసు తిరగవేసుకున్నారో భాగ్యం తలిదండ్రులు వచ్చారు. బంధువులూ వచ్చారు. అంతా మారిపోయినట్టేవుంది. అసలుకి కాలమే మారి పోయినట్టు వుంది. భాగ్యానికి ఆశ్చర్యంగానే వున్నా, తనవల్ల ఎంత హింస అనుభవిస్తేనేమిగాని.....తనని కాపాడడానికే పుట్టిందా?' అని పిల్లది ఆ తల్లికే దేవతలా కనిపించేది.

వచ్చిన వాళ్ళందరూ పిల్లని క్షణం దించేవారు కాదు, ఎలాంటి వాళ్లయినా దాని చురుకైన కళ్ళు కట్టి పడేసేవెమో మరి వదిలేవారుకాదు. అందరూ చిన్నపిల్లనీ లేక లేక కలిగిందనీ నేలన దించేవారు కాదు. అయితే నారాయణ్రావు మటుకు అసలు పట్టించుకొనేవారు కాదు. ఎవరో ఏదో పనుండో చేతిలో పెడితే మాత్రం దించలేక ఎత్తుకొనేవాడు.

శ్రీను పరిస్థితి అందుకు విరుద్ధంగా వుంది, పిల్లదాన్ని వదలడు. ఇల్లూ కదలడు.

భాగ్యం భర్తని గమనిస్తూనే వుంది. అప్పుడప్పుడూ పిల్లదాని భవిష్యత్తు ఏమవుతుందోనని భయపడేది, బాధ పడేది. భవిష్యత్తు కోసం ఆలోచన చేసేది. అయినా బెంగ పోయేది కాదు.

ఇదిగో చూడు...దాని పక్క వేరేగా పెట్టు నాపక్కమీద వేసారు, పక్క తడిపేసింది. ...తియ్యండి...తియ్యండి...." ఏదో ప్రమాదం జరిగిపోయినట్టు నారాయణ్రావు అరిచేవాడు. పసుపు అంటుకు పోయిందని చిరాకు పడేవాడు.

భాగ్యం తల్లిదండ్రీ అల్లుడి చిరాకునీ పరాకునీ గమనించేరు. కూతురు జీవితానికి సంతానం కలిగినా గమ్యం వాళ్ళకు తోచేది. అల్లుడు నారాయణ్రావు ఎవరెవరితో తిరిగినా ఎంత ఖర్చుపెట్టినా ఫరవా లేదు గాని ఇంట్లో కలిసిపోయి వుంటే బాగున్ను అనుకున్నారు. నారాయణ్రావు ఎవర్తినో వుంచుకున్నాడని తెలిసి భరించలేక పోయేవారు.

శ్రీనుకు ఏదన్నా ఉద్యోగం వేరో ఊర్లో చూడాలనీ, అవసరమైతే డబ్బైనాకట్టి పంపించేయాలని కూడా అనుకున్నారు. ఈ విషయమై భాగ్యాన్ని ఎప్పుడైనా అడిగి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. కాని పట్టుమని పదిరోజులు వుండే అవకాశం లేక తిరిగి తమ ఊరెళ్ళి పోయేవారు. వచ్చినపుడు ఎన్నో అనుకున్నా - వెళ్ళినప్పుడవన్నీ వాయిదాపడేవి.

నారాయణ్రావు కొలీగ్ భార్యాసమేతంగా పిల్లదాన్ని చూడడానికి ఇంటికొచ్చాడు. వచ్చినావిడ అన్నది "మా అయనకు చిన్న పిల్లలంటే ప్రాణం. ఎంతిష్టమంటె ఒక్కపూటా వదలరు. డ్యూటీ చేసి వచ్చినాయన రెష్టు తీసుకోకుండా ఎత్తుకుంటారు" చెప్పింది.

"నాకిష్టమే ఇదిగో, ఈ నారాయణ్రావుగాడెప్పుడూ పిల్లని ఎత్తుకోవడం చూడలేదు" అన్నాడామె భర్త. నారాయణ్రావు కొలీగ్.

నారాయణ్రావు ఏమీ చెప్పలేక పోయి భాగ్యం వంక దోషిలా చూసాడు.

భాగ్యం మాత్రం చెప్పింది.

"ఆడపిల్లని, అంతేఁ...మరేం లేదు మగ పిల్లాడయితే ఆయన కిష్టం..." భాగ్యంకు గుండెలో బాధ వున్నా, అదిమి పెట్టి చెప్పింది. అబద్ధాన్ని చెప్పింది. అయినా అది అందంగా ఈ కాలం అలాంటిది కాబట్టి అతుక్కుపోయేది.

"పోనిప్పుడు ఏం పోయింది? మొదటి దఫాకి ఎవరయినా ఏం ఫరవాలేదు.రెండోసారికి చూర్తం మంచిది. మగపిల్లాడు ఈ దఫా పుడతాడు నిజం...." అవిడెందుకో ఎవరెవరికి ఎలాకలిగారో చెప్పుకు పోయింది.

భాగ్యంకు వినకూడని మాటలు వింటున్నట్టు, ప్రమాదమేదో రానున్నదా అని భయపడ్డది కూడా.

ఆ మాటలు విన్నాక నారాయణ్రావు అక్కడ వుండలేకపోయాడు. నిలబడలేక వీధిలోకి నడిచాడు.

కొలీగ్ దంపతులు వెళ్ళొస్తామని చెప్పి వెళ్ళిపోయారు.

శ్రీను వచ్చి పిల్లదాన్ని ఎత్తుకుపోయాడు. తమింటికి తీసుకెళ్లాడు. ఊరంతా తిప్పుకు వచ్చాడు. ఫొటోలు కూడా తీయించాడు. అన్న ముహూర్తం రోజు అన్నీ దగ్గరుండి తనే చూసాడు.

భాగ్యం శ్రీనుకు వద్దని చెప్పాలనుకునేది. కాని పిల్లదానికిదూరంగా వుండమనే హక్కు తనకున్నా శ్రీనుకు వుండే హక్కులేదా? అని తర్కించుకునేది. నారాయణ్రావుకి ఎదురుగా కూర్చొని పిల్లదాన్ని శ్రీను ముద్దులాడుతూ వుంటే భాగ్యంకు ఏదోలా వుండేది. కుడితిలో పడ్డ ఎలుకలా వుండేది. ఏమనాలో తెలియక 'పిల్లదానికి ఎక్కువగా ఎత్తుమప్పుకు. అలవాటైపోతే కష్టం. పైగా చిన్న పిల్లల్ని వీధిలో తిప్పకు' అనేది. శ్రీను కోపంతో పిల్లదాన్ని వదలి వెళ్ళిపోయాడు.

భాగ్యం మనసెందుకో చివుక్కుమంది. నారాయణ్రావుని గమనించినా అతనిలోని ఏ భావాలూ ఆమెకు అర్థం కాలేదు.

అదే రోజు రాత్రి పిల్లదానికి జ్వరం వచ్చింది. ఒళ్ళుకాలిపోతోంది. కక్కుకోవడమూ మొదలు పెట్టింది. మరొక్క గంటకు కళ్ళు తేలేసింది. పిల్లది దక్కుతుందో దక్కదో నన్న అనుమానంతో ఎవరికీ కాళ్ళూ చేతులు ఆడని స్థితిలో - నారాయణ్రావే పిల్లదాన్ని భుజాన వేసుకొని ఆసుపత్రికి పరుగులెత్తాడు. ఒక రాత్రి ఒక పగలూ వుండి అన్ని ఉపచర్యలూ చేసాడు. మందులూ టానిక్కులూ రాసిచ్చినవన్నీ కొనుక్కు వచ్చాడు. భాగ్యానికి జాగ్రత్తలు చెప్పాడు. ఎన్నోసార్లు దక్కకూడదనుకున్నా - బిడ్డ దక్కిం తరువాత ఆనందం వేసింది. ఏదో ప్రమాదంలోంచి బయటపడినట్టూ తోచింది భాగ్యానికి.

ఇదంతా చూస్తూవుంటే భాగ్యానికి దుఃఖమూ ముంచుకొచ్చింది.

ఆయా సమయాల్లో శ్రీను పాపని ఎత్తుకొని గుండెలమీద అదుముకోబోతే నారాయణ్రావు పెదవివిప్పక పోయినా భాగ్యం మటుకు శ్రీను చేతుల్లోంచి పిల్లని లాక్కుంది. తను చేసిన తప్పేదో సరిదిద్దు కోవడానికన్నట్టు పాలు పెట్టాలనేది, అది ఆసుపత్రయింది. అదే ఇల్లయితే అప్పటికప్పుడు పిల్లదానికి నీళ్ళుపోసివున్ను, తలదువ్వి వున్ను...ముస్తాబుచేసివున్ను...

ఏదయినా దూరంగా ఉంచడమొక్కటే భాగ్యం ధ్యేయమయింది.

శ్రీను ఆవాళ అలాజరిగే సరికి ఆసుపత్రి నుండి తలదించుకొని వెళ్ళిపోయాడు. నారాయణ్రావు ప్రవర్తన చూసాక, పిల్లపట్ల పడుతున్న శ్రమ చూసాక, అభిమానం చూసాక వాటినన్నిటిని నిలబెట్టు కోవాలనుకుంది.

భాగ్యం మనసు చంచలంగా వుంది.

శ్రీనుకేదో సర్ది చెప్పాలనుకుంది. చెపితే వింటాడనుకుంది. పిల్లదాని ఆరోగ్యం కాదు గాని ఇంటి ఆరోగ్యమే బాగుపడుతున్నట్టు తోస్తున్నది.

ఆసుపత్రి నుండి వచ్చే ముందు నారాయణ్రావే పిల్లదాన్ని బెడ్డుమీది నుండి తీసి ఎత్తుకున్నాడు. భాగ్యంకు కలా నిజమా అన్నట్టుగా వుంది.

ఆ పరిస్థితి ఎంతోసేపు నిలువలేదు.

డిశ్చార్జి సమయాన బిల్లు పే చేస్తున్నప్పుడు కౌంటర్లో పాప పేరు చెప్పితే రిపోర్టులన్నీ ఇచ్చారు. వాళ్ళు రిజిస్టర్‌లో రాసుకోవడానికి అడ్రను చెప్పమన్నారు. పాప పేరు చెప్పాక "డాటరాఫ్ శ్రీను...శ్రీనవాసరావు" నారాయణ్రావు చెప్పాడు.

భాగ్యంకు అది విన్నాక మెదడు మొద్దుబారిపోయింది. కొద్దిక్షణాలు గడవక ముందే పాపనెందుకో నారాయణ్రావు చేతుల్లోంచి అందుకుంది. నారాయణ్రావు ఏమీ జరగనట్టు ప్రశాంతంగా వున్నాడు.

భాగ్యమేదో పెను తుఫాను తాకిడికి గురయినట్టుంది. శరీరం వణుకుతోంది. చెమట పడుతోంది కూడా. నిలబడుతుందున్నదేదో కుప్పకూలి పోయినట్టే వుంది. అంతకు ముందు క్షణం వరకూ ముచ్చట పడ్డదేదో ఒక కలా?....ఇదే నిజమా?....నిజమనడానికే సాక్ష్యం వున్నట్టు నారాయణ్రావు మళ్ళీ ఎప్పటిలాగే అయిపోయాడు. మామూలు అయిపోయాడు. పిల్లదాన్ని ఏడ్చినా ఎత్తుకొనేవాడు కాదు. ఎత్తుకున్నా అందులో లాలన వుండేది కాదు. ఏదో అనవసర భారాన్ని మోస్తున్నట్టే అనాసక్తంగా వుండేవాడు.

దాంతో భాగ్యం గడిచిన జీవితం సమీక్షించుకుంది.

పిల్లలు పుట్టక పోతేనే కాపురం కూలిపోతుంది అనుకుంది. కాని పుట్టాక కూడా కాపురం కుప్పకూలి పోతున్నట్టేవుంది. అయినా ఇంకా విడిపోతూ విచ్ఛిన్నమవుతూ కూడా ఎందుకు కలసి జీవించినట్టు కుటుంబంగా వున్నట్టు గడచిపోతోందో భాగ్యానికి ఏ మాత్రం అర్థం కాలేదు.

"అసలు ఈ పిల్లనే వదుల్చుకుంటే?'..

ఆ ఆలోచన వెన్నులో చలి పుట్టించేది భాగ్యానికి. మరొక్కసారి నా జీవితమే నాశనమయి పోయాక మవ్వెందుకు?' అనిపించేది.

'అమ్మా నేనెవరి కూతుర్నే? నా తండ్రెవరే? నన్ను లోకం ఏమంటుందే? మరి నువ్వేం జవాబు చెప్తావే? చెప్పు...చెప్పమ్మా?....నేను నీ కూతుర్నయితే చెప్పు...?

ప్రశ్నలు కుమ్మరిస్తున్నట్టు...కూతురు తనని మించి పెరిగి ప్రశ్నిస్తున్నట్టు నిలదీస్తున్నట్టు.....జవాబు చెప్పమన్నట్టు....జీవితమెంత మిగిల్చావో భవిష్యత్తు ఎలా తిప్పావో చెప్పమన్నట్టు.....ఒకటీ రెండూ కాదు కొన్ని వందల వేల ప్రశ్నలు....చిన్నపిల్లకు నోరొచ్చి భాగ్యాన్ని కుదిపేస్తోంది.

భాగ్యం ఉలిక్కిపడి లేచింది.

పక్కనే పాప...నిజంగానే చిన్న చిన్న చేతులతో బుజ్జి బుజ్జి వేళ్ళతో తడుతూవుంటే వేలాది ప్రశ్నలు వేస్తున్నట్టయ్యింది. గతంలో జరిగిన దంతా కళ్ళముందు కదలాడ్డంతో వచ్చిన వణుకు....తట్టుకోలేని వణుకు... చలిజ్వరం వచ్చినట్టు ఒక్కటే వణుకు.....

శిథిలాల మధ్య చిక్కుకున్న జీవితం తిరిగి చూసుకోవడం వల్ల కలిగిన భావన....శిథిలాలా శకలాల మధ్య నజ్జు నజ్జయి పోయిన భావన. శరీరం నలిగిపోతూ ఇంకా చావలేదన్న భావన. మనసుముక్క ముక్కలయి మనిషి మిగిలిన భావన....

మరొక్క క్షణమయినా ఆగక, వేసుకున్న బూట్లయినా విప్పకుండా మంచమెక్కి పడుకుండి పోయాడు నారాయణ్రావు.

భాగ్యంకు ఏం జరగనుందో తెలియడం లేదు. పార్వతమ్మ వస్తే బాగున్ను అనుకుంది. కాని పార్వతమ్మ రాక జాడేలేదు. ఎవరి చేతన్నా కబురు పంపితే బాగున్ను అనుకుంది. అప్పుడు జానకి గుర్తుకు వచ్చింది. జానకి పనిమానేసి వెళ్ళిపోవడం గుర్తుకు వచ్చింది. జానకి వెళ్ళిపోయిన నాటిరోజులు ఎంతవద్దనుకున్నా భాగ్యానికి జ్ఞప్తికి వచ్చాయి.

...అలా ఆసుపత్రినుండి పాప డిశ్చార్జి కావడంతోనే నారాయణ్రా వేమిటో బోధ పడింది. పిల్లని తాకద్దు అని అన్నందుకు అదీ ఆసుపత్రిలో చెప్పినందుకు శ్రీను అలిగి వెళ్ళినట్టే వున్నాడు. కబురు పెడితే రాలేదు. సంగతి తెలియక భాగ్యం ఆయన లేరన్న కబురూ పంపింది. రాత్రికి రమ్మంది. కాని శ్రీను రాలేదు. పోనిలే ఈ విధంగానైనా రాకపోతే మేలే అనుకుంది.

కాని శ్రీను వచ్చాడు.

నారాయణ్రావ్ వున్నప్పుడే!

శ్రీను ప్రవర్తనలోని కోపాన్ని కారణాల్ని భాగ్యం గుర్తించక పోలేదు. అది సహజమే అనుకుంది. కాని అసహజంగా తోచింది...ఆశ్చర్యంగా తోచింది....కళ్ళముందు జరిగే సరికి తనకళ్ళని తనే నమ్మలేకపోయింది.

"రా ..రాశ్రీను కూర్చో..." చాలా ఆప్యాయంగా నారాయణ్రావు శ్రీనుకి కుర్చీ చూపించాడు.

"రేష్టా...?"అంటూ నారాయణ్రావుడ్యూటీ గురించి అడిగిన శ్రీను కుర్చీలో కూర్చున్నాడు.

భాగ్యంకు జరుగుతున్నది కలా నిజమా సంశయం ఎంతోసేపు నిలువలేదు.

"భాగ్యం టీ పెట్టు....." నారాయణ్రావు అన్నాడు.

"ఇప్పుడే తాగాను...."మొహమాట పడ్డాడు శ్రీను.

శిధిలాల మధ్య చిక్కుకున్న జీవితం తిరిగి చూసుకోవడం వల్ల కలిగిన భావన ... శిధలాలా శేకలాలా మధ్య నజ్జునజ్జయి పోయిన భావన. శరీరం నలిగిపోతూ ఇంకా చావలేదన్న భావన. మనసు ముక్క ముక్కలయి మనిషి మిగిలిన భావన ...

ఇన్ని భావనల మధ్య ఎన్నెన్నో ప్రకంపనాలకు గురయిన భాగ్యంకు ఇకమీదట దేని తాకిడికి తట్టుకోలేనట్టు భయపడుతున్నది. అందుకనే చేతిపిల్ల చేయి తగిలినా వణికి పోయింది.

అయితే గతించిన కాలానికి గడియపెట్టేద్దామంటే వల్ల కాకుండా వుంది.

మళ్ళీ చప్పుడు...

నిశ్శబ్దం చప్పుడు కాదు.

తలుపు తెరుచుకున్న చప్పుడు. మందు కంపుతోపాటు మనిషికంపు పోటీపడి గదిలోకి ప్రవేశించినచప్పుడు.

నారాయణ్రావ్!

అతని కళ్ళు ఎర్రబడివున్నాయి. కాళ్ళు వుండి కూడా నిలువుగా లేవు. ఏటవాలుగా వుండి ఎటుకటుగా తూలుతున్నాయి.

భాగ్యం పిల్లని బలంగా పట్టుకొని అలాగే కూర్చుండే కాని లేవలేదు. ఏం చేయాలో తెలియక తెలివిగా వున్న పిల్లని నిద్రపోయిందానికి జోకొట్టినట్టు జోకొట్టింది. నారాయణ్రావు భాగ్యానికి దగ్గరగా వచ్చి ఆమె కళ్ళలోకి కళ్ళుపెట్టి చూసాడు. ఉబ్బివున్న ఆ ముఖంలో భాగ్యం ఏ భావాన్ని పోల్చుకో లేక పోయింది.

"ఫరవాలేదయ్యా తాగు, ఏమిటీ మధ్య సినిమా లేం చూసావ్" అడిగాడు నారాయ ణ్రావు. ఆ మాటలు భాగ్యంకు వినిపించాలనేమో 'అవసరంలేనంత గొంతు వుంది.

"మొగుడుతో వచ్చిన సినిమాలన్నీ చూసేసానండి. అదే రౌడీ మొగుడు, అల్లరి మొగుడు, ఛాదస్తపు మొగుడు, ఘరానా మొగుడు, నువ్వే నా మొగుడు అన్నీ చూసాను. ఇంకా మొగుడు సినిమాలు రాలేదు...ఇంట్లో మొగుడు, వీధిలో మొగుడు షూటింగ్ అవుతున్నాయి కదా...." శ్రీను గుర్తుకు తెచ్చుకుంటూ చెపుతున్నాడు.

"మరి పెళ్ళాంతో సినిమాలో...?" ఆసక్తిగా అడిగాడు నారాయణరావు.

"నాకింకా పెళ్ళి కాలేదు కదండీ...." అమాయకంగా అన్నట్టు అన్నాడు శ్రీను. ఆమాట వినడంతో జానకి పగలబడి నవ్వింది.

"ఎందుకానవ్వు......" భాగ్యం అనబోయింది.

"తనకింకా పెళ్ళికాలేదు కాబట్టి....." హి...హి...హి..మని నవ్వేడు శ్రీను. శ్రీను వెనకతల నారాయణ్రావు కూడా. వాళ్ళతో బాటే నవ్వుతూ వున్నా జానకి నవ్వు పెదవి దాటలేదు.

"జానకి పెళ్ళి మీరు చెయ్యకూడదూ?" అడిగాడు శ్రీను.

"పెళ్ళి చేసుకోకూడదా....చెయ్యకూడదా?...." ప్రశ్నని సరిచెయ్య

మ్మన్నట్టు నారాయణ్రావు శ్రీన్నడిగాడు.

"ఏదయినా మీ ఇష్టమే...." తేల్చేసాడు శ్రీను.

"నేను చేసుకుంటే ఒప్పుకుంటుందంటావా?" అనుమానంగా అడిగాడు నారాయణ్రావ్.

"ఎవరు భాగ్యమా?" అడిగాడు శ్రీను.

నారాయణ్రావు ఎదుటే పెద్దా చిన్నా తేడా లేకుండా ఏక వచనంతో పేరు పెట్టి అడగడంతో శ్రీనుకు ఏభయమూ లేదని అనిపించింది భాగ్యానికి.

"కాదు ...అయిపోయిందానితో ఇంకేమిటి?, కావలసిన దానితోనే... అదే జానకి ఒప్పుకుంటుందా అని" నారాయణ్రావన్నాడు.

"జానక్కి నేనంటే కోపం, మీరే చేసుకోండి" నవ్వుతూ అన్నాడు శ్రీను.

జానకి పనిచేస్తూనే వింటూ తలెత్తి చూస్తోంది.

'నువ్వు నీ పని కానియ్యి, అటెందుకు చూస్తావ్' జానకిని గద్దించింది భాగ్యం. తరువాత మళ్ళీ అంది" చిన్న పిల్లతో అవేం మాటలు" కోపంగా అంది.

తుఫ్ మని ఊసుకుంటోంది. ఎడం కాలి కింద మట్టి తీసి బొట్టు పెట్టుకుంటోంది.

"జానకి ఏమయింది నీకు" ఒక రోజు భాగ్యం అడిగింది.

"ఏం లేదు...లేదు.." అంటూనే ఏడ్చేసింది జానకి. ఆ సమయంలో ఏమిటయ్యిందని భాగ్యం అడిగిందేగాని రెట్టించలేక పోయింది. సమాధానం రాబట్టలేక పోయింది.

"ఇంటికి పోతాను, మా ఊరెళ్ళిపోతాను....." జానకి నోట ఒకటేమాట.

జరిగిందేమిటో చెప్పేదాక జానకి తన ఊరు వెళ్ళడానికి వీల్లేదంది భాగ్యం. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డంది.మరేమీ భయం లేదంది. భయపడిపోతే ఎన్నాళ్ళయినా ఎక్కడయయినా ఒకటే అంది. ప్రయోజనం లేదని తెలిసి జానకిని భాగ్యం బలవంతం చెయ్యలేదు. కాని జరిగిందేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించింది.

ఆవాళ రాత్రి భాగ్యానికి అప్పుడే రెప్ప పట్టింది. కాని తన మీద పడ్డ కుదుపుకి నిద్రవదిలిపోయి కళ్ళు తెరిచి చూసింది.

భాగ్యంకు ఏ ఆలోచనా అందడం లేదు. జరుగుతున్న విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటే వారి మాటలు అసహ్యాన్ని అసహనాన్ని పెంచుతుంటే చలనం లేని మనిషిలా నిలబడిపోయింది.

"పెళ్ళిచేస్తే తెలుస్తుంది. చిన్నా పెద్దా..ఏం శ్రీనూ...."

"అంతే...అంతేనండి...."

భాగ్యం భరించలేక "ఇంక ఆపండి. మరేం మాటలకు మీకు ఇద్దారకలేదా?" అరిచింది.

నారాయణ్రావ్ వెంటనే కుర్చీలోంచి లేచి "ఎందుకలా అరుస్తావ్, నువ్వు నోర్మూయ్యి...నీకనవలసరం...."అంతకంటే రెట్టింపు గొంతుతో అరిచాడు.

శ్రీను ఎందుకో నవ్వు రాకుండా నవ్వుతున్నాడు.

నారాయణ్రావు తిరిగి కుర్చీలో కూర్చుంటూ"అవును శ్రీనూ... దీనికెందుకు. దీని విషయాలన్ని మనం అడుగుతున్నామా?"అన్నాడు.

అవునవునన్నాడు శ్రీను.

ఇద్దరూ ఒక్కటైపోయారు.

భాగ్యంకు ఏ ఆలోచనా అందడం లేదు.జరుగుతున్న విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటే వారి మాటలు అసహ్యాన్ని అసహనాన్ని పెంచుతుంటే చలనంలేని మనిషిలా నిలబడిపోయింది.

"రేపురా శ్రీను...మూడు పొడయిపోయింది"

"తప్పకుండా...."

శ్రీను కదిలాడు. దిగబెడుతున్నట్టుగానే వెనకాతలే నారాయణ్రావు నడిచాడు.

భాగ్యానికి అంతా వింతగా వుంది. విడ్డూరంగా వుంది. ఎన్నడూ లేని వాళ్ళస్నేహమేమిటో ఎటుపోతుందో అంతుపట్టకుండా వుంది. ఏ అంచూ దొరక్కుండా వుంది ఏమి జరుగుతుందోనని బితుకుగా బెంగగా వుంది.

అక్కడికి వారం పదిరోజుల్లోనే జానకిలో వచ్చిన మార్పులు స్పష్టంగా గుర్తుపట్టింది భాగ్యం. ఎప్పుడూ ఎవరో వెంటాడుతున్నట్లో తరుముతున్నట్లో పరుగులు పెట్టేది. ఒక్కర్తీ ఇంట్లో వుండడానికి భయపడుతోంది. ఉండీ ఉండీ తుళుక్కుపడి గుండెలమీద తుఫ్

జానకి! భాగ్యాన్ని చిన్న పిల్లలా చుట్టేస్తోంది. చెమట పట్టి వుంది. కనురెప్పలు బెదురుతూ వున్నా బలవంతంగా మూసుకుంటోంది.

"భయం లేదు భయం లేదు...." భాగ్యం ధైర్యం చెపుతూనే వుంది కాని, తన రెక్కపట్టి పక్కకు తోసిందాక నారాయణ్రావుని చూడలేదు. చూసేక నమ్మలేక పోయింది. ఊపిరి సలపలేదు కూడా!

"జానకిని వదులు...." అలసిపోతూ అన్నాడు నారాయణ్రావు.

"ఎందుకు" భాగ్యం మరింతగట్టిగా జానకిని పట్టుకుంది.

"నీకనవసరం..."లెక్కచేయనట్టుందతని గొంతు.

"నేనొదల్ను...." భాగ్యం గట్టిగానే చెప్పింది.

"అంటే ఏమిటి నీ ఉద్దేశం. నువ్వు పట్టుకున్న వస్నీ నేను వది లెయ్యమంటున్నానా చెప్పు?" దీర్ఘం తీస్తూ అన్నాడు నారాయణ్రావు. నారాయణ్రావు మాటలు భాగ్యానికి ఎందుగురించి అంటున్నాడో అర్థ మయింది.

"చిన్నపిల్ల..."భాగ్యం దిగమింగుకోలేక పోతోంది.

"నేను పడుచోన్ని కాదుగా..ముసలోణ్నేగా...చిన్నపిల్లలూ ముసలి వాళ్ళూ ఒక్కటేనని పెద్దలు చెప్పారు..."నారాయణ్రావు మందు మీదున్నా డని తెలుస్తూనే వుంది.

"ఛీః...మీకు నేనున్నాను మామయ్యాః...." కావాలంటే తనని అనుభవించినా ఏం చేసినా చెయ్యమన్నట్టు భాగ్యం.

"శ్రీను ఒప్పుకుంటాడా కోడలా......"

ఆ మాటతో భాగ్యం జవసత్వాలుడిగిపోయినట్టు కూర్చుండి పోయింది. నారాయణ్రావు ఎదురుగా కుర్చీ వేసుకు కూర్చున్నాడు.

జానకి భయంతో ఏడ్చేసింది. ఆ ఏడుపుకు పిల్లకూడా లేచిపోయి ఏడుపందుకుంది. ఆ ఏడుపుల మధ్య నిలువలేక చికాకు పడిపోయి తిట్టుకుంటూ నారాయణ్రావు వెళ్ళిపోయాడు బయటకి.

ఆ తెల్లవారి గట్టే జానకిని ఊరు పంపించేసింది భాగ్యం. ఎంత తట్టుకుందామన్నా దుఃఖం పొంగి పొర్లింది. కళ్ళు తుడుచుకుంటూనే

జానకి చేతిలో యాభై రూపాయలు పెట్టి "మరెప్పుడూ రావద్దు, క్షమించు" చివరిమాట అనలేక అనలేక అంది భాగ్యం. జానకి కూడా ఏడుస్తూనే వెళ్ళిపోయింది.

ఆరోజు మధ్యాహ్నమే భాగ్యానికి నారాయణ్రావుకి పెద్ద గొడవ య్యింది. జానకి విషయమై ఎంతో వ్యథ చెందిన భాగ్యం, కారకుడైన నారాయణ్రావుని ఏదో అనాలనే వుంది. పెద్ద గొడవ పెట్టుకోవాలనే అనుకుంది. అందుకనే అన్నం వడ్డిస్తూ భోం చేస్తున్న నారాయణ్రావుతో అంది.

"నేనిన్నాళ్ళూ శ్రీనుతో సంబంధం పెట్టుకున్నందుకు బాధ పడ్డాను. కాని ఇప్పుడు బాధ పడ్డం లేదు..."తగిన శాస్తి చేస్తున్నాన్న కసి, తనేం మాట్లాడుతుందో తనకే తెలియని కసి. ఆ ఉద్విగ్నతలోంచే ఆవేశంలోంచే అలా మాట్లాడి మనిషిని రెచ్చగొట్టింది.

నారాయణ్రావు తింటున్న అన్నం కంచాన్ని విసిరికొట్టి వీధిలోకి వెళ్ళిపోయాడు. భాగ్యానికి ఇంటిలోని అశాంతి ఏదో శాంతినిస్తున్నది.

ఆయా సందర్భాలలోనే శ్రీను చెప్పింది విని, ఆడింది ఆటగా పాడింది పాటగా భాగ్యం ప్రవర్తించేది. ఆ ప్రవర్తన నారాయణ్రావుని బాధించాలనుకుంది. అలాగైనా నారాయణ్రావు తనకి తానుగా చేస్తున్నదేమిటో గుర్తిస్తాడని అనుకుంది.

కాని భాగ్యం ఊహించినట్టు జరుగక పోగా అది మరోలా జరిగింది. నారాయణ్రావు నుండి సాధించా ల్సిందిసాధించుకోలేకపోయినా శ్రీను నుండి ఊహించని స్థితి వచ్చింది.

తను చెప్పినట్టల్లా వింటోందని, చెయ్యిమన్నట్టు చేస్తుందని నమ్మకం కుదిరాక భాగ్యం మీద మరిన్ని అధికారాలు వశమయ్యాయి శ్రీనుకి.

"సినిమాకెళ్దాంపద" అన్నాడు శ్రీను.

"మనిద్దరమా?" ఆశ్చర్యపోయింది భాగ్యం. పరువుకి సంబంధించిన ప్రశ్నలు ఎన్ని వున్నా ఒక్కరోజు కూడా సినిమాకని పిలవని నారాయణ్రావుని ఏడిపించాలన్పెప్పి బయలు దేరింది.

అయితే కలసి వెళ్ళడానికి శ్రీను అంగీకరించలేదు. భాగ్యంకు అదీ ఒకందుకు మంచిదే అయ్యింది. వేరువేరుగా వెళ్ళినా హాల్లో పక్క పక్కనే కూర్చున్నారు. పిల్లని పార్వతమ్మ ఇంటి దగ్గర వదిలేసారు. అయితే సినిమాకని ఆవిడకు తెలీదు.

రమేషు సురేషూ అదే సినిమాకు రావడంతో వారి కంటపడ్డారు. అన్న తంతాడని భయంతో వారిని చూడనట్టే ఏమీ తెలియనట్టే వుండి పోయారు. సినిమాల్లోని కొన్ని దృశ్యాలని వచ్చీరాని అందీ అందని ఊహలకు రెక్కలు మొలిచి ఎగురుతున్నాయి. వాళ్ళిద్దరిలో పెద్దాడు, శ్రీనన్నయ్యకు భాగ్యమ్మక్కకూ వున్న సంబంధాన్ని మిత్రుల ద్వారా విన్నాడు.

భాగ్యమక్క బావుంటుందని అనుకున్నాడు రమేషు. అలా వాడికి చాలాసార్లు అనిపించింది. అందుకే శ్రీనుని పిలవడానికి వచ్చినదపల్లా భాగ్యాన్ని బాగా చూసి గాని పోడు. చిన్నపిల్లని ముద్దులాడుతున్నా వాడి కళ్ళన్నీ భాగ్యం మీదే!

పిల్లని ఉయ్యాల్లో వేస్తూ పట్టుకోమన్నప్పుడు చెయ్యి భాగ్యం భుజానికి తగలడం వాడికి గుర్తుకు వచ్చింది. రమేషుకు సినిమా బోధ పడ్డం లేదు. కాని ఆ సినిమాలో తడిచిన దుస్తుల్లో వున్న హీరోయిన్ వాడికి బాగా రెచ్చ గొట్టినట్టయింది. అవే ఆలోచనలు వాడు ఇంటికి వెళ్ళినా వదల్లేదు.

ఆ మరునటి రెండ్రోజుల్లో ఎవ్వరూ లేని సమయంలో భాగ్యం ఇంటికి వెళ్ళాడు రమేషు. సురేషు వెంటపడితే వద్దు ఇప్పుడే వస్తానని చెప్పాడు. రమేషు వెళ్ళేసరికి భాగ్యం పిల్లకి పాలు పడుతోంది. చూడ్డంతోనే 'రా....రమేషూ తమ్ముడేడి?' అడిగింది.

రమేష్ తబ్బిబ్బయ్యాడు. మాటరాలేదు.

"పదో తరగతి కొచ్చావ్, ఎలా చదువుతున్నావ్? పబ్లిక్, కష్టపడి చదవాలి..."భాగ్యం చెపుతూ రమేష్ వంక చూసింది. రమేష్ తన వంక చూడ్డం లేదు. పాప వంకనుకొని 'ఎత్తుకుంటావా' అడిగింది. దృష్టి మరలలేదు. అప్పుడు భాగ్యం గ్రహించింది. పైట చాటున వాడి చూపు.....

'ఒరేయ్'అరిచింది, పారిపోబోయాడు వాడు. పరుగున వెళ్ళి పట్టుకుంది. చెయ్యి వదల కుండా తెచ్చి పక్కనే కూర్చోమంది భాగ్యం. రమేష్ కూర్చున్నాడేగాని తల ఎత్తడం లేదు. కనురెప్పలు ఎత్తడం లేదు.

"తప్పుకదూ?..." రెండు నిముషాలు ఆగాకే అడిగింది భాగ్యం.

రమేష్ బిక్క చచ్చిపోయాడు. వాడి ముఖం కందగడ్డలా వేలాడి పోయింది. నెత్తురు చుక్కలేదు.

"పెద్దాడివి అయిపోయావా? ఎవరు చెప్పారా పనులు? ఎవరిని చూసిరా నేర్చుకున్నావ్?" అడిగింది భాగ్యం. చెప్పకపోతే మీ శ్రీనన్నయ్యకు చెపుతానని అనడంతో 'వద్దు...వద్దు, మరెప్పుడూ చెయ్యను'అంటూ ఏడుపు మొదలెట్టాడు. ఏడుపుతో వదిలేస్తుందనుకున్నాడు. అలా జరగలే.

" ఏడు అందరూ వస్తారు..అప్పుడందరికీ చెపుదువుగాని...వాకు చెప్పకులే. పోని మీ అన్నయ్యకు చెపుతావా?"భాగ్యం అడిగింది.

"వద్దు..."అంటూ ఏడ్చాడు. చివరికి చెపుతానని ఒప్పుకున్నాడు. చెప్పాడు. వాడి మాటలు విన్నాక భాగ్యం స్థంభించిపోయింది.

"...మీ అన్నయ్యకిచ్చిందంటే నీకూ ఇస్తుందని మా ఫ్రెండే అన్నాడు. 'కిస్' అడగమన్నాడు. అన్నయ్యలేనప్పుడు వెళ్ళమన్నాడు. అలాంటి దాయి ఎవరికయినా ఇస్తుందన్నాడు. వాళ్ళ తమ్ముడివే కాబట్టి నిన్ను కాదనదు' అని కూడా చెప్పాడు.....వాడే చెప్పాడు, నాకేం తెలీదు.....మా అన్నయ్యకు చెప్పకక్కా....చెప్పకు....కొట్టేస్తాడు చంపేస్తాడు...." బతిమలాడుతున్నాడు, భయపడుతున్నాడు.

రమేష్ మాటలేవీ భాగ్యానికి బోధపడ్డంలేదు.

ఆ మాటలు విన్నాక తనకు తెలివి లేనంతగా రమేషు చేతుల్ని విడిచిపెట్టింది. భాగ్యం కదలక మెదలక మాటాడక పోయేటప్పటికి రమేషు కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయాడు.

"రమేషుకా ఆలోచనసలెందు కొచ్చింది?" భాగ్యం అనేక మార్లు ప్రశ్నించుకుంది. అప్పుడమెకు తన లోపమేమన్నా వుందా? అని తడుముకుంది. ఎప్పుడుకూడా వస్యనికైనా ఒకమాటలేదే.... ఇకటమాడలేదే?! మరెందుకు..

లోకం వేసిన ముద్ర..మిత్రుడు చెప్పిన మాటలు అందుకు తోడ్పడితే తోడ్పడి వుండవచ్చు. కానివచ్చిన ధైర్యమేదో ఎలా వచ్చింది? చాలాసేపు ఆలోచించాక భాగ్యానికి కొన్ని విషయాలు జ్ఞాపకాని కొచ్చాయి.

నారాయణరావు వున్నదీ లేనిదీ తెలుసుకోవడానికి, వుంటే ఏ సమయంలో తను వస్తున్నదో తెలియజేయడానికి శ్రీను ఉత్తరం రాసి రమేషు చేత పంపేవాడు. డబ్బులు అవసరమైనా సరే పంపేవాడు. రాత్రుళ్ళు నారాయణ్రావు వున్నదీ లేనిదీ చూసిరమ్మని పంపేవాడు. వాడు చూసి, అనుమానం తీరక అడిగి మరీ వెళ్ళేవాడు.

ఎందుకో భాగ్యం మాత్రం రమేషుని పంపవద్దని చెప్తూవుండేది. కాని శ్రీను మాత్రం వినేవాడు కాదు. తన కార్యం జరగడం ఒకటే

ముఖ్యం, తన మాట చెల్లడం ఒకటే ముఖ్యం. అవసరం తీరడం ముఖ్యం.

"వాడికి వయసు వస్తోంది, అన్నీ తెలుస్తున్నాయి.. అర్థమవుతున్నాయి, ఇక పంపవద్దు.." భాగ్యం ఓ సారి చెప్పింది కూడా.

అప్పుడు శ్రీనే మన్నాడు?

"నాకా నమ్మకముంది.." అన్నాడు.

"ఏ నమ్మకం.. నమ్మకమేంటి?" భాగ్యంకు అర్థంకాలేదు.

"అదే... నువ్వు వాణ్ని పాడు చెయ్యవని" చాలా కాక తాళీయంగా శ్రీనామాట అనేసాడు.

భాగ్యానికా మాట కొరడా దెబ్బై తగిలింది. శరీరం చచ్చిపోయింది. శ్రీను తనని ఎలా అంచనా వేస్తున్నాడో అర్థం కాలేదు. అమాటే అడిగింది. శ్రీను ఫిల్లు పట్టుకుంది. రోషంగా రొప్పుతూ అడిగింది. సగం చచ్చి అడిగింది.

అప్పుడు శ్రీను చెప్పాడు.

"నాకా వుద్దేశం లేదు. వుంటే తమ్ముణ్ని పంపను కూడా. మా ఫ్రెండు వేణు తెలుసుగా వాడి మాటది. నానోటంట వచ్చింది. రాస్కెల్ అపశకునం మాటలు మాటాడు తాడెప్పుడు. ఆంటీని కొట్టేసానని అసూయ పడతాడు. పైగా నువ్వు నాకింద డబ్బులు పెడతావని ఈర్ష. నా ఉద్యోగమే బాగుందంటాడు. ఉద్యోగానికి సెలవు పెడితే, సెలవు చీటీ పంపిన మీ తమ్ముణ్ని డ్యూటీ చెయ్యమందా' అని అడిగాడు. వాడిది ఉడుకుబోత్తనం. వాడికి కట్ అవలేదని బాధ.. అంతే.."

శ్రీను చెప్పిన మాటలు భాగ్యానికి సేద తీర్చలేదు. మరింత మంట పుట్టించాయి. ఉక్రోషాన్ని పెంచాయి. ఉద్రేకంతో "మీకివేనా మాటలు, సిగ్గు లేదూ?" అడిగింది.

భాగ్యం ముఖం చూస్తూ శ్రీను పడి పడి నవ్వాడు. అలా ఎందుకు నవ్వుతున్నాడో భాగ్యానికి అర్థం కాలేదు. కాలిన గాయం మీద కారం రాస్తున్నట్టే వుందా నవ్వు.

"మీ ఆడవాళ్ళకంటే 'వంటయ్యిందా?' 'అంట్లు తోమేస్తావా?' 'నీళ్ళు పట్టేసావా?' పిల్లలకు నీళ్ళు పోసేసావా? బట్టలుతకడం అయిపోయిందా? ఇవే మాటలు. కాని మగాళ్ళకి అనేకం వుంటాయి. అనేకం మాట్లాడు కొంటారు. అందులో తప్పేముంది?" మళ్ళీ నవ్వేడు శ్రీను.

"పరువు పోదా?" మాట్లాడు కూడదనుకుంటూనే, ఆగలేక అడిగింది భాగ్యం.

"పరువా? కాదు ప్రతిష్ట. ఇప్పుడు కుర్రాళ్ళు ఎన్ని హోటల్స్‌లో ఎన్నెన్నీ భోజనాలు చేసారో స్కోరు చెపుతుంటే.. నీకేం తెలుసు. సెంచిరీలు చేసినోళ్ళని మేం బాబాయ్ అంటాం. నిన్నే నమ్ముకోవడం వల్లనే బాబాయ్ కాలేదు.." శ్రీను బాధని నటిస్తున్నట్టే వుంది.

భాగ్యానికి ప్రపంచం దాని పోకడ, ఉద్యోగం సద్యోగంలేని కుర్రాళ్ళ ఊసుపోలు కబుర్లు ఇవన్నీ మరింత కంగారు పెట్టాయి.

మానవ జీవితం మీదే అసహ్యం పుట్టింది.

"నీ వల్ల మీ తమ్ముళ్ళు చెడిపోతారు. నాకాపాపంలో వాటా వద్దు" భాగ్యం ఎంతో సహనాన్ని తెచ్చుకొని చెప్పింది.

"ఈ కాలంలో ఒకర్ని చూసి అంటే మనల్ని చూసి కాకపోయినా మరొకర్ని చూసి చెడిపోరని గ్యారంటీ ఏమిటి? వాళ్ళ కళ్ళకి గుర్ణలూ కట్టలేం.." శ్రీనుది వితండవాదమని భాగ్యం నోర్మూసుకుంది.

అటుపిమ్మట రమేషు నెప్పుడూ పట్టించుకోలేదు.

ఇదిగో రమేషు ఇప్పుడిలా ప్రవర్తించడంతోటి అయకారణాల్ని అంచనా వేసింది భాగ్యం.

రమేషుని పిలచి ఎన్నో చెప్పాలనుకుంది. ఆ వుద్దేశంతో కబురు పెడితే భయపడ్డాడో ఏమో రమేషు రాలేదు. వచ్చినా ఆ ఒకటి రెండు సార్లు చెప్పే వాతావరణం అవకాశం లేకపోయాయి. ఆ తరువాత్తరువాత చెపితే, మళ్ళీ గుర్తు చేసినట్టు ఎక్కడ అవుతుందోనని, నొచ్చుకుంటాడేమో అని మానుకుంది. క్వార్టర్లీ అఫ్‌యర్లీ పరీక్షల్లోనూ, యూనిట్ పరీక్షల్లో వచ్చిన మార్కులు ఎప్పటికప్పుడు కనుక్కొంటూనే వుండేది భాగ్యం. బాగా చదువుకోమని చెప్పింది. భవిష్యత్తు ముందుదని చెప్పింది. కొంత కాలంకి రమేషు రావడం మానుకున్నాడు.

ఒకటొకటి జ్ఞాపకాల దొంతరల్లో జీవితాన్ని సర్దుకుంటూ తడిమి చూసుకుంటున్నప్పుడు..

చేజారిన చప్పుడు..

భాగ్యం వర్తమానంలోకి వచ్చింది.

చప్పుడు..

నిశ్శబ్దం బద్దలయినచప్పుడు...

నారాయణ్రావు చేతుల్లోంచి మూటొకటి జారినచప్పుడు...

గోడకు చేరగిల బడిందల్లా లేచి ముందుకు వంగి చూసింది భాగ్యం. నారాయణ్రావు పెట్టెలో బట్టలు సర్దుతున్నాడు. అది సర్దడం కాదు, దేనిమీదో వున్న కసినంతా ఉమ్మ చుట్టి తోసేస్తున్నాడు. చికాకు కలిగించిదల్లా తీసి విసిరేస్తున్నాడు.

కలో.. భ్రమో.. ఏమో.. తెలిని భాగ్యం కళ్ళు నలుముకు చూసింది.

నిజంగానే కళ్ళ ముందు దృశ్యం...

కేంపుకు వెళ్తున్నారేమో భాగ్యం సరిపెట్టుకో బోయింది. అలా సరిపెట్టుకొని స్థిమిత పడలేక పోయింది. వాకెందుకని ఊరుకోలేక పోయింది. కారణం నారాయణ్రావుని చూస్తే అది కేంపు కెళ్ళిన దృశ్యంలా లేదు. ఏకంగా ఇల్లే ఖాళీ చేసి పోతున్నట్టు అన్నిసామాన్లూ సర్దుతున్నాడు. మూటలు కడుతున్నాడు. పేకింగులు కూడా.. అడ్డు వచ్చిన తపేలాల్ని తనివితీరా తన్ని కసి తీర్చుకుంటున్నాడు.

పసిపిల్ల ఎప్పుడు లేచి వెళ్ళిందో గాని, సర్దిన సామాన్ల మధ్య బంగురుతూ చేతికి దొరికిన వాటిని కొరుకుతూ.. ఉమ్మూ కారుస్తూ.. నారాయణ్రావుని చూసి నవ్వుతోంది. చేతులు చాస్తోంది.

నారాయణ్రావు ఇవేవీ గమనించే స్థితిలో లేడు. సర్ది సర్ది అలసిపోయి చెమటలెక్కి సేద తీరుతూ మంచం మీద కూర్చున్నాడు.

నిశ్శబ్దం...

భరించలేని నిశ్శబ్దం...

భాగ్యం తట్టుకోలేక పోయింది. అంతులేని సముద్రం మధ్యలో ప్రయాణం చేస్తున్న పడవలోంచి తోసినట్టు.. ఈతరాక ఈదలేక.. అందని తెప్పకోసం తెగువతో ముందుకు దూకినట్టు...

"ఎక్కడికి..." భాగ్యం అడిగింది. అలా అడిగినప్పుడు ఆమె గొంతు వణికింది. మనిషీ వణికింది.

నారాయణ్రావు పెదవి విప్పలేదు.

"నిన్నే మామయ్యా.. ఎక్కడికి..?" భాగ్యం జరిగినదంతా మర్చిపోయినట్టే వుంది. కూర్చున్న చోటు నుంచి లేచింది. తూలింది.. నారాయణ్రావు కాళ్ళదగ్గర కూలబడిపోయింది.

సమాధానం లేదు. నారాయణ్రావు తనకేమీ వినిపించనట్టు, అస్సలు చలనమే లేని వాడిలా చూపు కూడా మరల్చలేదు.

భాగ్యం గొంతులో అంతులేని దుఃఖం అప్పుడూ.. చేతకాని దానిమల్లె ఏడుపూ...

"రోజూ ఇలాగ ఎంతకాలం? .. ఈ నరకం అనుభవించడం నా వల్ల కాదు. ఇంక నాకు శక్తి లేదు. ఓపిక లేదు. మామయ్యా... ఇదిగో నీకు చేతులెత్తి మొక్కుతాను. నీకాళ్ళు మొక్కుతాను... మామయ్యా నన్ను రోజూ చంపకు. ఒక్కసారి చంపెయ్యి. పీకనులిమి చంపెయ్యి...' ' భాగ్యం ఏడుస్తూనే కాళ్ళా వేళ్ళా పడింది. కాళ్ళావేళ్ళాపడి లేచి వంగి నారాయణ్రావు చేతుల్ని అందుకొని మెడమీద వేసుకుంది.

"పీక నులిమి చంపెయ్యి, పీడా పోతుంది.."

నారాయణ్రావు తన చేతుల్ని వెనెక్కి లాక్కోలేదు. కూర్చున్న చోటునుండి లేదు. పట్టించు కోలేదు కూడా.

భాగ్యానికి దుఃఖం, ఉక్రోషం కలగలసి పోయాయి. స్థిమిత పడనివ్వడం లేదు. అందుకే ఆగలేక పోయింది. ఏదో ఒకటి తేలి పోవాలనే వుంది. దాంతో నిల్చున్న చోటునుంచి రెండడుగులు వేసి పిల్లని ఎత్తుకొంది. నారాయణ్రావు ఎదురుగా వచ్చి నిలుచుంది.

".... మా అమ్మానాయిన నా బతుకిలాగ చేసారు. నా కూతురు బతుకు పెట్టిన్నుంచే కుంపటయిపోయింది. దీని మీద కసి వుంటే దీన్నీ చంపెయ్యి..." అంటూ బిడ్డను అందించింది.

నారాయణ్రావు అందుకోలేదు. ఏమీ జరగనట్టే ఊపిరి బిగబట్టినట్టే వున్నాడు. భాగ్యం కళ్ళలోకి మాత్రం చూసాడీసారి.

"పెళ్ళిరోజు నుండి ఈ రోజుదాక నేనేమి సుఖపెట్టానో చెప్పు.



నువ్వు చూస్తూనే వున్నావు కదా చెప్పు? పిల్లలన్నారు. పిల్లా జెల్లా లేక పురుగుకన్నా హీనమయిపోయింది బతుకు. పిల్లల కోసమయితే.. పిల్లలు పుట్టడం కోసమయితే నేనేమయినా చెయ్యొచ్చును... అది మీ కందరికి ఇబ్బంది పెడితే తిట్టారు, దీవించారు. ఆఖరికి ఆనందించారు. పండగ చేసుకున్నారు. ప్రేమచూపించారు. నువ్వయితే నెలరోజులు సెలవూ పెట్టావు..." చమక లోంచి జారిపోతున్న పిల్లని దించడానికి ఆగింది. ఆగి తిరిగి మళ్ళీ అంది.

"పిల్లల కోసమయితే నేనేమయినా చెయ్యాలి, చెయ్యొచ్చును. కాని నాకోసమే నేనేదీ చెయ్యకూడదు.. చేస్తే నేరమయింది. ఘోరమయింది. బతుకు బజార్ని పడింది. ఛీ.. ఛీ.. అంటున్నా పడాల్సి వచ్చింది. కాళ్ళదగ్గర పడి బతకాల్సి వచ్చింది. అయినా బతకనివ్వడం లేదు..."

భాగ్యం అంతగా గొంతు విప్పింది ఏనాడు లేదు. అందుకే ఆ గొంతులో ఆర్ద్రత వుంది. అసహనం వుంది. అమాయికంగా ప్రశ్నిస్తున్నట్టు కనిపించినా ఆ ప్రశ్నల వెనుక వేలవేల రోజులు.. ఆ రోజుల్లో ఈతి బాధలూ అన్నీవుండి, అవన్నీ కలగలసి బయటకొచ్చినట్టు వచ్చాయా మాటలు. అయితే భాగ్యం గొంతు చివికి పోయిన గుండెవల్ల, చితికిపోయిన బ్రతుకు వల్ల గొంతు మామూలుగాలేదు. బొంగురు పోయింది.

అంతవరకూ ఆడుకుంటూ వున్న పిల్ల ఆ గొంతు విని, తల్లి ముఖంచూసి గుక్కపట్టి ఏడ్వడం మొదలుపెట్టింది.

భాగ్యం ఏడుస్తున్న పిల్లని ఎత్తుకోలేదు. ఏదో దారితెన్నూ తప్పిన బెదురు గొడ్డులా వుంది. అలానే నిలబడలేక కుప్పకూలిపోయినట్టు కూర్చుండి పోయింది.

నారాయణ్రావు అటూ ఇటూ చూసి మారుమాట లేకుండా బయటకు వెళ్ళిపోయాడు. భాగ్యం ఏదో అనాలనుకుంది. అనలేక పోయింది. అప్పటికే చీకటి పడుతూండడంవల్ల గుమ్మం దాటిన మనిషి అదృశ్యమయి పోయినట్టు కనిపించలేదు.

నిశ్శబ్దం గూడుకట్టుకుంటూ వుండడంతో పిల్ల ఏడుపు ఆపి, బిక్కు బిక్కు మని భాగ్యం కళ్ళలోకి చూసింది. ఆమె ఒడిలో కూర్చుంది. నిలబడింది. ఏమి అర్థం చేసుకుందో ఏమో ఒళ్ళోనే వాలిపోయి మూగబోయింది.

ఆ పిల్లని చూస్తే ఆవాతావరణానికి అలవాటు పడుతున్నంత బుద్ధిగా వుంది భాగ్యం కదే అన్పించింది.

సర్దివున్న సామాన్లు ఎక్కడివక్కడే వుండి పోవడంతో భాగ్యం మనసూ సర్దుకోవాల్సింది పోయి.. వాటిని చూస్తే మనను చివుక్కు మంది. మనిషి సిగ్గుపడింది. తనమీద తనకే అసహ్యం కలిగింది.

నారాయణ్రావుతో ఏడ్చి పొట్లాడి ఎన్నాళ్ళు కాపురం నిలబెట్టు కుంటుందని, అలా కాపురం ఎన్నాళ్ళు నిలబడుతుందని అనిపించింది భాగ్యానికి, ఆలోచిస్తే - అంతవరకూ తన చర్యలు గుర్తుకొచ్చి చెయ్యకూడని తప్పేదో చేసినట్లనిపించింది. దానికి క్షమాపణలు అడిగినట్లూ అనిపించింది.

నారాయణ్రావు క్షమించి వదిలేసాడా? ఆ క్షమాపణ ఎంతవరకు నిలుస్తుంది. రేపూ అదే క్షమాగుణం వుంటుందా? మళ్ళీ దయా దాక్షిణ్యం చూపిస్తాడా? దయా దాక్షిణ్యాల మీద కాపురాలు నిలబడుతాయా?

నిలబడదే?! అనిపించింది భాగ్యానికి. అలా నిలబడినా అది కాపురం కాదు. ఇప్పుడు మాత్రం తను చేస్తున్నది కాపురమా?

మరి ఇన్నీ ఘర్షణలకు లోనవుతూ.. ఇంత హింసను అనుభవిస్తూ ఇంకా కుటుంబంలో తను బతికుందా? అసలు కుటుంబం బతికుందా? అలాబతికి వున్నట్టు కనిపిస్తుంది. కుటుంబం బతకడమంటే మనుషులు చావడమా? ఇన్ని జరిగి ఈ కప్పుకింద.. కుటుంబ జీవితం ఇంకా ఎందుకు కోరుకుంటోంది?

...... ఇవో ఇలాంటివో ప్రశ్నలు. అనుభవంతో వచ్చిన ప్రశ్నలే అవి. చిత్తడి చిత్తడయిపోయిన బతుకు బాధల్లోంచి వచ్చిన ప్రశ్నలవి. చివికిపోయిన కుటుంబంలోంచి లేచిన ప్రశ్నలవి..

నారాయణ్రావు ఇవాళ కాపోతే రేపయినా వదిలేస్తాడు.

పక్కింటి ప్రకాశరావు తన భార్యనలానే వదిలేసాడు. తను మాత్రం మరో పెళ్ళి చేసుకున్నాడు. మరి ఆవిడ ఏమయిందో...

వదిలేసిందేదో ముందే వదిలించుకుంటే...?!

కుమిలి కుమిలి కుచించుకు పోయిన భాగ్యం... జీవితం చిందర వందరై పెంటకుప్పై పోయిన భాగ్యం.. ఆ పెంటకుప్ప మీదే మెలకలేవో లేస్తున్నట్టు... అవి పిచ్చిమొక్కలు కావు.. మహావృక్షాలే...

మరి ఇంకా ఎందుకు కాళ్ళొదలనట్టు...? తన్నినా ఉంగలు చుట్టుకుపోతూ కాలికి చుట్టుకు పోవడ మెందుకు?

నారాయణ్రావు లేక పోతే ఏమవుతుంది?

..మరి బతకడం ఎలా?...

ఆ ప్రశ్న వేసుకున్నాక భాగ్యంకు తనింకొకరి మీద ఆధార పడి వున్నానన్న విషయం తేటతెల్లమయింది. ఇన్నాళ్ళూ ఆ తెలివే లేకుండా పోయింది. ఆ ఆధారం కోసమే ఇన్ని అవస్థలు భరిస్తున్నట్టు తోచింది?

ఆధారమంటే..?

కూడు - గూడు - నీడ ... వీటికోసమే .. అవి తనవిగా లేనందునే పరాధీనత... తన కుటుంబం అనుకున్నా అందులో తను పరాయి సరుకు....

ఎందుకో ఆ సందర్భంలో భాగ్యానికి పార్వతమ్మ గుర్తుకు వచ్చింది. పార్వతమ్మకీ తనకీ ఎక్కడెక్కడ సామీప్యమున్నదో... భేదమున్నదో తలచుకొని బతుకునీ అది నడుస్తున్న తీరునీ అంచాన వేసుకుంది.

పార్వతమ్మని పార్వతమ్మ పెనిమిటి కొట్టాడు. తిట్టాడు. కాదు పొమ్మన్నాడు. కాని తిరిగి ఆపెనిమిటి సన్యాశి పార్వతమ్మను వదల్లేదు. పొమ్మన్నా పోలేదు. ఎందుకు పోలేదు? అసలు పొమ్మన మని ఎలా అనగలిగింది?

సంపాదిస్తున్నది కాబట్టే. తన బతుకు తను బతుక గలుగుతున్నది కాబట్టే. తనెవ్వరి మీదా ఆధార పడలేదు కాబట్టే...

కాబట్టి ఎవ్వరికింద ఎన్నాళ్ళని వుండమన్నట్టువుండి బతకడం? ఆ బతుకు బుగ్గయి పోతున్నా బతిమలడ్డం? బతిమలాడితే బతుకులు నిలుస్తాయా? బతుకు భయంలో మరిన్ని ఆలోచనలు భాగ్యాన్ని ముసురుకున్నాయి.

కూరలమ్మే గంగి గుర్తుకొచ్చింది. భర్త వదిలేస్తే బతుకు అయి పోయిందని బోరుమనలేదు. కూరలమ్మి కూడు తింటోంది. గంగి కథ భాగ్యానికి తెలుసు. గంగి ధైర్యం తనకు లేదని పించింది.

పాలు ఇచ్చే రాజమ్మ భర్త చనిపోతే బతకడం మానేసిందా? కొన్నాళ్ళు ఈ కుటుంబం ఏమవుతుందని ఏడ్చినా.. బెంగపడినా.. ఏట్లోకి పోవాల్సిందే కుటుంబం అన్నా... ఆ కుటుంబం చివికి పోయిందా? లేదే?! మరి ఏ ఒక్క మనిషి లేక పోతే మరింకో మనిషికి జీవితమే లేదా?

భాగ్యానికి అరుణక్క గుర్తుకు వచ్చింది. పిల్లలకు పాఠాలు చెప్తూ ఒంటిగా మగ తోడు లేకుండా బతకడం లేదూ? పిల్లలకి చదువు చెప్పినప్పుడు ఆమె ముఖం ఎంతగా వెలుగుతుంది? ఏదో కొత్త

ప్రపంచం తనకొక్క దానికే దక్కినట్టు. బాధలేవ్వు. పిల్లల్ని తీర్చిదిద్దడమే బాధ్యతగా ఎంత హాయిగా వుంటుంది?

ఎందుకో భాగ్యానికి మళ్ళీ పార్వతమ్మ గుర్తొచ్చింది. ఇప్పటి పార్వతమ్మ కాదు. పెనిమిటి పంచన బతికిన పార్వతమ్మ. సన్యాశి సంపాదించిన దినాల్లోని పార్వతమ్మ. అప్పుడు నలుగురూ నవ్వుతారని తెలిసినా, భర్త తన్నులూ గుద్దులూ కాయలేక భయపడి బాధపడి యమయాతన పడి చివరకి వీధిలోపడి. సారాసాపు కెళ్ళి తనే పేకట్లు తీసుకొచ్చేది. పైట చాటున పెట్టి, కొంగు మాటున దాచి తెచ్చేది. చెయ్యని నేరానికి భయపడేది. కాని తాగిన ఆ మగడు ధైర్యంగా కాళ్ళమీద కాళ్ళేసుకు ఇంట్లోనే తాగడం.

ఇప్పుడో ఊరూరా జరిగే సారా ఉద్యమంలో ఆడోళ్ళందరూ ముందుకి వచ్చినట్టే ఇక్కడ పార్వతమ్మా ముందుకు వచ్చింది. అరెష్టు కూడా అయింది. అయినా ఆగదు.

ఎంత మార్పు?

దీనంతటికీ కారణం తన బతుకు తనది కావడమే. పరాయిది కాదు అని అనుకోవడమే...

ఈ బతుకు ఊబిలోంచి తనూ బయట పడాలనుకుంది. ఆలోచించి ఆలోచించి అలిసిపోయిందేమో అలానే నేలన చేరగిలబడిపోయింది. పిల్లని పక్కనే వేసుకుంది. పార్వతమ్మ రాక కోసం ఎదురు చూస్తూనే కునుకుతీసింది.

అప్పటికి అర్ధరాత్రి కావడానికి ఇంకో గంట కాలం పట్టొచ్చు. అప్పుడు శ్రీను తలుపు తోసుకు వచ్చాడు. అటూ ఇటూ చూసి తలుపు వేసాడు. శబ్దమయింది. ఆ శబ్దం భాగ్యానికి నిద్రాభంగం కలిగించలేదు.

శ్రీను దగ్గరగా వెళ్ళి చూసాడు.

భాగ్యం నిద్దట్లోకి జారుకున్నా, నొప్పెట్టిన మనసూ శరీరమూ మూల్గుతూ సేదతీరుతున్నాయి.

నిశ్శబ్దం...

మూలుగు చప్పుడొక్కటే గదంతా వ్యాపించి భయంకరంగా వుంది. శ్రీను వంటగదిలోకి వెళ్ళాడు. ఏదన్నా తిందామని చూసాడు. తిండికి ఏమీ దొరకలేదు. ఆకలిగా వుంది. దాంతో లేని వికారమేదో కలుగుతున్నట్టు అటూ ఇటూ పిచ్చి పట్టినట్టు తిరిగాడు. తిరిగి ఆగాడు.

"భాగ్యం..." పిలిచాడు శ్రీను.

భాగ్యం పలుకలేదు.

"భాగ్యం.. భాగ్యం... " రెండోసారి గట్టిగా పిలిచాడు శ్రీను.

"ఊఁ.." అది మూలుగో, ఊకొట్టడమో ఏమీ అర్థం కాలేదు శ్రీనుకి.

"నిన్నే... లే..." శ్రీను మళ్ళీ పిలిచాడు నిర్లక్ష్యమేమిటన్నట్టు.

"ఊఁ.." భాగ్యం ఈసారి పలికింది.

"లెమ్మంటుంటే.." శ్రీను గొంతులో చిరాకువుంది. పిల్ల ఆదమరచి నిద్రపోతున్నది. నిశ్శబ్దం నిలువెల్లా పరచుకోవడం వల్ల గొంతు పెరిగితే చాలు, పెద్ద అరుపులా వుంది.

భాగ్యంకు ఏమర్థమయిందో గాని ..." ఇప్పుడొద్దు... నాకు ఓపికలేదు..." అంది. అలా అనడంలో గొంతులో సత్తువలేనట్లేవుంది. శ్రీను వంగి భాగ్యాన్ని కుదిపాడు. భాగ్యం ఆవులిస్తూ "ఏమిటి చెప్పు" అడిగి, తిరిగి కళ్ళు మూసుకుంది.

శ్రీనుకీదఫా కోపమొచ్చింది.

"లేమ్మంటే నీక్కాదా? మనిషివి కావా" ఆ అడగడంలో అధి కారముంది. అజమాయిషీ వుంది. తిరుగులేని తనం వుంది. అయితే ఆ గొంతుకు ఉలిక్కి పడుతూ నిద్దట్లోని పిల్ల కదిలింది. అలా కదలడాన్ని భాగ్యం గుర్తించింది. అందుకే బిడ్డని జోకొడుతూ మళ్ళీ అంది.

"శ్రీనూ.. నాకు ఓపికలేదు వదిలెయ్యి.." భాగ్యం గొంతులో బతిమలాడే తత్వం వుంది. కళ్ళతో కూడా అదే జవాబు చెప్పింది. పిల్లదెక్కడ కదిలిపోతుందోనని ఆమె బెంగ పడుతున్నట్టుంది.

"ఏం నీకిష్టమయినపుడేగాని నాకిష్టమయినపుడొద్దా...? అంటే ఏమిటి నీ ఉద్దేశం? నువ్వు పిలిస్తే రావడానికి వద్దంటే పోవడానికి నీ కంటికి నేనెలా కని పిస్తున్నాను.." నిష్ఠూరంతో శ్రీను గొంతు నిండివుంది.

భాగ్యంకు ఇంకేం మాట్లాడాలో, ఎలా చెప్పాలో తెలియడంలేదు. శ్రీను గొడవ చేస్తాడని లేచి కూర్చుంది.

"భాగ్యం రా.." శ్రీను మంచం వేపు చూసాడు.

"చెపితే అర్థం కాదా?!" భాగ్యం చాలా సహనంతో చెప్పింది.

"రమ్మంటుంటే.." శ్రీను భాగ్యం చెయ్యి పట్టుకు లాగాడు. భాగ్యం లాగుతున్న చేతిని విడిపించుకొని, విసిరి కొట్టింది. దాంతో శ్రీను అహం దెబ్బ తిన్నదేమోగాని మరింత బలంగా చెయ్యిపట్టి లాగి ఈడ్చాడు. భాగ్యం చేసేదిలేక నిల్చుంది. కాని మంచం ఎక్కడానికి ఇష్టపడక ప్రతిఘటించింది.

శ్రీను మళ్ళీ ప్రయత్నంగా భాగ్యాన్ని మంచం వేపు తోసాడు. భాగ్యం అడ్డుకున్నదే కాని, పిల్లలేచి పోతుందని పెనుగులాడలేదు.

అప్పటికే పిల్ల పడుకున్న చోటులోనే అటూ ఇటూ దొర్లుతోంది.

శ్రీనుకు పట్టరానంత కోపం వచ్చింది. దాంతో పూనకం వచ్చినట్టు దూకుడుగా వచ్చి తనరెండు చేతుల్తో అమాంతం భాగ్యాన్ని ఎత్తుకొన్నాడు ఎత్తి చిన్నపిల్లల్ని పడేసి నట్టు మంచం మీద పడేసాడు. క్షణాల్లో తను వెళ్ళి మీద పడ్డాడు. పైటను లాగేసి చీరకుచ్చిళ్ళను గుంజుతుంటే భాగ్యం మళ్ళీ సర్దుకొని కప్పుకొనే ప్రయత్నం చేస్తోంది.

"భాగ్యం.." అలా అవడంలో శ్రీను గొంతులో మునుపటిలా అభ్యర్ధన లేదు. విసుగుతో కూడిన కోపం.. పళ్ళ బిగువ నుండి బిగబట్టిన పిలుపది.

"శ్రీను దయ చేసి వదిలెయ్యి, నన్నొదిలెయ్యి... నా వంట్లో బాగోలేదు. మనసూ బాగోలేదు..." భాగ్యం బ్రతిమలాడ్డం పూర్తి కాలేదు. శ్రీను ఆమెనోటిని ఒక అరచేత్తో మూసేస్తూ, మరో చేత్తో ఫేంట్ జేబులోంచి మందు సీసాలేపాడు.

"ఇదేంటి?" భాగ్యం గొంతు దాటి మాటరాకుండా శ్రీను చెయ్యి అడ్డంపడివుంది.

"దాఁ.. లెగు... కొద్దిగ వేస్కో చీప్ కాదు... బ్రాందీ.. ఇది వేసుకుంటే అన్నీ బాగుంటాయ్.. అన్ని నొప్పులూ పోతాయి.. ఎక్కువసేపు వుండొచ్చు.." శ్రీను తన గొంతులో రెండు బుక్కళ్ళు పోసుకున్నాడు. భాగ్యం నోటిలో పెట్టి సీసాతో పోయబోయాడు.

"వద్దు.. వద్దు" బ్రతిమలాడుతోంది భాగ్యం.

'ఫరవాలేదు ... వేస్కో..' శ్రీను తనన్నమాటే కానిచ్చు కోవడానికి బలవంతంగా నోటిలో సీసామూతిని కుక్కి వంపాడు.

భాగ్యం తడబడి ఒక గుక్కెడు మింగినా, మరోగుక్కెడు నోట్లోవున్నది శ్రీను ముఖం మీదకు వూసింది. శ్రీను నవ్వుతూ భాగ్యం చీరకే తుడి చేసాడు. మీదకు ఎగ బాకుతున్నాడు.

"శ్రీనూ.. ఆయన వున్నారు... ఇప్పటికే మా ఇంట్లో పరిస్థితులు బాగోలేవు.. వద్దు.. ఆయనొస్తారు.. " లేని సహనాన్ని కూడదీసుకొని

అంది. అలా అనడంలో గుండెల్లో వేదననంతా గొంతు పలికింది. మరోసారయితే గొంతు పెంచేదే, కాని శ్రీనూ అరుస్తాడని తెలుసు. దాంతో ఇరుగూ పొరుగూ వింటారు. వాళ్ళకి తెలియనిదని కాదు. మరోదఫా వీధిలో పడ్డం ఎందుకు అనే ఆలోచిస్తోంది. ఈ సడింపుతోనూ అసహ్యంతోనూ చూసే ఇరుగూ పొరుగూ చూపులు గుర్తుకొచ్చాయి

శ్రీను ఆగిపోయాడు.

భాగ్యం ఊపిరి పీల్చుకుంటూ చీరను సర్దుకుంది.

మళ్ళీ నిశ్శబ్దం చేస్తున్న శబ్దం...

"..భాగ్యం ఓ రొండొందలుంటే ఇవ్వు..."

ఆ మాటకు భాగ్యం ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే ఎన్నో దపాలు అవసరమైనపుడు కానపడూ అడిగినపుడల్లా వున్నంతలో ఇచ్చేది. ఇప్పుడు నిజంగానే లేవు. ఇంట్లో బియ్యం గింజలు పప్పులూ ఉప్పులూ. ఏవీ ఇన్నాళ్ళంతా రేషనూ లేదు. అలాంటిది డబ్బులు ఎక్కన్నుంచి వస్తాయి? ఇన్నాళ్ళు అమానాన్న వచ్చినపుడు భాగ్యం ఇదమ్మా' అంటూ వందో ఎంతోకంత ఇచ్చేవారు. ఇప్పుడు రావడంలేదు. ఇవ్వడం లేదు.

"నా దగ్గరిప్పుడ్లేవు.. అయినా ఎందుకు?" భాగ్యం అడిగింది.

శ్రీను తొనక్కుండానే చెప్పాడు.

"నువ్విప్పుకోవడం లేదు కదా?, ఇంకో దగ్గరికి వెళతాను"

భాగ్యం తులుక్కుపడింది. శ్రీను తెగువకు ఆశ్చర్యం కంటే అసహ్యమే ఎక్కువ కలిగింది. నోట మాట కూడా రావడం లేదు.

"భాగ్యం వేగం పట్రా.. వెళ్ళు... హుఁ.." అని విసుక్కుంటూ భాగ్యాన్ని మంచం మీది నుండి ఈ సారి కిందికి తోసాడు శ్రీను. భాగ్యం నేలకు గుద్దుకోబోయి రెండు చేతులతో అనుకుంది. లేపోతే తల చిట్లిపోయేది.

"నిన్నే.. వినపడ్డం లేదా?"

"నా దగ్గర్లేవు"

"నాకు తెలీదు ఏం చేస్తావో!?.."

"వున్నప్పుడు నీకిచ్చేదాన్ని మర్చిపోయావా?" భాగ్యం మాటకు శ్రీను తలెత్తి కూడా చూడడం లేదు.

"ఇపుడు అవసరం వుంది, ఇవ్వు.."

"ఏమవసరం? ప్రాణం పోయేలా మాట్లాడుతావేం?"

"నువ్విప్పుకోవు గదా?!, అందుకే ఇంకోదాని దగ్గర కెళ్తా.."

సిగ్గు, బిడియం, అభిమానం ఏమీ ఆ అబ్బాయి ముఖంలో కనపడలేదు భాగ్యానికి. కోపం పట్టలేక పోతూవున్నా "నువ్విక్కన్నుంచి వెళ్ళు..." అని మాత్రమే అనగలిగింది.

"ఇవ్వందే కదల్ను" మొండిగా అన్నాడు శ్రీను.

"ఇక్కడ నువ్వు దాసి పెట్టిన వేం లేవు ఇవ్వడానికి" భాగ్యం అనేసింది. ఆ మాటకు శ్రీను షాకయినట్లే వున్నాడు.

"ఏంటే.. పేలుతున్నావ్?" శ్రీను మంచం దిగి, మీదకొచ్చాడు. భాగ్యం ఆ సమయంలో శ్రీన్ను చూసి భయపడలేదు. బిత్తర పోలేదు. పిల్లని కూడా పట్టించుకోలేదు. అందుకే పెద్దగొంతుతో అంది.

"నేను కాదు, నువ్వే పేలుతున్నావ్ నోటికొచ్చినట్టు.. ఫో.. ఫోఁ.. వెళ్ళిక్కన్నుంచి..."

శ్రీను భాగ్యం జుట్టు అందుకొని ముందుకు తోసాడు. అసలే బలహీనంగా వుండేమో, భాగ్యం దబ్బున నేలమీద పడింది. అయినా అతి కష్టం మీద నిలబడింది. తట్టుకోలేక పోయింది.

"ఒరేయ్.. ఎవడివిరా నువ్వు? నా వంటి మీద చెయ్యి వెయ్యడానికి?, దరిద్రుడా ఫోఁ. పోరా" భాగ్యం గొంతు హెచ్చింది. కాని శ్రీను ఆగలేదు. గభాల్న వెళ్ళి ఆమె నడుం మీద తన్నాడు. భాగ్యం మళ్ళీనేల మీద బొర్లా పడింది. అంతటితో ఆగక, ఆమె జుత్తు పట్టుకు లేపి కడుపులో దబ్బు దబ్బున కాలితోనేతన్నాడు. భాగ్యం ఆ దెబ్బలకు తాళ్లేక మెలికలు తిరిగి పోయింది. వుండలా ఉమ్మ చుట్టుకు పోయింది. ఊపిరాడ్డం కష్టంగా వుంది. పిల్ల ఈ గోలాగొల్లుకు నిద్రలేచి పోయి ఏడుపందుకుంది.

"నీవు నన్ను 'రా' అంటావా.. రా" శ్రీనుకు గొంతునిండా కసివుంది.

అంతటి విపత్కర పరిస్థితుల్లో కూడా భాగ్యానికి గతంలోని, శ్రీను గుర్తుకొచ్చాడు. భాగ్యమక్కా' అని పలికేనాటి శ్రీను. ఆనాళ్ళలో అయితే భాగ్యం శ్రీనుని "ఒరే శ్రీనూ.. ఒరే బాబూ' అని సంబోధించేది. 'అది పటోరాబాబు, వెళ్ళరా, రారా" అని చెప్పేది. అనేది. 'భాగ్యమక్క' నుండి 'భాగ్యం'గా శ్రీను తనపిలుపుని మార్చుకున్నాక 'రా' అనవద్దన్నాడు. అలా అంటే ఏదో చిన్నతనంగా వుంటున్నదని చెప్పాడు. తాను మాత్రం 'ఒలే.. బాగ్గీ.. లంజా.. లఖ్మీ... ఎప్పుడు ఏ రకంగా పిలిచాడో ఏయే సందర్భాలలో పిలిచాడో భాగ్యానికి తెలుసు.

"నీవు నన్ను' 'రా' అంటావా.. 'రా'..." శ్రీను మళ్ళీ మండి పడిపోతూ మరోసారి భాగ్యం కడుపుమీద కాలితో తన్నాడు. భాగ్యానికున్న సముద్రమంత సహనమూ నశించిపోతోంది.

శ్రీను ఈదఫా భాగ్యం గడ్డాన్నితన అరచేతితో ఎత్తి చేతి వేళ్ళ మధ్య పట్టి, బలంగా నొక్కేస్తున్నాడు. పళ్ళు కదిలి పోతున్నట్టే వున్నాయి. బాధ క్షణక్షణానికీ రెట్టింపవుతోంది. ఎదురుగా వున్న నిలువుటద్దంలో అదే దృశ్యాన్ని భాగ్యం చూసుకుంది. ముందరి పన్ను విరిగి పోయి వుండడం గతాన్ని గుర్తు చేసింది. ఒక పన్ను వూడి, క్రమపద్ధతి లేని పలువరస వికృతంగా కనిపిస్తోంది. అందుకు కారణమైన శ్రీను మళ్ళీ పనికి పూనుకుంటూ వుంటే అచేతనం కాలేక పోయింది. ఇంకా శాంతిస్తే పీక నులిమి చంపేస్తాడు. తిరుగు బాటు తప్పనిసరి. భాగ్యం శరీరం అందుకు సిద్ధంగా వుంది. అంచేతనే అణచి వేస్తున్న చేతిని నెమ్మదిగా కదిలించి, చెయ్యి వదలడం తోనే చట్టుక్కున కరిచేసింది.

'అమ్మాఁ...' అరుపు. అరుస్తూనే శ్రీను భాగ్యాన్ని వదిలేసి చెయ్యిని చూసుకున్నాడు. పంటిగాట్లు వంకర గీతలయినా గుండ్రని ఆకారంతో చూడ్డానికి ముద్రకొట్టినట్టు వాచి లాగున్నాయి.

"భాగ్యం లఖ్మీ.." శ్రీను మృగంలా లేచాడు.

తలుపు చప్పుడవుతూ తెరుచుకుంది.

శ్రీను తిరిగి చూసాడు.

భాగ్యంతలెత్తి చూసింది.

నారాయణ్రావ్!

నారాయణ్రావుని చూసి శ్రీను ఆగిపోలేదు. కోపాన్ని ఉక్రోషాన్ని దిగమింగుకోలే పోయాడు. అది సమయం కాదని కూడా ఆలోచించ లేకపోయాడు. ఎత్తిన పగడ దించిన త్రాచులా బిగించిన పిడికిలి మరింత బిగబట్టి భాగ్యం ముఖం మీద గుద్దాడు. ఆ గుద్దుకు భాగ్యం 'అమ్మాః..' అరచి అరచేతి వేళ్ళతో ముక్కు మూసుకొని, నోరు తడుముకుంది.

చల్లని ఎర్రని రక్తం బొడబొడమని...

శ్రీను అక్కడ్నుంచి అడుగు తీసాడు. పిల్ల ఏడుస్తూనే వుంది. శ్రీను అడుగు తీసి అడుగు వేస్తూ నారాయణ్రావు పక్కనుండే దాటి పోయాడు. అలా దాటుతున్న క్షణంలో నారాయణ్రావు శ్రీను ఒకరి ముఖాలోకరు చూసుకోవడం భాగ్యం చూసింది. ఆ క్షణంలో 'ప్రళయం' ముంచుకు రావాల్సింది పోయి'ప్రశాంతం' ఏర్పడడం విచిత్రాల్లో కెల్లా విచిత్రమే

కాదు, భాగ్యానికి ఊహకందకుండా వుంది.

శ్రీను ఇల్లుదాటి పోయాక నారాయణ్రావు నిలబడ్డ చోటు నుండి రెండు మూడడుగులు ముందుకేసి భాగ్యం ముఖంలోకి చూసాడు. భాగ్యమూ అన్నీ జరిగిపోయాక ఇంక తలరించుకొని ప్రయోజనం లేదన్నట్టుగా తలఎత్తి అలానే చూసింది. ఇద్దరి చూపులు కలసి కొన్ని క్షణాలు గడిచాయి.

భాగ్యం ముఖంలోని ఇదీ అని చెప్పలేని దుఃఖమేదో గూడుకట్టుకొని వుండడం నారాయణ్రావు చూసాడు. అయితే అలా చూస్తున్నప్పుడు నారాయణ్రావు ముఖంలో ఏదో ఆనందం.. తెలియనిదేదో తృప్తి ఆ కళ్ళలో కదలాడ్డం భాగ్యం గమనించక పోలేదు.

సేదతీరి కుదుట పడుతున్న ఆ కళ్ళలోని రహస్యం బహిరంగంగానే భాగ్యానికి బోధ పడుతున్నది. అలా బోధ పడుతున్నకొలదీ ఇంకేదో బోధపడుతున్నది. అందుకు సాక్ష్యంగా దాచుకోలేని నారాయణ్రావు నవ్వు...! గుంబనంగా వున్నా గుండెలు పగిలేలా వున్నదా నవ్వు..!

భాగ్యం మరి చూడలేక పోయింది. చూపుని కలిపి నిలుపలేకపోయింది. శ్రీను కొట్టిన దెబ్బలు కంటే నారాయణ్రావు చూపులే మరింత బాధిస్తున్నాయి. నొప్పి పెడుతున్నాయి. శ్రీను శరీరానికి గాయం చేస్తే నారాయణ్రావు మనసుకి గాయం చేస్తున్నాడు.

శ్రీను బలంగా గుద్ది వెళ్ళి పోతున్నప్పుడు పొందిన తృప్తి..

నారాయణ్రావు దగ్గరగా చూస్తున్నప్పుడు పొందిన తృప్తి..

రెండూ ఒక్కటే!

ఇద్దరికీ శత్రువయిందా?

ఉమ్మడి శత్రువయిందా?

భాగ్యం ముందు అనేక ప్రశ్నలు. జవాబులు దొరుకుతున్నా పట్టుకుదొరకని జవాబులు. అనేక ఆలోచనలు. అంతూ పొంతూలేని ఆలోచనలు. వీటన్నింటితో భాగ్యం కళ్ళముందు దృశ్యం మసక కమ్మినట్టు అగుపించకుండా వుంది. అయితే మసక వెనుక, మనసు వెనుక మబ్బుతొలగిపోయినట్టు గతంలోని విషయాలేవో ఆమెలో సుళ్ళు తిరుగుతున్నాయి. ఒక్కటొక్కటీ కదలాడు తున్నాయి.

'జానకి' మీద నారాయణ్రావు దాడికి ముందు పది పదిహేను రోజుల కాలంలోనే శ్రీనుకీ ఆయనకి అంతవరకూ లేని నేస్తరికం కుదిరింది. అది ఎక్కడకు తీసుకుపోతుందోనని భాగ్యం భయపడుతూనే వుండేది..

"దాదాఁ.. కుర్చో శ్రీను.. కనిపించడం మానేసావ్?" నారాయణ్రావు ఆహ్వానం.

"లేదండి వస్తూనే వున్నాను...' శ్రీను జవాబు.

"నేనులైను వెళ్ళినప్పుడు గట్రా వచ్చుంటావ్...' ఆ మాట అని, నారాయణ్రావు భాగ్యం వంక చూసేవాడు. భాగ్యం విననట్టుగా అటూ ఇటూతిరిగితే 'భాగ్యం టీ' 'భాగ్యం మంచినీళ్ళు' 'భాగ్యం టేబ్ లెట్' - అనేసి పిలిచి మరి, దగ్గరున్నప్పుడే ఆమాట అనేవాడు..

"నేనున్నప్పుడు రాకపోయుంటావ్, వస్తే ఎందుకడుగుతాను.." శ్రీనుని ఇరుకున పెట్టినట్టు మాటాడినా .. నారాయణ్రావు మీద శ్రీను కోపం తెచ్చుకొనేవాడుకాదు.

నారాయణ్రా వెప్పుడూ మౌనంగా వున్నా, అప్పుడప్పుడూ మాట్లాడే వాడు. మాట్లాడితే గనక అంతూ పొంతూ వుండేది కాదు. ఏమిటి మాట్లాడుతున్నామన్న జ్ఞానమూ వుండేది కాదు.

శ్రీను కూడా అంతకు మునుపే భాగ్యంతో తన కార్యం నెరవేర్చు కోపోతే, అవసరమైనవి పొందకపోతే ఇంటికి వచ్చినా మాటాడే వాడుకాదు. భాగ్యం పిలిస్తే పలికే వాడు కాదు. మంచిగా వున్నప్పుడు కూడా అకతాయితనానికో మరిదేనికో అలానే ప్రవర్తించేవాడు.

"శ్రీనూ.. మీ అమ్మనో సారి రమ్మను.." భాగ్యం చెప్పేది, కాని శ్రీనుకి అవసరమైనప్పుడు వచ్చిన చెవుడులా వుండేది. వినిపించేది కాదు.

'మీ అమ్మ పన్లో కెళ్ళిందా, వస్తే రమ్మను బోలెడన్నం వుండి పోయింది" భాగ్యం ఏగొడకో తలుపులకో చెప్పుకున్నట్టే.

"రమణ గారి అమ్మాయి పెళ్ళికి, భోజనాలకు అమ్మ వెళ్తోందా?' ' దేనికయినా అంతే. అవసరం వున్నా అంతే.

భాగ్యం గొంతు దండగయేది.

ఆయాసందర్భాలలో నారాయణ్రావు శ్రీనుని "ఏమయ్యా శ్రీనూ మీ ఆంటీ పిలుస్తుంటే పలకవేమయ్యా.." అనేవాడు.

"ఏంలేదు.."

"అదేమిటయ్యా అది?" నారాయణ్రావు మళ్ళీ అడిగేవాడు. ఆ సమాధానం కోసమే చూస్తున్నట్టు.

"అఁ.. ఆడవాళ్ళతో మనకేం పనండి? మనం మనం మగవాళ్ళం మనకి బోలెడు విషయాలు. మీరేదో చెప్పండి.. వాళ్ళ మాటకేం?!' ఏమీ కానట్టు శ్రీను తీసిపారేసి మటాడేవాడు.

"నిజమే, మరలాగయితే నువ్వే చెప్పు..." నారాయణ్రావు ఆనందానికి అవధులుండేవి కావు.

భాగ్యంకు ఈ తతంగమంతా పిచ్చెక్కించేది. కావాలని చేస్తున్నట్టు తోచేది. దాంతో మింగలేక కక్కలేక వంటపాత్రల మీద చూపించేది. ఆశబ్దాలు విన్నాక మరింత గొంతుపెంచి నారాయణ్రావనే వాడు.

"సంగీతం బాగుందోయ్.."

"నిజమేనండి..."

ఇద్దరూ వంటగదిలోకి భాగ్యం కేసి చూస్తూ మరీ అనేవారు. వినకపోతే అదే సంభాషణ మళ్ళీ మళ్ళీ. వాళ్ళలా అన్నిసార్లు అనడంలో ఇద్దరికీ కావలసిందేదో, తీరవలసిందేదో జరుగుతున్నట్లు భాగ్యంకు అర్థమయేది.

గడిచిన క్షణాన్ని తడుముతున్న భాగ్యం - గడియకో గడియకో గడపదాటనున్న నారాయణ్రావుని గమనించలేదు. అలా గమనించక పోవడాన్ని నారాయణ్రావే గుర్తించి నూటొకేసుని రెండుసార్లు జారవిడిచాడు. ఆ శబ్దానికి మసకపోయి ఎదురుగా జరుగుతున్న దృశ్యమేమిటో భాగ్యం గమనించింది.

"ఎక్కడికి?" భాగ్యం అడగకూడదంటూనే అడిగింది.

"ఎక్కడికయితేం? నువ్వు ప్రతిది చెప్పే చేస్తున్నావా? నేను నీకు చెప్పడానికి!? పుట్టింటికో కాట్లోకో ఎక్కడికో నువ్వు' ఎలాగా పోవుకదా? నేనే పోతున్న. కట్నకానుకలిచ్చే ఇంతమంది మొగుళ్ళుండగా, నేను దేనికి?" గొంతు నిండా వ్యంగాన్ని నింపుకున్న నారాయణ్రావు తనదారి సిద్ధమైపోయినట్లు బూట్లుని నేలకేసి తన్ని, దుమ్ము దులుపు కున్నాడు.

ద్వారం దాటబోతూ ఆగాడు

భాగ్యం వెళ్ళి కాళ్ళ మీద పడిపోలేదు. మునుపటిలా ఏడ్వలేదు. నువ్వులేక పోతే నాజీవితమే లేదు, ఎలాగ? అని బోరుమని ఎడ్చి, సర్వం కోల్పోయినట్టు రక్షించుమన్నట్టు చేతులు చాచలేదు.

ఆగిన నారాయణ్రావు అటుఎటో చూస్తూ అన్నాడు.

".... నేను మళోస్తాను. ఈ లగేజి అంతా తీసుకుపోతాను. ఈరెండ్రోజుల్లోనే. ఇది రైల్వే ఇల్లు. నీకు రైల్వే మొగుడెవరయినా వుంటే మటుకు వుండొచ్చును..."

నారాయణ్రావు ఆ మాటలన్నాక మాయమైపోయాడు.

భాగ్యం ఏడుద్దామన్నా ఏడుపురాలేదు. గుండె గడ్డకట్టుకు పోయినట్లేవుంది. గాయాలతో వాటి సలుపుతో మొద్దుబారినట్టేవుంది. మొద్దుబారినట్లేవుంది.

ఆ రాత్రంతా ఆకలితోనూ నీరసంతోనూ భాగ్యం వుండిపోయింది. పార్వతమ్మకు కబురు పంపితే చిన్నోళ్ళిద్దర్నీ తీసుకొని ఊరెళ్ళిందని తెలిసింది. ఇంత అర్థాంతరంగా ఊరెందుకు వెళ్ళాల్సి వచ్చిందో భాగ్యానికి తెలియలేదు. రాత్రంతా భాగ్యం కోసం ఎదురుచూస్తూనే గడిచింది.

తెల్లవారింది.

పిల్ల వళ్ళు కాలిపోతోంది. భాగ్యం పిల్ల తలమీద తడిగుడ్డ వేసి చెయ్యవలసిన పరిచర్యలన్నీ చేస్తూనేవుంది.

అదే సమయానికి పార్వతమ్మ కూడా వచ్చింది.

పార్వతమ్మను చూడ్డంతోనే అంతవరకు గడ్డకట్టుకుపోయిన భాగ్యం మంచు ముద్దలా కరిగిపోయింది. చేతిలో పిలనుంచుకొనే, తను మరో చిన్నపిల్లలా పార్వతమ్మను చుట్టేసింది భాగ్యం. పార్వతమ్మ ఒడిలో తలదించేసి వెక్కి వెక్కి ఏడ్చిన భాగ్యాన్ని, ఆ వుదృతాన్ని ఆపలేకపోయింది. అలా కొంతసేపు గడిచాక, కన్నీరు ఆరిపోయాకగాని భాగ్యం జరిగిన విషయాన్ని చెప్పలేకపోయింది.

పార్వతమ్మకు కూడా ఆ సమయంలో ఏమని సముదాయించాలో అర్థంకాలేదు. తలమీద చెయ్యివేసి నిమిరింది. కొద్దిసేపు గడిచాక, రాత్రినుండి ఆకలితో వున్న భాగ్యానికి టీ 'మరగబెట్టి ఇచ్చింది'. 'డాక్టరికి చూపించుకొస్తా' నని చెప్పి పిల్లని తీసుకొని పార్వతమ్మ వెళ్ళి, ఒక గంటలో తిరిగివచ్చింది. అప్పటికే పడుకున్న పిల్లని మంచం మీద వేసింది.

భాగ్యం ఇంకా అలానే వుండడంతో, కూలబడ్డ చోటునుండి లేవకపోవడంతో "లెగమ్మా ... లెగు లెగిసి మొకమయినా కడుక్కో లెగు... తరువాత చీర మార్చుకో".. అంటూ పార్వతమ్మ లేపింది. బీరువాలోంచి చీరతీసి దండెంమీద వేసింది.

భాగ్యం అతికష్టం మీద లేచి ముఖం కడుక్కొచ్చింది. చీర మార్చుకోవడానికని వంటిమీద వున్న చీర విప్పింది.

పార్వతమ్మ దృష్టి భాగ్యం మీదేవుంది.

భాగ్యం వంటిమీద దెబ్బలకు చర్మం కమిలిపోయి ఎర్రగా వుంది. వీపు, నడుము, పొట్ట, రొమ్ముల పక్క భాగాలు ఇంకా ముఖం... ముక్కూ.. పెదాలూ... ఒకచోట కాదు, ఎక్కడబడితే అక్కడ. పాత గాయాలు మానిపోకుండానే కొత్తగాయాలు...

పార్వతమ్మ గుండె తరుక్కుపోయింది.

"... ఈడి బుర్ర పడిపోతే:.. ఈ శీను గండడికి ఇంత పొయేకాలమా? ఆ ముష్టి గులాముకి ఏటి పట్టింది? ఇంతమందికి చావొస్తంది, ఈడికి రాదేమి? బగవంతుడు బద్దలయిపోయిన బగవంతుడు, వుంటే ఎక్కడ చస్తన్నాడు?" పార్వతమ్మ తనలో తనే తిట్టుకుంటున్నా పెదవిదాటి వినిపిస్తున్నాయి.

భాగ్యం పార్వతమ్మ వేపు చూసింది. పార్వతమ్మ కళ్ళన్నీ తన గాయాలపై నిలిపివుంచడం భాగ్యం చూసింది. చీరచుట్టుకొని దగ్గరగా వస్తున్న భాగ్యం కళ్ళలో కళ్ళు నిలిపింది పార్వతమ్మ.

ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు.

అన్నీ అర్థమై ఇంక మాట్లాడడానికి ఏ విషయమూ లేనట్టు మౌనంగా వుండిపోయారు. మళ్ళీ నిశ్శబ్దం దొరికినట్టు గూడుకట్టుకుంది.

అలాగ చాలాసేపు గడిచాక 'నాకు ఇల్లులేదు, ఇల్లుకావాలి' భాగ్యం అంది. భాగ్యం మాటకు బదులివ్వలేదు పార్వతమ్మ.

భాగ్యం అలానే నేలన కూలబడిపోయింది.

పార్వతమ్మ ధైర్యం చెప్పడానికయినా ఊహించనిది అవడంవల్లనేమో ఆమెకి కాళ్ళూచేతులాడ్డంలేదు.

మళ్ళీ కొద్దిసేపు నిశ్శబ్దమే అనట్టింట పాకింది.

"... మీ అమ్మా అయ్యలకో... మీ పెళ్ళి పెద్దలకో చెప్తే...?" ఆ మాట తనకే రుచించకపోయినా ఏదో ఒకటి చేయాలన్న తాపత్రయం కొద్దీ పార్వతమ్మ అంది.

'కూలిపోకముందేగాని కూలిపోయిన గోడల్నెవరూ నిలబెట్టలేరు' అని అనుకుంది. అయిష్టంగా వున్న పెనిమిటి భార్యాల్ని ఎవ్వరూ కలపలేరు. బలవంతం చేసినా కొన్నాళ్ళే. బతుకంటే కొన్నాళ్ళతో గడిచిపోదు, తీరిపోదు, వల్లకాదు' అనికూడా పార్వతమ్మ అనుకుంది.

భాగ్యం మౌనంగా వున్నా, ఆలోచనలు మాత్రం అతలాకుతల మవుతున్నాయి.

'చెడిన ఆడకూతురని అయిన వాళ్ళెవరూ అక్కరకు చేర్చుకోరు. పైగా మగవాడి మాటెలా వున్నా - నీతి (?) తప్పిన ఆడదాన్ని మటుకు ఏ పెద్దలూ సహించి ఏలుకొమ్మని నీతి చెప్పరు. 'లోకంతోటే మనమూ' - అనుకున్న అమ్మానాన్నలు అందుకు అతీతులూకారు' - ఇవే ఇలాంటివేవో ఆలోచనలతో వున్న భాగ్యానికి నారాయణ్రావుతో మళ్ళీ తన కాపురాన్ని ఊహించలేకపోయింది.

అప్పటికే సూర్యుడు నడినెత్తి కొచ్చారు.

ఆకలీ వచ్చింది. వాళ్ళ కడుపుల్లో కలియదిరుగుతోంది. పార్వతమ్మ లేచి వేళ్ళి అన్నం పెడదామనుకుంది. బియ్యం నిండుకున్నాం. రేషనంతా అంతే.... భాగ్యం ఏదో చెప్పాలనుకున్నా చెప్పలేకపోయింది. చెప్పకపోయినా పార్వతమ్మకేదో అర్థమైంది.

"నువ్వుండు నేనోదఫా ఇంటికెళ్ళొస్తా"... భాగ్యంతో అంది పార్వతమ్మ.

భాగ్యం తలవూపలేదు, ఊరుకొనేవుంది.

పార్వతమ్మ వెళుతున్నదల్లా ఆగి ... "అమ్మా..! భాగ్యం ఏదయితే అదే అయింది. దేని గురించీ బెంగ పడక. మగమనిషి లేకపోతే బతుకే లేదనుకుంటాదిఆడళ్ళజాతి. అంతమాత్రానికే అయితే ఈ పాటికి ఆడజలమ్మూ అంతమయిపోవాలి. మేస్త్రీ పాపాయమ్మ, గేదలోళ్ళ రాజమ్మ, కూరల గంగమ్మ, నాతోటి పన్లో కొచ్చిన లచ్చుమ్మ, కాంతమ్మ.... ఇంక మేస్త్రీ పని చేసిన అరుణక్క.... ఈలంతాగాని బతకడం మానేసినారా? ఇక్కడ పట్నంలో ఇంతే ... మన పల్లెలంటా ఇంతే.. ఏం కసవూడ్చో.. పొలం పనిసేసుకొనో ఏదో ఒకటి చేసి బతికి నోళ్ళెంత మందిలేరు? ఒక్కొక్కలున్నోళ్ళూ.... గంపడంత సంసానమున్నోళ్ళూ అలాగే గడుపుకొస్తున్నారు. నాకూ ఒక మగమనిషి వున్నాడనే గాని ఆడివల్ల బువ్వబుక్కింది లేదు. బట్ట కట్టింది లేదు. బాగుపడిందీ లేదు. మన రెక్కళ్ళ సత్తువుంది. అదున్నంత కాలం అన్నమున్నాది, కడుపుకింత గెంజున్నాది, కంటికింత నిద్దరా వున్నాది.." చెప్పింది. చెప్పాక రొండు నిమిషాలు ఏదో జీర్ణం కానట్టు, దిగమింగుకోలేనట్టు అలాగే భాగ్యం కేసి చూసింది. తర్వాత మళ్ళీ అంది.

"... ఇప్పుడు నీకొక సలుసున్నాది. అది పెరగాల. దానికోసమైనా రైపాయాలు పడిబతకాలని అనలేను. ఎందుకంటే నా పిల్లల్ని చూస్కాక నాకదీ తీరిపోయింది. ఏది ఏమయినా ముందల మనకోసం మనం బతకాల. పెనిమిటి పెళ్ళాలు పేమగ వున్నంత కాలం పరవాలేదు. అదిలేకపోతే ఇంకా అలకాలకాడే పడుంటే దానంత దాసీతనం మరొకటి లేదు..." పార్వతమ్మ భాగ్యానికి ధైర్యం చెప్పాలని.

తనజీవితంలో అనుభవంలోకి వచ్చిన వాట్నే చెప్పింది.

భాగ్యంకు ఆ మాటల్లో ఏదో వెతుకుతున్నది దొరికినట్టయి తృప్తిగనిపించింది. పార్వతమ్మ చెప్పే పద్ధతికో ముచ్చటేసింది. అలాగే కళ్ళు నిలిపింది.

"భాగ్యం నేనెళ్ళి అన్నం పట్టుకొస్తానుండు. ఊర్నుండొచ్చి, ఇదే వచ్చేసాను. ఇంటికాడ పనులు తెముల్చకొని కొద్దిగ లేటయినా వచ్చినా... ఎంచేవు?" అంది పార్వతమ్మ వెళ్ళడానికి సిద్ధమైనట్టు.

ఏదో స్ఫురణకొచ్చిందాన్లా భాగ్యం అడిగింది.

"రాత్రికి రాత్రి ఊరెందుకెళ్ళావ్?"

"తరువాత చెప్తాను. వెళ్ళి బేగి వస్తానుండు.." పార్వతమ్మ పరుగులాంటి నడకతో గబగబా అడుగులేసి వెళ్ళిపోయింది.

పార్వతమ్మ వెళ్ళినవైపే చూస్తూ అలాగే భాగ్యం చాలాసేపు వుండిపోయింది. ఎండెకో మెదడంతా ఖాళీ అయిపోయినట్టయి ఏదో ఆవహించినట్టయి కునుకులో దిగింది. ఆకలి, నీరసం, అలసట... అన్నీ కలిపి అప్పటికప్పుడే కుమ్మేసి మరీ కమ్ముకొస్తే బిడ్డ పక్కనే మంచం మీద చేరగిల బడింది. అలా చేరగిలబడ్డంతోనే నిద్ర పట్టేసింది. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు, పిల్ల ఏడుపుతో తులుక్కుపడిలేచింది. ఎక్కడున్నానా? అనుకుంది, ఏదో ప్రపంచంలో వున్నట్టనిపించింది.

దాటాల్సిన సముద్రమేదో ఇంకా దాటనట్టే భాగ్యం గుండె, ఇదీ అని చెప్పలేని భారంతో బరువెక్కింది.

పిల్ల ఏడుపు ఆపడానికని కింద గుండీ ఒక్కటే విప్పి జాకట్టు ఎత్తి రొమ్ముని అందించింది. భాగ్యానికి చీకాకుగావున్నా పిల్లఏడుపు ఆపింది. గుక్కెడు పాలకోసం గుంజి గుంజి దవడలు నలుపెట్టాయేమో పిల్ల రొమ్ముని వదిలి ఏడుపు మొదలెట్టింది. భాగ్యం మంచం మీద జబ్బు మనిషిలాదిగి, పిల్ల నెత్తుకొని అటూ ఇటూ తిప్పింది. అప్పుడు ఆమె కంట తాళం చెవుల గుత్తుపడింది.

'అరే పార్వతమ్మ తాళాలు వదిలేసిందే?' భాగ్యం పైకే అనుకుంది. గంటలో వస్తానన్న పార్వతమ్మ ఇంకా రాలేదేమిటా!' అని తలుపు దాక వచ్చి చూసింది. అప్పటికే సాయంత్రమయిపోయింది.

"తాళాల్లేక గాని రాలేదా? ఎక్కడ పడేసాననిగాని వెతుకుతోందా?' 'భాగ్యం తనకి తనే ప్రశ్నించుకొంది. అనుమానం తీరలేదు. మరికొద్దిసేపు చూసి, బిడ్డనెత్తుకొని, తాళం చెవులు పట్టుకొని పార్వతమ్మ ఇంటికి బయలుదేరింది.

కొద్ది కొద్దిగా చీకటి పడుతోంది.

వీధుల్లో మనుషులందరూ మాయమయిపోయినట్టు నిర్మానుష్యంగా వుంది. అలికిడనేదే లేదు. ఒకటీ రెండు సైకిళ్ళు, స్కూటర్లు అప్పుడప్పుడూ రంయ్‌మని మాయమవుతున్నాయి. అక్కడికి అరకిలో మీటరు దూరమున్న మెయిన్ రోడ్‌లోని వాహనాల చప్పుడు విన పడుతోంది.

వీధి ఎంత నిర్మానుష్యంగా వున్నా, ఇళ్ళల్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. పాటలు వినిపిస్తున్నాయి. అది ఆదివారమని, ఏదో సినిమా వస్తోందని భాగ్యం ఇట్టే గ్రహించింది. అప్పుడే వీధిలాంతర్లూ వెలిగాయి. భాగ్యం అటూ ఇటూ చూసింది. తనవంకే తనే అనుకోకుండా చూసింది. నడుం మీద తట్లు. చీరకొంగుని తిప్పుకుంది. భుజం మీద వాలిపోయిన పిల్ల అప్పుడప్పుడూ కళ్ళు తెరుస్తున్నా నిద్రట్లోకి జోగుతున్నట్టేవుంది.

భాగ్యం క్వార్టర్సు దాటింది. వెనుకవున్న సన్నటి రోడ్డూ దాటింది. పార్వతమ్మ ఇంటివేపు వెళ్తూ అటూ ఇటూ చూసింది. సంచారం లేదు. ఇంటిముందు వుండే వీధిలాంతరు వెలిగి ఆరి ఆరి వెలిగి కొట్టుకుంటోంది.

పార్వతమ్మ ఇంటి గుమ్మంలో భాగ్యం అడుగుపెట్టేసరికి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. తలుపులు చేరవేసి వున్నాయి. భాగ్యంకు తనపేరే వినిపించడంతో తలుపులు తోయబోయిందల్లా ఆగిపోయింది. అలాగే నిటబడిపోయింది. వినకుండా వుండలేకపోయింది.

"ఏమిట్రా ... నీకేటధికారం వుందనిరా భాగ్యాన్ని బాదేవు...?"

"..............................................."

"తాళి కట్టావా? తనువు పంచుకున్నావా?.... ఒరే లంజికొడుక్కానా ఎందుకు కొట్టావో చెప్పు?"

అది పార్వతమ్మ గొంతే, పరిచయమైన గొంతే... భాగ్యానికర్థ మవుతున్నది.

"ఏటో నువ్వెవడివన్రా? నీహక్కుటి?..."

"నీకనవసరం, నువ్వు నోర్ముయ్యి...."

అది శ్రీనుగొంతు. వాగ్యుద్ధమెవరి మధ్యనో భాగ్యం ఊహకు అందుతున్నది.

"నా నోరు మూసీ.. నానోరు మూసీరొరే... లోకం నోరు ముయ్య గలవా? ఆ పిల్ల బతుకులోన, భాగ్యం బతుకులోన నువూ, దాని మొగుడూ నిప్పులు పోస్నారు. దాని మొగుడు వదిలీసినట్టే..... నువ్వేలు కుంటావా?...."

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు..."

"ఉన్నమాటంటే పిచ్చిమాటా? నువ్వు భాగ్యాన్ని వదలవు కదరా, మరలాటప్పుడు దాన్ని ఏలుకో...."

"ఆ పిల్ల తల్లినా....?"

ఆమాట విన్న భాగ్యం గుండె మరింత వేగంగా కొట్టుకుంది. శ్రీనుకి తనమీద వున్నదేదో స్పష్టమవుతూవుంది.

"మరి ఇన్నాళ్ళూ పిల్ల తల్లి కాదేటి?"

"అయితే పెళ్ళికీ... 'దీనికీ'... ఒకటేనేటి?"

"ఒకటి కాదురా నువ్వేళ్ళి, నీ ఇది... తీర్చుకొచ్చీ, ఆ పాపానికి దాని కడుపున ఒక కాయగాసిన సంగతి తెలీదా? ఆకాయ దానికెందుకు బరువు? నువ్వు పెంచుకో"...

"నే నెందుకు పెంచుకుంటాను....?"

"మగమహారాజువయిపోయావు, ఆడదానిగ పుడితే కాని అర్థం కాదు...."

కొద్దిసేపు మాటలాగిపోయాయి.

"రేపా చేతి పిల్లని తీసుకొస్తాను, ఆ భాగ్యం బతుక్కెందుకు బరువు...."

"ఎక్కడికి తీసుకొస్తావ్?"

"ఎక్కడికి తీసుకొస్తాను? నువ్వు చేసిన పనికి ఇక్కడికే...."

"నీకేం మతిపోయిందే...." శ్రీను గొంతు రెచ్చిపోయింది. ఉక్రోషం అణచుకోలేని ఉద్వేగం ఆ గొంతులో.

"నేను తీసుకొచ్చే తీరుతాను...." సహనంగా శాంతంగా అంటున్న పార్వతమ్మ గొంతులోని పట్టుదల తెలుస్తూనే వుంది.

"నేనొప్పుకోను..."

"నేను మాత్రం తీసుకొచ్చే తీరుతాను...."

"తేడానికి ఏిల్లేదు...."

"తెస్తాను... తెస్తాను... తెచ్చి తీర్తాను...."

"అంతగా ఇష్టమయితే నువ్వే వెళ్ళు... నువేపోయి చాకిరీ చెయ్యి...ఫో...ఫో..."

శ్రీను అలాకసురుకున్న తర్వాత పార్వతమ్మ గొంతు వినిపించలేదు. బాగ్యంలో ఉత్కంఠ పెరిగింది. గడియయినా నిలబడలేకపోతూవుంది. అగడపలోనే గోడకి చేరగిలబడింది.

ఇంతలో పెద్ద నవ్వు ....

ఆనందం పట్టలేనట్టుందా నవ్వు....

భాగ్యం ఆ నవ్వుని గుర్తుపట్టింది. పార్వతమ్మ పెనిమిటి సన్యాశిదా నవ్వు.

"కొడుకు బతుకు కన్నా...పరువు కన్నా, ఊరమ్మదాయి ఎవర్తో ఉరిపోసుకు చచ్చిపోతుందట, ఇదిక్కడ పీక్కు చచ్చిపోతంది. చెప్పరా...ఆ మల్లేశ్వర్రావు కూతుర్ని చేసుకుంటానని చెప్పు. డబ్బై వేలు కట్నం...మగాడివి నీకేం?... ఆడముండలకి అర్థంలేని ఆవేశాలూ అధికారాలూ పనికి రావని చెప్పరా..చెప్పు..మీయమ్మకి.. పార్వతమ్మకి...'

భాగ్యం ఆ మాటలకు ఆశ్చర్యపోతూ చేరవేసి వున్న తలుపు రెక్కల సందుల్లోంచి చూసింది. సన్యాసి - కొడుకు శ్రీనుతో అంటున్నాడు. గర్వంగా కాళ్ళు చాపుకొని ఇంట్లోనే తాగుతున్నాడు.

"నీకు తెలియదేమోగాని, నీ సంగతి తెలిసినోళ్ళెవ్వరూ నీకు పిల్లనివ్వరు..." పార్వతమ్మ ఏదో యుద్ధం చేస్తున్నట్టేవుంది.

"అయ్యో... ఎలాగరా?" వ్యంగంగా అని, రెండు గుక్కిళ్ళు మింగి 'నా శ్రీను కూతురికి ఎలగపెళ్ళవుతాదిరా బాబో' ఏడుస్తూ ముక్కు చీదుతున్నాడు సన్యాశి.

"ఆడు కూతరయివుంటే వందమంది అళ్ళుల్లొచ్చుందురేమోగాని, కొడుకయిపోవడం ఒక్క కోడలూ రాదు...పార్వతమ్మ తగ్గడం లేదు.

పగలబడి..... నవ్వాడు సన్యాశి.

తండ్రి నవ్వుకు ముచ్చటవేసో శ్రీనూ నవ్వుతున్నాడు. ఆ నవ్వు కాదు భాగ్యానికి ఆశ్చర్యం కలిగించింది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే తండ్రి కొడుకులేనా? పాళ్ళూ, నీళ్ళూ అయి కలిసిపోతున్నారు?

"శ్రీను చెప్పరా పదిలేలు తగ్గిస్తే .. పదిమంది పోటీ పడతారని చెప్పు...." ఎదురుగా వున్న భార్యతో కాక, అవి భార్యనే అంటున్నా సరే - శ్రీనుతోనే చెప్తున్నాడు.

'అయ్యో, కొడుకూ చేసిన ఉద్యోగానికి వేలుకట్నాలిచ్చీరేల?" పార్వతమ్మ పెనిమిటీ కొడుకూ ఎవరో ఒకరివంక చూసి అనడం లేదు.

"ఎందుకివ్వరు? ఉద్యోగం లేకపోతే ఆ డబ్బేదో ఆలే కడతారు, కట్టి మరీ తెప్పించుకుంటారు. లేదూ బూములూ ఆస్తులూ వుంటే ఇల్లరికం వుంచుకుంటారు...." సన్యాశి ముఖంలో ఎక్కడలేని ధైర్యమూ, ధీమా అగుపిస్తున్నాయి.

"ఆ భోగం ఎన్నాళ్ళుండిపోదు. లేపోతే ఎంతబతుకు ఎంతకొచ్చింది? అయినా సిగ్గూ లజ్జా లేదు. సీమూ నెత్తురూలేదు. వుంటే ఆడకూతురు చెమటోడిస్తే కుంబాలకి కుంభాలు మింగరు..." పార్వతమ్మ గొంతులోనూ ముఖంలోనూ అసహ్యం నిండివుంది.

"పోసి ఎల్లే... మా కష్టబడిపోతున్నావ్... నువ్వు లేకపోతే చచ్చిపోం ...." ఆ మాటల్ని ఈ దపా శ్రీనుతోనో గోడతోనో అనలేదు, పార్వతమ్మతోనే అన్నాడు సన్యాశి.

"అలాగే ఎల్తాను. మీరెవ్వలూ నాకు జడిపించక్కర్లేదు. కాసిన ధరమానికి పెద్దోల్ని చెయ్యాలనీసి అనుకున్నాను. అందుకే కుటమావుని ఇంతదాక ఈడ్చుకొచ్చాను. మీరది వుంచూకోలేదు. నాకు శక్తి లేదు. అందుకే నడిపోడ్ని ఆలమావ దగర పెట్టాను. అవ్వ చేను మేస్తే దూడ గట్టు మెయ్యదు. అందుకనే అద్దూ పొయినంత పొండు. బుద్ధిగయితే బువ్వతింటాడని మావ దగ్గర పెట్టాను. చిన్నోడ్ని హాస్టల్లో వుంచీసాను. రేపు ఆడి చదువూ పూర్తయి రెక్కలొస్తే ఆడే ఎగిరిపోతాడు. వయసినోళ్ళయిన పెద్దపిల్లలూ బతికేస్తారు. మీ బతుకా మీరూ బతికేస్తారు. నాతోవ నేనూ చూసుకుంటాను...."

పార్వతమ్మ అనాల్సిన నాలుగు మాటలూ అనేసాక, అక్కడింక నిలబడలేదు. ఇంట్లోంచి బయటకు వస్తుంటే శ్రీను అడ్డంపడబోయాడు.

"నిన్నుగన్న నీ తండ్రికీ..నీకూ చేతులెత్తి మొక్కుతాను. నావెంట పడకండి.. పడినా నేను ఒప్పుకోను...." పార్వతమ్మ మాటల్లో బయటకొస్తుంటే తలుపుచాటున అంతదాక వింటూ వున్న భాగ్యం గబగబా అక్కడ్నుంచి నడిచి రోడ్డెక్కింది.

ఆ వెంటే పార్వతమ్మా రోడ్డుమీదికోస్తూ, చీకట్లో వడివడిగా నడుస్తున్న భాగ్యాన్ని గమనించింది. భాగ్యం' పిలుస్తూనే చేరువయింది. ఇద్దరూ ఇల్లు చేరారు.

భాగ్యం తాళం తీసింది.

ఆ రాత్రి ఎప్పుడుకి తెల్లవారుతుందా అని వారిద్దరూ ఎదురుచూస్తూ గడిపారు. భారంగానే చీకటి తొలగిపోతూ తెల్లవారి వెలుగు వాకిట్లోకొచ్చింది.

భాగ్యం పిల్ల నెత్తుకుంది. పెట్టినేమో పార్వతమ్మ పట్టుకుంది. దారేదో స్పష్టంగా కనబడుతున్నట్టు ఇద్దరూ ముందుకడుగులు వేసారు. చుట్టుపక్కలవారి చూపులు వాళ్ళ నడకకి ఆటంకం కాలేదు.

చాలా దూరం నడిచాక, దగ్గరి వాసలతో పాకలూ, వాటి మధ్య పెంకుటిళ్ళూ, రేకుల ఇళ్ళూ.... ఒకటీ అరా డాబా ఇల్లు వున్నవాడ వచ్చింది. జనం కిక్కిరి సినట్టే వున్నారు.అక్కడకు చేరగానే పార్వతమ్మ పెట్టినొకరందుకున్నారు. పార్వతమ్మ చూపుతో భాగ్యం చేతిలోని పిల్లనీ అందుకున్నారు.

అవాసలో చివరి ఇంటి తలుపు తీసారు. ఆ గదిలో పెట్టెను పెట్టారు. పార్వతమ్మ వెంటే భాగ్యమూ ఆ ఇంటిలోకి నడిచింది.

"ఇదే మన ఇల్లు" పార్వతమ్మ అంది.

భాగ్యం కళ్ళతోనే తృప్తిగా ఊ కొట్టింది.

"ఇక్కడ చిన్న పిల్లలకి నాలుగక్షరం ముక్కలు నేర్పించావంటే నెలకెంతో కొంత నెలనాడుకి వస్తుంది. నా పన్లు నాకెలాగా వున్నాయి. ఇంటద్దె నూటేభై పోయినా, మన కష్టం మన కడుపు నింపకపోదు....'

' పార్వతమ్మ మాటలకీ అక్కడి వాతావరణానికీ ఆ చిన్న ఇల్లు భాగ్యానికి పెద్దగా విశాలంగా తోచింది.ఇన్నాల్టిలా ఇల్లు పంజరంలా లేదు. పక్షులగూడులా వుంది. స్వేచ్ఛగావుంది. ఆ ఇల్లు ఇంతకు మునుపు ఇల్లులా చీకటితో లేదు. వెలుగుతో నిండివుంది. ఆ వెలుగు పసిదాని కళ్లలోనూ కనిపిస్తోంది. ●

**1994 మే 20, 21, 22 తేదీలలో కర్నూల్ (మహానంది) లో జరిగిన విరసం కథల వర్క్‌షాప్ సందర్భంగా చదివిన కథకు పూర్తి రూపం ఈ 'రెక్కలగూడు'**